ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 125 పేజీలు: 12 వెల: 6.50

అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు 2లో
19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు 5లో

# 175 చోట్ల నగర వనాలు


గురువారం పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

### చెట్లు పెంచనివారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?
### ఒకే రోజున రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు
### అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి మొక్కలు నాటిన సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంనిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్‌లు ప్రమాణం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాఠశాల విద్యార్థిని ప్రమాణం చేయించింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. మొన్నటివరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు.
పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలుకూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి >>2



గురువారం ఎన్‌కౌంటర్‌లో హతమైన సుధాకర్ (ఫైల్)

## మావోయిస్టు అగ్రనేత సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

### ఒక్కొక్కరుగా రాలుతున్న కేంద్ర కమిటీ సభ్యులు
### సుధాకర్ మృతిని ధ్రువీకరించిన బస్తర్ ఐజి సుందర్ రాజ్

**చర్ల , జూన్ 5 (ప్రభాతవార్త):** ఆపరేషన్ కగార్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉధృతం చేసాయి. 2026 మార్చి 31 మావోయిస్టుల అంతమే లక్ష్యంగా చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అడుజాడల్లో భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో వరుస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. తాజాగా నేషనల్ పార్క్ ఏరియాలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు టెంట్ లక్షీ ్మ నర సింహాచలం ఆలియాస్ సుధాకర్ (65) మృతిచెందారు. ఇతనిపై కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రొగడవరం గ్రామం. తండ్రి రామకృష్ణ నాయుడు. సుమారు మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంలో అనేక హోదాల్లో పనిచేసి కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. ప్రస్తుతం ఉన్న >>2

## నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

### ఇద్దరు మృతి, 9 మందికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

**ఆత్మకూరు (నెల్లూరు), జూన్ 5, ప్రభాతవార్త :** ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒక కారు-ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటోలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులోఉన్న ఇద్దరికికూడా గాయాలైనాయి. మొత్తంగా 9మంది గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆత్మకూరు పోలీసులు, వెంకట్రావుపల్లి గ్రామస్తుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలోని 2వవార్డు అయిన వెంకట్రావుపల్లికి చెందిన >>2


కర్ణాటక హైకోర్టు


పోలీస్ కమిషనర్ దయానంద్

## తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

### బెంగళూరు పోలీసు కమిషనర్, డిసిపి సస్పెన్షన్
### సుమోటోగా కేసు విచారణకు స్వీకరించిన కర్ణాటక హైకోర్టు
### కెసిఎ సభ్యులు, ఆర్సీబీ ఈవెంట్ మేనేజర్లపైనా కేసులు
### మృతుల కుటుంబాలకు ఆర్సీబీ రూ. 10 లక్షలు పరిహారం

**బెంగళూరు, జూన్ 5:** ఐపిఎల్‌ఛాంపియన్ టీమ్ ఆర్సీబీ విక్టరీ పెరేడ్‌లో నెలకొన్న విషాదంపై సమగ్ర విచారణకోసం కర్ణాటక ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించింది. నగరంలోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మరోవైపు హైకోర్టు సువోమోటోగా కేసును స్వీకరించింది. అంతేకాకుండా సంఘటనకు బాధ్యులుగా బెంగళూరు నగర కమిషనర్ దయానంద్‌ను సస్పెండ్‌చేస్తూ సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. అలాగే అదనపు కమిషనర్, ఆప్రాంత డిప్యూటికమిషనర్లను స్పెండ్‌చేస్తున్నట్లు ముఖ్యమంత్రిప్రకటించారు. భారీ సంఖ్యలో >>2

## బీచ్ ఫెస్టివల్ ఆరంభం


గురువారం బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దుర్గేష్, రవీంద్ర తదితరులు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించిన మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర
### నాలుగు రోజులు జరుగనున్న వేడుకలు

**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మసులా బీచ్ ఫెస్టివల్-2025 ఘనంగా ప్రారంభమైంది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైన్స్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. తొలుత బీచ్ ముఖ ద్వారంవద్ద ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ బీచ్ ఫెస్టివల్‌ను 4 రోజులపాటు నిర్వహించనున్నారు.

**బీచ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం:**
మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఇక్కడికి వచ్చిన తరువాత చూస్తే చాలా సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను 100 అడుగుల మేర ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. అఖండ గోదావరి కార్యక్రమం చేస్తున్నామని రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో 5 పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాజెక్టులు ఇస్తామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆ 5 ప్రాజెక్టుల్లో మచిలీపట్నం బీచ్‌ను పొందుపరుస్తామన్నారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.
బీస్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ,కాగిత కృష్ణ ప్రసాద్, డిసి ఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు పాల్గొన్నారు. తొలుత బీచ్ ముఖ్య ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేట్‌వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
నాలుగు రోజుపాటు నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద బీచ్ ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు >>2



## పోలీస్ కస్టడీలో మాజీ మంత్రి కాకాణి

**నెల్లూరు రూరల్, జూన్ 5, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్‌కేసు ఆరోపణలతో అరెస్టు అయిన మాజీ మంత్రి వైఎస్‌ఆర్సీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం అందరికీ తెలిసిందే అయితే గురువారం కోర్టులో విచారణ జరిపిన నెల్లూరు అదనపు 5వ మెజిస్ట్రేట్ కోర్టులో కాకాని గోవర్ధన్ రెడ్డి బిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. బెయిల్ పిటిషన్ వాయిదావేస్తూ పోలీస్ కస్టడీలోకి మాజీమంత్రి కాకానిని అప్పగిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 6వ తేదీఉదయం 10:30 నుండి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కస్టడీలోకి తీసుకొని కాకానితరపు న్యాయవాదుల సమక్షంలో విచారణ జరపాలని జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారించేందుకు ప్రభుత్వం తరపు గుంటూరు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజేంద్రప్రసాద్ కోర్టులో వాదనలు వినిపించారు.

## కదులుతున్న 'కల్తీనెయ్యి' డొంక



### సిట్ దర్యాప్తులో మరిన్ని సాక్ష్యాధారాలు లభ్యం
### టిటిడి ఉద్యోగుల సమాచారం ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు

**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన పాపంలో సిబిఐ సిట్ అధికారులు మరింత కీలకసమాచారం సేకరించడంతో సూత్రధారులను పట్టుకునే దిశగా చర్యలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఉత్తరాఖండ్ బోలేబాబా డెయిరీకిచెందిన షోమిల్‌జైన్‌కు అనుచరుడుగా ఉన్న కోల్‌కతాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్యను సిట్ విచారణ చేస్తోంది. అయితే అవసరం మేరకు కొన్ని రకాల నూనెలు సరఫరా చేసినట్లు వివరాలు రాబట్టినా దీనికి సంబంధించి ఎక్కడా నగదు లావాదేవీలు జరగలేదనేది సిట్ రాబట్టిన సమాచారం. రెండు రోజులుగా తిరుపతి అలిపిరిలోని తాత్కాలిక సిట్ కార్యాలయంలో మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వ్యక్తిగత సహాయకుడు (పిఎ)అప్పన్న నుండి కొంత సమాచారం సేకరించిన సిట్ అధికారులు తదుపరి ముగ్గురు ప్రముఖులను విచారణకు తాఖీదులు పంపనున్నారు.
ఇదే జరిగితే కల్తీనెయ్యిలో అసలు సూత్రధారులు బాగోతం వెలుగుచూడనుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. గతంలోనే బోలేబాబా డైరీ, ఏఆర్‌డైరీ, వైష్ణవిడైరీలకు సంబంధించి 15మంది వరకు ముఖ్యులైన మేనేజర్ల నుండి అధికారులు, ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్‌లు, అధికారులు, సిబ్బందిని సిట్ అరెస్టుచేసింది. టిటిడికి గత మూడునాలుగేళ్లలో నెయ్యిసరఫరాకు సంబంధించి అనుమతిలిచ్చిన అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పుడు బయటకు రానుంది.
ఇప్పటికే కల్తీనెయ్యిలో నిందితులు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తర ప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ టచావ్డాలను కస్టడీకి తీసుకుని కీలకమైన ఆధారాలు రాబట్టింది. ఈ డైరీలకు కాంట్రాక్టు ఎలాకేటాయించారు, నెయ్యిసరఫరాలో ఏదేని మతలబు చేశారనేది ఈకల్తీపాపంలో కీలక సూత్ర ధారులను తేల్చేపనిలో సిబిఐ సిట్ >>2

## నేటి నుంచి మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

### కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీల ఏర్పాటు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని డిఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణా రెడ్డి ప్రకటించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 90 నిముషాలు ముందుగానే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని, ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా పోలీసు భద్రత ఉంటుందని వెల్లడించారు.
ఈ నెల 6నుంచి 154 కేంద్రాల్లో ప్రారంభం కానున్న మెగాడిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అన్నిఏర్పాట్లూ పూర్తి చేసింది. రోజుకు రెండు విడతలుగా ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆగస్టు రెండో వారం నాటికి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది హాల్ టిక్కెట్లలో ఏమైనా తప్పులుంటే వాటికి సంబంధించిన గుర్తింపు కార్డులను పరీక్షా కేంద్రాల వద్ద సమర్పిస్తేనే వాటిని సరి చేస్తారు. తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేది, కులం తదితర వివరాలు తప్పుగా నమోదైతే దీనికి సంబంధించిన ఆధారాలను చూపిస్తే నామినల్ రోల్స్‌లో సరి చేస్తారు.
హాల్ టికెట్‌లో ఫొటో లేకపోతే అభ్యర్థులు ఒకరు చొప్పున సాంకేతిక సహాయకులు ఉంటారు. పరీక్షా సమయంలో కంప్యూటర్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తే వారు సరి చేస్తారు. రెండు చేతులూ లేని దివ్యాంగులు, దృష్టిలోపం ఉన్న వారికి పరీక్ష రాసేందుకు సహాయకులను ఏర్పాటుచేస్తారు. పదో తరగతి విద్యార్థులను సహాయకులుగా ఏర్పాటు చేస్తారు. స్క్రైబ్ కోసం ధరఖాస్తు >>2


డ్రగ్స్ కేసు వివరాలను మీడియాకు వివరిస్తున్న డిసిపి సరిత

## బెజవాడలో డ్రగ్స్ కలకలం

### 33 గ్రాముల ఎంఐటిహెచ్ డ్రగ్ స్వాధీనం

**విజయవాడ క్రైం,జూన్ 5,ప్రభాతవార్త:** బెజవాడలో డ్రగ్స్ పట్టుకోవడం కలకలం సృష్టించింది. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డిసిపి కెజివి సరిత నేతృత్వంలో సెంట్రల్ ఎసిపి దామోదార్ పర్యవేక్షణలో పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా పటమట పోలీస్‌స్టేషన్ సిఐ పవన్ కిషోర్,ఎస్ఐ దుర్గాదేవి వారి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో రామవరప్పాడు ఫ్లై ఓవర్ వైపు నుండి విజయవాడ వైపుకు వెళ్తున్న ఎరుపు రంగు ఒలా,నీలం రంగు చేతక్ బైక్ లను ఆపి తనిఖీ చేసారు. సదరు వాహనాలపై సుమారు 20 నుండి 30 సంవత్సరాల వయస్సు కల్గిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించగా,సదరు బైక్ల డిక్కీలలో డ్రగ్స్ పట్టుబడటం సంచలనం కలిగించింది. ఆ బైక్ల డిక్కీలలో వైట్ కలర్ క్రిస్టల్ ఎంఐటిహెచ్ డ్రగ్స్ పాకెట్లు-2,పర్పుల్ కలర్ క్రిస్టల్ ఎంఐటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1,రెడ్ కలర్ క్రిస్టల్ ఎంఐటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1లలో మొత్తం సుమారు 33 గ్రాముల ఎంఐటిహెచ్ డ్రగ్స్,7 సెల్‌ఫోన్లను సాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. విచారణలో సదరు నిందితులు ఆ డ్రగ్స్‌ను నూజివీడుకు చెందిన మనోహర్ అనే వ్యక్తి ద్వారా ఢిల్లీకి చెందిన రింకు నుండి ట్రాక్ ఆన్, డిటిడిసి కొరియర్ల ద్వారా దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులైన పెనమలూరు మండలం, సనత్‌నగర్, రామాలయం స్ట్రీట్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను, ఫన్‌టైమ్స్ రోడ్, టీచర్స్ కాలనీ బొంతు నితీశ్ కుమార్ అలియాస్ బబ్బు, యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరి కొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉంది.



గురువారం అనంతవరం గ్రామంలో మొక్కను నాటిన సిఎం చంద్రబాబు

# 175 చోట్ల నగర వనాలు

>> ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలుఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వెస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు.175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదు.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. అడవులను కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యం. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నేడు ఒక్కరోజే 1 కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నా. మంచి పరిసరాలు ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుంది. అందుకే స్వచ్ఛ భారత్‌లో భాగంగా మనం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. చెత్తను ఇంధనంగా మారుస్తూ ప్రకృతిని కాపాడుతున్నాం. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ పొల్యూషన్ నిర్మూలన అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా పనిచేద్దాం. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకుందాం. మొక్కలు నాటిన తరువాత పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కి తీసుకుంటున్న చర్యలను కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సీఎంకు వివరించారు. రీసైక్లింగ్ అంశంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని చంద్రబాబు సూచించారు. రీసైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకురావాలని సిఎం ఆదేశించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయని, ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**భవిష్యత్తు తరాలకు స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలే: డి.సిఎం పవన్**

భవిష్యత్తు తరాలకు మనం స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.కోటి మొక్కలు నాటి.. వాటిని సంరక్షించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవిలో కార్చిచుల నివారణకు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు మొక్కలు, చెట్లు ఆనవాళ్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్.

నల్లమడల అడవుల్లో పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్న కొండలరావును ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ప్రశంసనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చెట్టులేని జీవితాన్ని ఊహించలేమని, ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సిఎంగా ఉన్నారని చెప్పారు. అడవిలో కార్చిచుల నివారణకు కృషి చేస్తానన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ తలమానికంగా ఉండాలని ఆకాంక్షించారు.. ఇక, అందరికి మనస్ఫూర్తిగా పర్యావరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థి దశలోనే యోగా శిక్షణ తప్పని సరి చేసేలా చట్టం

## రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు

**విజయవాడ, జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:**ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు నాంధి పలికేలా యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం అయ్యేలా విద్యార్థి దశలోనే యోగా శిక్షణను తప్పని సరి చేసేలా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ యోగాను పాఠ్యాంశంగా చేసే అంశంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని ఆయన తెలిపారు. యోగాంధ్రా2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అమరావతిలోని రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మానవాళి యావత్తూ ఆరోగ్యంగా సుఖ శాంతులతో జీవనం సాగించాలనే సత్సంకల్పంతో భారతీయ ఋషులు ప్రపంచానికి అందజేసిన సనాతన కార్యక్రమం యోగా అన్నారు. అయితే నేటి ఆధునిక సమాజంలో మానవుడు యాంత్రిక జీవన విదానాన్ని అనుసరించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించే యోగా కార్యక్రమం కనుమరుగు అయిపోతున్నదన్నారు.

ఈ యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నెల 21 న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్నారన్నారు. విశాఖపట్నం వేదికగా ఆర్.కె.బీచ్ నుండి భీమిలి వరకూ మరియు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ వేడుకల్లోనిర్వహించడం జరుగుచున్నదని, ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరుగుచున్నదన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీకారంచుట్టారని, ఈకార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని, యోగాను అభ్యసిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కె. రఘు రామకృష్ణ రాజు మాట్లాడుతూ పూర్వీకులు మనకు అందజేసిన యోగాభ్యాసాలు కాల క్రమీణ కనుమరుగు అయ్యే పరిస్థితులు ఏర్పాటు తున్నాయని, అటు వంటి ఉత్తమ ప్రక్రియలను తిరిగి సంగ్రహించే కార్యక్రమం రాష్ట్రంలో మొదలైందన్నారు. విద్యార్థి దశ నుండే యోగాను పాఠ్యాంశంగా చేర్చితే మంచి ఫలితాలు ఉంటాయని, అందుకు తగ్గట్టుగా చట్టాన్ని రూపొందించే అంశంపై దృష్టి సారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత నెల 21 నుండి ఈ నెల 21 వ తేదీ వరకు యోగాంధ్రా2025 కార్యక్రమాన్నిరాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బారీ స్థాయిలో నిర్వహించడం జరుగుచున్నదని, ప్రజలు పెద్దఎత్తున ఈ శిక్షణాకార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు. ప్రపంచ దృష్టిని అకర్షించే విధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న విశాఖపట్నం ప్రధాన వేదికగా మరియు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్వహించే ఏర్పాట్లు చేయడం జరుగుచున్నదని, దేశ పధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరవుతున్నారన్నారు. అనంతరం ఆయూష్ శాఖ నుండి వచ్చిన వైద్యాధికారులు డా.రామానందం, డా.రత్న ప్రియదర్శిని శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఉపకార్యదర్శులు కె.రాజకుమార్, వనితా రాణి, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు తదితరులతో పాటు శాసన ఉద్యోలు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు

**విజయవాడ ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అమరావతి రాజధాని పరిధిలో ఆస్తుల చిట్టాను ఆధునీకరించనున్నారు. దీని కోసం జియోడేటా బేస్ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి ఆస్తి, వ్యక్తులు, వారి ఆర్థికస్థితి గతులు, భూములకు సంబంధించిన సమగ్ర వివరాలూ ఇక సిఆర్‌డిఏ దగ్గర ఉండనున్నాయి. దీనికోసం సిఆర్‌డిఏ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. డిజిటల్ అమరావతి పేరుతో ఈ సర్వే చేపట్టినా భవిష్యత్‌లో ఆస్తులకు సంబంధించిన నిర్వహణ, వాటిపన్నులు వంటి అంశాలు ఇందులో కీలకం కానున్నాయి. దీనికి తోడు ఆస్తివిలువ ఆధారంగా పన్నులు వసూలు చేసే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఇదే పద్ధతిని అమరావతిలోనూ అమలు చేయనున్నారు. దీనికోసం జియో డేటాబేస్‌ను రూపొందించనున్నారు. రాజధాని నిర్దేశిత ప్రాంతంలో ఉన్న వ్యక్తులు, వారి ఆస్తులు, నివాసాలు, భూమి ఇతర అంశాలకు సంబంధించిన అన్ని వివరాలనూ సమగ్రంగా ఈ డేటాలో ఉంచనున్నారు. దీనికోసం 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒక గ్రిడ్‌గా రూపొందించనున్నారు. మొత్తంగా 60 చదరపు కిలోమీటర్ల నివాస ప్రాంతాలు, 160 చదరపు కిలోమీటర్ల భూములకు సంబంధించిన 30 అంశాలతో కూడిన సమాచారాని పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. దీని ఆధారంగా భవిష్యత్ లావాదేవీలు నిర్వహిస్తారు. అలాగే ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో చేర్చనున్నారు. ప్రస్తుతం ఉంటున్నవారు, కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు అప్పు తీసుకుంటున్న ప్రభుత్వం తిరిగి చెల్లింపుకు రాజధాని పరిధిలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రత్యేకంగా చూపించారు. దీనికోసం ఇప్పుడున్న 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల వివరాలనూ డిజిటలైజ్ చేయనున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న రోడ్లు, భవనాలు, వ్యక్తిగత ఆస్తులకు ప్రత్యేక నెంబర్లు కేటాయించనున్నారు. దీనికోసం మూడుదశల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తారు. మొత్తం సమాచారాన్ని భవిష్యత్ అవసరాలకు ఎలావినియోగించుకోవాలనే ప్రణాళికను రెండోదశలో చేపట్టనున్నారు. మొత్తం సర్వే పూర్తయిన తరువాత యూనిట్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యుఎల్ పిఐఎన్), యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నెంబరు(యుపిఐఎన్), డిజిటల్ డోర్ నెంబర్స్ (డిడిఎన్) కేటాయించనున్నారు. ఈసర్వేతో ప్రస్తుతం ఉన్నవీధుల వివరాలూ, డోర్ నెంబర్లు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం అమరావతికి నగరానికి ఎక్కడకెక్కడ ప్రవేశమార్గాలున్నాయి, 29 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అన్నిరకాల నిర్మాణాలు, ఆస్తుల వివరాలనూ సమగ్రంగా సేకరించనున్నారు.

# తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

>> ఫ్యాన్స్ వస్తున్నందును ముందస్తు జాగ్రత్తగా మరింతగా బలగాలను పెంచి కట్టడిచేయడంలో విఫలం అయినట్లు సిద్ధరామయ్య సర్కారు భావించింది. తదుపరి ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లపైనా చర్యలుంటాయని దర్యాప్తు నివేదిక అందిన తర్వాత వారిపైనాచర్యలుంటాయన్నారు. ముందుగా వీరిని సస్పెండ్‌చేయడంతోపాటు కేసును సిఐడికి బదలీచేసింది.చిన్నస్వామి స్టేడియం ఇన్‌ఛార్జిపైనా చర్యలకు ఆదేశం.అలాగే ఆర్సీబీ ఈవెంట్ సంస్థ, ఆర్సీబీ ప్రతినిధిపైనా కేసులు నమోదుచేయాలని సిఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. ఈకేసులో మొత్తం ఐదుగురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటువేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సభ్యులను కూడా అరెస్టుచేయాలని సిఎం ఆదేశించారు. అలాగే రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర నివేదికను 30 రోజుల్లో అందచేయాలని నిర్దేశించామని సిఎం వెల్లడించారు. విజయోత్సవాలవేళ జరిగిన తొక్కిసలాట ఆపై మరణాలు, తీవ్ర గాయాలపాలయిన సంఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదుపై కబ్బన్‌పార్కు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. ఆర్సీబి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డిఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్స్, కర్ణాటకక్రికెట్ అసోసియేషన్‌సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న అందరిపైనా కేసులునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. నేరపూరిత నిర్లక్ష్యం ఈకకేసులో సంస్థలను నిందితులుగాచేర్చింది. బిఎన్ఎస్‌లోని ఐదు సెక్షన్లకింద కేసులునమోదుచేసామన్నారు.

మరోవైపు ఈకేసు దర్యాప్తును సిఐడికి బదలీచేస్తున్నట్లు సిద్ధరామయ్య సర్కారుప్రకటించింది. కోర్టుకు ఇచ్చిన ప్రగతినివేదికలో కూడా స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తుకోసం సిట్ ఏర్పాటుకావాలన్న ఆదేశాలతోపాటు ఎఫ్ఐఆర్ కాపీని సిఐడికి అప్పగించింది. ఇప్పటికే మెజిస్టీరియల్ విచారణజరుపుతున్నామని తొక్కిసలాటకు కారణాలు, లోపాలు జవాబుదారీ తనం వంటి అంశాలు పరిశీలించేందుకు డిప్యూటి కమిషనర్ బెంగళూరు, జిల్లా మేజిస్ట్రేట్‌లో 15రోజుల్లోపు విచారణనివేదిక ఇస్తారని తెలిపింది. స్టేడియం వద్ద 2.5 లక్షలమంది గుమికూడారని, బెంగళూరు నగర పోలీసులు 1380, కెఎస్ఆర్పి ప్లాటూన్లు 325 మందిని మొహరించి భారీ బందోబస్తు ఏర్పాట్లుచేసామన్నారు. కానీ జనం భారీగా తరలిరావడంతో పలుగేట్లవద్ద తొక్కిసలాట జరిగి 11 మందిచనిపోయారని, 56 మంది గాయపడినట్లు వివరించింది. 1,6,7,17 నుంచి 21 గేట్లవద్దనే ప్రాణనష్టం జరిగింది. వైద్యసాయం వెంటనే అందించామని, క్షతగాత్రుల్లో 50 మంది ఔట్‌పేషెంట్లుగా చికిత్సపొందారని, మరో ఆరుగురికి ఇంకా చికిత్స జరుగుతోందని తెలిపింది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితోపాటు మూడు ఫైర్‌ఇంజన్లు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-శ్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్‌వాహనం ఏర్పాటుచేసినట్లు కోర్టుకు వివరించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ప్రకటించామని, క్షతగాత్రుల వైద్యఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌సైతం మృతులకు రూ.5 లక్షల చొప్పునపరిహారం చెల్లించనున్నట్లుప్రకటించింది.

**మృతులకుటుంబాలకు రూ.10 లక్షలు..ఆర్సీబీ**

విజయోత్సవాల విషాదంపై రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం స్పందించింది. తన అధికారిక సోషల్‌మీడియా హ్యాండిల్‌పై పోస్టుపెట్టి వరుసగా అప్‌డేట్లు ఇచ్చింది. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 లక్షలచొప్పున పరిహారం ఇస్తామని వెల్లడించింది. అలాగే గాయపడిన వారి సహాయార్థం ఆర్సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటుచేస్తున్నట్లుప్రకటించింది. ప్రభుత్వంనుంచి మృతులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుపరిహారం ప్రకటించగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కూడా ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షలచొప్పున పరిహారం అందిస్తామని ముందుకువచ్చింది.

# ఆన్‌లైన్ పరీక్షలు

>> చేసుకున్న వారు 1300 మంది వరకూ ఉన్నారు. ఒకవేళ ధరఖాస్తులో స్క్రైబ్ కావాలని పేర్కొనకపోయినా అవసరమైతే డిఇఒ పరిశీలించి, ఏర్పాటు చేస్తారు. వీరికి అదనంగా 50 నిముషాలు సమయఉంటుంది.రాష్ట్ర వ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు అన్ని పోస్టులకు కలిపి 5,77,417 ధరఖాస్తులు సమర్పించారు. ఇప్పటి వరకు 3.04 లక్షల మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోని వారి ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపిస్తున్నారు. పోస్టులకు సంబంధించిన మొత్తం పరీక్షలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు ప్రాథమిక 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాల స్వీకరణకు వారం రోజులు గడువు ఇస్తారు. ధరఖాస్తుల సమయంలోనే పోస్టులకు ప్రాధాన్యత తీసుకున్నందున అభ్యర్థులకు వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

# 'కల్తీనెయ్యి' డొంక

>> అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. గత ఏడాది జూన్‌లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనేది గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి ఆధారాలు బయటకు వచ్చాయి.ఆ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని,అయితే కొన్ని రకాల ఆహారపదార్థాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు కూడా నివేదికలు వెల్లడించారు.గత ఏడాదిలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఉన్నతాధికారులు తిరుమలలో నెయ్యి తీసుకోకుండా ఆ ట్యాంకర్లను వెనక్కుపంపిన విషయం విదితమే. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు ఏఆర్ డైరీ నెయ్యిట్యాంకర్లను తిప్పిపంపారు. మరీ జులైలో కల్తీనెయ్యి వ్యవహారం వెలుగుచూస్తే గత సెప్టెంబర్ వరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది ఇప్పుడు సిట్ ప్రధానంగా దృష్టి సారించింది. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది. ఎందుకు మూడేళ్ళు మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో వెలుగుచూడనుంది.

# ఆగస్టు 15 కల్లా లక్షల బంగారు కుటుంబాల దత్తత

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**విజయవాడ.,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** జీరో పావర్టీ పి4 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుం బాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్,దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పిపిపి విధానానికి కొనసాగింపుగానే నేడు పి4 విధానం తీసుకువచ్చామని అన్నారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీఓ పావర్టీ పి4పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి...స్మార్ట్ ఏపీ ఫౌండషన్‌ను స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ మార్చాలని నిర్ధేశించారు. అమరావతి పి4కి కేస్ స్టడీగా నిలుస్తుందని, రాజధాని నిర్మాణంలో 29వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు.

## వారం - వర్జ్యం

తేది : 06-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి తె.4.48
హస్త ఉ.6.33
వర్జ్యం మ.3.35-సా.5.24
దు.ఉ.8.12-9.04, 2) మ.12.33-1.25
శుభ సమయం : ఉ.9.10-9.45
రాహుకాలం – ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** వివాహ, ఉద్యోగయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెట్టినా ముందుకు సాగుతారు.

**వృషభం :** కుటుంబ సభ్యులతో అకారణంగా విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కర్కాటకం :** భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా వుండదు. వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. పారిశ్రామిక, కళారంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన చికాకులు పెడతాయి. ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటుకాగలదు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చేపట్టిన కార్య క్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి.

**మకరం:** వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కుంభం:** ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకుసాగుతారు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మీనం:** మిత్రులసాయంతో ముఖ్యమైన పనులు కొంతవరకు పూర్తిచేస్తారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



కర్గిజ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి జీన్‌బెక్ కులుబెయెవ్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన దృశ్యం

# అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ వర్సిటీ

## బిసిఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు అడుగులు

## ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)కు చెందిన బిసిఐ ట్రస్ట్ ఫ్లె ఫస్ట్ అథ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు బిసిఐ ట్రస్ట్ ముందుకొచ్చిన విషయం విదితమే. బిసిఐ అధ్యక్షుడు,కీలక సభ్యులు ఇప్పటికే గవర్నర్ అబ్దుల్ నజీర్,ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అమరావతిలో బిసిఐ నెలకొల్పబోయే న్యాయ యూనివర్సిటీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆర్బిట్రేషన్ సెంటర్ సైతం ఏర్పాటు కానుంది. అంతేకాక న్యాయ,అనుబంధ రంగాల్లో ఉన్నత విద్యావకాశాల కల్పనకు నైపుణ్యాభివృద్ధికి ఈ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడుతుంది.బీసిఐ ట్రస్ట్ అథ్వర్యంలో బెంగుళూరులో 1986లో నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్‌యూ), 2022లో గోవాలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐయూఎల్ఇఆర్) ఏర్పాటు అయ్యాయి. అవి ఎంతో ప్రతిష్టాత్మక సంస్థలుగా ఖ్యాతి గడించాయి.

# పెట్టుబడి ప్రతిపాదనే పర్యవేక్షణ

## కార్యరూపంలోకి తెచ్చేందుకు పిఎంయు కమిటీ

## 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమిప్రభుత్వం ఏడాదిలో రూ.9.20 లక్షలకోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. వాటితో పాటు 1,19,580 చిన్న,మధ్య తరహా పరిశ్రమల ద్వారా రూ.13,895 కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. 20 లక్షల ఉద్యోగాలు,ఉపాధి కల్పనపై మంత్రులు,అధికారులతో ఉండవల్లి లోని నివాసంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ పెట్టుబడులతో ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా 8.5 లక్షల మందికి ఉపాధి లబిస్తుంది. ఎన్టీపీసీ,బిపిఎల్,రిలయన్స్,టాటాపవర్ వంటి సంస్థల కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పిఎంయూ)లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన భూములు,మౌలిక సదుపాయాలు కల్పించాలి. విశాఖలో ఒబెరాయ్,వరుణ్ బీచ్ శాండ్స్ వంటి స్టార్ హోటళ్ళ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. బీసీసీఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మైదానం నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. పారిశ్రామిక వేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వాట్సప్ గవర్నెన్స్‌తో అనుసంధానించాలి అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ,దుర్గేష్,టిజి భరత్,కొండపల్లి శ్రీనివాస్,కొల్లు రవీంధ్ర,గొట్టిపాటి రవికుమార్,పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

>> కేంద్ర కమిటీ సభ్యుల్లో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నాడు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ ఐజీ విడుదల చేసిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు పాపారావుతోపాటు మరికొందరు సభ్యులు ఉన్నట్లు నిఘావర్గాలకు సమాచారం అందిందని ఈ క్రమంలో వారినే లక్ష్యంగా చేసుకొని డిఆర్జీ ఎస్టీఎఫ్ కోబ్రా సంయుక్త బలగాలు నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని అన్నారు.మావోల స్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతిచెందాడని ఘటన ప్రాంతంలో మావోయిస్టు ఆయుధాలు ఇతర సామాగ్రి లభ్యం అయ్యాయని తప్పించుకున్న మావోల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.కాగా ఈ ఎన్ కౌంటర్‌పై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఎదురుకాల్పులు జరిగితే కేంద్ర కమిటీ సభ్యుడు ఒక్కరే ఎలా చనిపోతారని ఆయనకు ఉన్న భద్రతా వలయంలో ఎవ్వరికీ ఎమి కాకుండా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

మావోయిస్టు ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న అగ్రనేతలను కేంద్ర కమిటీ సభ్యులను టార్గెట్ చేస్తు ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.అగ్రనేతలను హతమార్చితే క్రింది స్థాయి కేడర్ నిస్తేజం అలుముకొని లొంగుబాట్లు అధికంగా ఉంటాయని కొందరు ప్రాణభయంలో ఉద్యమాన్ని వీడి స్వచ్ఛందంగా జన జీవనంలో కలుస్తారనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన విధానం లాగా కనిపిస్తుంది. గడిచిన ఐదు నెలల కాలంలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు చలపతి మనోజ్ సుధాకర్ తోపాటు మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక గుడ్డు మరికొందరు నేతలు ఉండటం గమనార్హం..

# బీచ్ ఫెస్టివల్ ఆరంభం

>> రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్ లో ఇంత పెద్ద ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. 2018లో బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని కానీ గత పాలకులు దీనిని నాశనం చేసారని మండిపడ్డారు. బీచ్ లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధికి ఈ సభ ద్వారా తొలి అడుగు వేశామని అన్నారు. 3 రోజుల పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా గ్లైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీ బాల్, కయాకింగ్ సహా అనేక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దేశంలో అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని మంత్రి తెలిపారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

**అమెరికాలో ఉంటే ఇంత ఆనందం ఉండేది కాదు**

తనది కృష్ణా జిల్లా అని ఇక్కడే పుట్టామని తానా మాజీ అధ్యక్షులు కోమటి జయరాం తెలిపారు. అమెరికాలో ఇటువంటి బీచ్ ఉంటే కమర్షియల్ చేస్తారన్నారు. కానీ ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఈ ప్రాంతానికేనా గుర్తింపు వస్తుందని వెల్లడించారు. మచిలీపట్నం బీచ్ టూరిస్ట్ హబ్‌గా అభివృధి చెందాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం పర్యాటక అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

>> 9మందిమహిళలు అదేగ్రామానికి చెందినఆటోలో పొగాకు గ్రేడింగ్‌కు సమీపగ్రామమైన టి.ముస్తాపురంకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నుంచి ముస్తాపురం వెళ్లేందుకు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులో ఆటో మలుపుతిప్పుతున్న సమయంలో మర్రిపాడు నుండి నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొనింది. ఈ సంఘటనలో వెంకట్రావుపల్లికి చెందిన ఆటో డ్రైవర్, యజమాని అయిన దగ్గుమాటి పుల్లారెడ్డి (45), ఆటోలో ప్రయాణిస్తున్న అజిమా(50)లు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. గౌసున్నీసా, సలీమా, హబీబున్నీసా, అన్వర్‌జాన్, రాబియాబి, మస్తాన్‌బి, బియాన్, బి.గౌసున్నీసా, వరలక్ష్మిలు తదితర 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులో ప్రయాణిస్తున్న తిక్కవరంకు చెందిన చంద్రా నారాయణస్వామికి, మర్రిపాడుకు చెందిన గంగవరపు శ్రీనివాసులు నాయుడుకు గాయాలైనాయి. సంఘటన తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్, స్థానిక ఎస్ఐ జిలానీలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కారులో గాయపడిన వారిని వారి బంధువులు నెల్లూరులోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులోని ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంకట్రావుపల్లిలోని క్షతగాత్రులైన వారి బంధువులు పెద్ద సంఖ్యలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆసుపత్రి ప్రాంగణంలో బంధువర్గాల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ప్రమాద కారణాలను బాధితుల ద్వారా తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అత్యాధునిక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్

## రూ.850 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు



### ప్లాట్‌ఫాంల సంఖ్య 12కు పెరిగే అవకాశం

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే అత్యాధునీక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్ రూపుదిద్దుకుంటోంది. వచ్చే మూడు దశాబ్దాల్లో పెరగనున్న ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు నీతి ఆయోగ్ పచ్చజెండా ఊపింది. రైల్వేస్టేషన్ తాజాగా కేటగిరి1లో చేరడంతో రూ.850 కోట్లతో పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రోజుకు 1.14 లక్షలు, రద్దీ వేళల్లో గంటకు 9,120 మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2061 నాటికి రోజుకు 2 లక్షలకు చేరుతారనేది అంచనా. దానికి తగ్గట్టుగా రద్దీ సమయాల్లో ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రధాన మార్గం వైపు మాత్రమే అభివృద్ధి అంతా సాగుతుండగా కొత్త రైల్వేస్టేషన్‌లో పశ్చిమం వైపు కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోనే కీలకమైన స్టేషన్ విజయవాడ. నిత్యం లక్ష మంది, పండగలు, సెలవు రోజుల్లో 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. 10 ప్లాట్‌ఫాంలున్న స్టేషన్ నుంచి నిత్యం 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు బండ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమైన రైల్వేజంక్షన్ కావడంతో ఆదాయంలోనూ అగ్రస్థానంలో ఉంటోంది. చారిత్రక, వారసత్వ సంపద కలిగిన స్టేషన్‌గా, ఐదు ప్రవేశ ద్వారాలతో విజయవాడ అరుదైన గుర్తింపు పొందింది. ఏడాదికి వచ్చే ఆదాయం రూ.500 కోట్లు దాటడంతో గతేడాది బెజవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ 1 హోదా సాధించిందిప్రయాణికుల రాకపోకలు, వారికి అందుతున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వేస్టేషన్లను వివిధ కేటగిరీలుగా విభజిస్తుంది. ఏటా రూ. 500 కోట్ల కన్నా ఎక్కువ వార్షిక ఆదాయం లేదా 20 మిలియన్ల ప్రయాణికుల రాకపోకలు సాగించే స్టేషన్లకు ఎన్ఎస జీ 1 హోదా కేటగిరీ ఇస్తారు. దిల్లీ సహా కొన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఉన్న టాప్ రైల్వేస్టేషన్లకు మాత్రమే ఇప్పటి వరకు ఈ హోదా ఉండగా తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్ ఆ జాబితాల చేరింది. కేంద్ర ప్రభుత్వం విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఎన్ఎస్‌జీ 1 హోదా కేటాయించింది. రాష్ట్రంలో ఈ హోదా కలిగిన ఏకైక రైల్వేస్టేషన్ ఇదొక్కటే. ఎన్ఎస్ జీ 1 హోదా కోసం విజయవాడ రైల్వే స్టేషన్ చాలా ఏళ్లుగా పోటీపడుతోంది. 201718లో కేవలం రెండు ప్రమాణాల్లో వెనకబడిపోయి హోదా చేజార్చుకుంది. ఐదేళ్ల తర్వాత 202324 రైల్వే బోర్డు తాజా సమీక్షలో రూ. 528 కోట్ల వార్షిక ఆదాయంతో ఎన్ఎస్ జీ 1 హోదా ఒడిసిపట్టుకుంది. 202324లో దాదాపు 16.84 మిలియన్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. కొత్తగుర్తింపుతో దేశంలోని టాప్ 28 స్టేషన్లతో ఉన్న ఎలైట్ గ్రూప్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ చోటు దక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తర్వాత ఎన్ఎస్ జీ 1 హోదా కలిగిన స్టేషన్ విజయవాడ మాత్రమే. ఇక్కడ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

## ప్యానెల్ అడ్వకేట్‌గా ఎన్.శ్రీనివాసరావు నియామకం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తరఫున ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, రాష్ట్ర వినియోగదారుల హక్కుల కమిషన్, అమరావతి ప్యానల్ అడ్వకేట్‌గా రాష్ట్ర హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ తరఫున మూడు జ్యుడీషియల్ ఫోరంలలో కేసులను వాదించేందుకు, న్యాయ సలహాలు అందించేందుకు నర్రా శ్రీనివాసరావును తమ ప్యానల్ అడ్వకేట్‌గా మూడు సంవత్సరాల కాల పరిమితికి నియామకం చేశారు. ఈ మేరకు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విజయవాడ జోన్ అధికారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



నర్రా శ్రీనివాసరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి మాస్టర్ ఆఫ్ లా పట్టాను పొందారు. 1999లో రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదిగా నమోదయ్యారు. గత 26 సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తున్న శ్రీనివాసరావు గుంటూరు జిల్లా కోర్టు, పలు హైకోర్టులు, సుప్రీంకోర్టులో కక్షిదారులకు సేవలందించారు. ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలకు న్యాయ సలహా దారునిగా పని చేస్తున్నారు. శ్రీనివాసరావుకు పలువురు న్యాయవాదులు అభినందించారు.

## అనారోగ్యం అనూహ్యమైనది.. మనిషి చేతుల్లో లేనిది

### హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్యానికి ఎప్పుడు గురవుతామనేది మనిషి చేతుల్లో లేని వ్యవహారం.మానవ నియంత్రణలో లేని ఇలాంటి విషయాల్లో..అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు లేకపోతే పరీక్షలు రాయడానికి అనర్హులవుతారనే నిబంధన పెట్టడానికి వీల్లేదు.ఇలాంటి నిబంధన సహేతుకం కాదు అని హైకోర్టు స్పష్టం చేసింది. అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయిన ఓ విద్యార్థి సెమిస్టర్ ఫలితాలు వెంటనే ప్రకటించాలని, తరగతులకు అనుమతించాలని విజయనగరం జిల్లా రాజాంలో ఉన్న జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(జీఎంఆర్ఐటీ)కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల ఈ మేకు తీర్పు ఇచ్చారు.జీఎంఆర్ఐటీలో బీవీకె కౌశిక్ బిటెక్ చదువుతున్నారు.అనారోగ్యం వల్ల గతేడాది కొన్ని రోజులు తరగతులకు హాజరుకాలేక పోయారు. హాజరు తక్కువవుతుందని మూడో సెమిస్టర్ పరీక్షకు కళాశాల అనుమతించక పోవడంతో ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం పరీక్ష రాయడానికి అనుమతినిచ్చింది. కౌశిక్ మరో వ్యాజ్యం వేస్తూ ఫలితాలు వెల్లడించేలా ఆదేశించాలని, నాలుగో సెమిస్టర్‌కు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. ఈ రెండు వ్యాజ్యాలపై న్యాయమూర్తి విచారణ జరిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు తప్పని సరిగా ఉండాలని నిబంధన సరికాదు. ఈ నిబంధన ప్రభుత్వం తెచ్చింది కాదు. ప్రైవేటు కళాశాల జీఎంఆర్ తీసుకువచ్చింది. అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మెగా డిఎస్సీకి నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

## మద్యం కుంభకోణం నిందితుల బెయిలు పిటిషన్లపై విచారణ వాయిదా

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌పై విజయవాడ సీబిఐ కోర్టు (ఏసిబీ కోర్టు ఇన్‌ఛార్జి)బుధవారం విచారణ జరిపింది. సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం బెయిలుపై విచారణ ఈ నెల 6కు వాయిదా పడింది. మరోవైపు విజయవాడ జిల్లా జైలు బ్యారెక్‌లో ఒక్కడినే ఉన్నానని, కనీసం ఇద్దరు ఉండే మరో బ్యారెక్‌కు మార్చాలని కెసిరెడ్డి చేసిన అభ్యర్థనకు న్యాయాధికారి సానుకూలంగా స్పందించారు. కారాగార నిబంధనల ప్రకారం కెసిరెడ్డిని మరో బ్యారెక్ లోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించారు. మరో వైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి,కృష్ణమోహనరెడ్డిలు బెయిలు పిటీషన్లు దాఖలు చేశారు.

## నగర వనంలో రూ.2 కోట్లతో మొక్కల పంపిణి

### జిల్లాలో 5లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

### కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్




**శ్రీకాళహస్తి,జూన్ 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలోని రామాపురం రిజర్వాయర్ సమీపంలో రూ. 2కోట్లతో 'నగరవనం' కార్యక్రమాలకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ శ్రీకారం చుట్టారు. హరితాంధ్ర పథకంలో భాగంగా బైరాజు కండ్రిగ సమీపంలోని అడవుల్లో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ పర్యావరణం, అటవీసంపద బాగుంటేనే మనందరం కాలుష్యరహిత ఆరోగ్యకర జీవనం కల్గి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడే దిశగా మొక్కలు నాటి తమ పరిసరాలను పచ్చగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని ప్రస్తుతం 30శాతం నుంచి 50శాతానికి పెంచటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అధికారులు వివరించారు. నగరవనం రూ. 2కోట్లతో సమగ్రసదుపాయాలతో చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రం, జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కల్పించాలన్నారు. తిరుపతి జిల్లాలో 5లక్షలకు పైగా మొక్కలు నాటాలన్నదే లక్ష్యంగా వివరించారు. గురువారం జిల్లాలోని ప్రతి గ్రామంలో అటవి, టిటిడి సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ మహత్తర కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్లాస్టిక్ వాడకం మన జీవన శైలిలో భాగమైపోయిందన్నారు. మనం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. చెట్టు కొట్టివేయటం వల్ల కానీ ప్లాస్టిక్ ఎక్కువ వాడకం వల్ల ప్రమాదం కొని తెచ్చుకున్నామన్నారు. కెవిబిపురం నుంచి గిరిప్రదక్షిణ సంబంధించిన కనెక్టివిటి రోడ్డు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇక్కడ స్థానిక ప్రజలకు ఆదాయాలు పెరుగుతాయని వివరించారు. అంతేకాక ఉద్యోగవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వెంకటేశ్వరన్ వివరించారు. అటవీ సంరక్షణ అధికారి సెల్వం మాట్లాడుతూ భారత ప్రభుత్వం యొక్క ప్రధాన ఆటవీకరణ చొరవ అయిన వన మహోత్సవం వేడుకలు 1950లో ప్రారంభించబడ్డాయని వివరించారు. ఇప్పటికి వరుసగా 75 సంవత్సరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

## ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్‌తో పాటు ఇతర సదుపాయాలను అందించే కార్యక్రమాన్ని 13 జిల్లా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నామని చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి దశగా విజయనగరంలో ఈ నెల 7, 8 తేదీల్లో ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా నేడు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యక్రమ బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, సభ్యులు డాక్టర్ ఎస్. కేశవరావు బాబు, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో వైద్య మండలి సిబ్బంది ఆయా జిల్లా కేంద్రాల్లో సేవలందిస్తారు. గతంలో రెన్యువల్ పూర్తయిన తర్వాత మాత్రమే రెన్యువల్ చేసేవారు, ఇప్పుడు 3 నెలల ముందు కూడా రెన్యువల్ సౌకర్యం కల్పిస్తున్నామని చైర్మన్ వివరించారు. అలాగే, ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో, 21, 22 తేదీల్లో కాకినాడలో, 28, 29 తేదీల్లో తిరుపతి మెడికల్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమాల్లో మండలి సభ్యులు డాక్టర్ సుజాతా, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కె. సుబ్బా నాయుడు, డాక్టర్ స్వర్ణ గీత, రిజిస్ట్రార్ రమేశ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమం వైద్యులకు సౌలభ్యాన్ని అందించడంతో పాటు రాష్ట్రంలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచే దిశగా ఒక ముఖ్యమైన అడుగని చైర్మన్ అన్నారు.

## ఎపి మీడియా అకాడమి, ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ



**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి, ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రెవిన్యూ కాలనీలో సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు మెరుగు పరచేందుకు తాను అత్యంత ప్రాధాన్యత యివ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. మీడియా విస్తృతి, సంక్లిష్టత కారణంగా యీ నిర్ణయం అవసరమని ఆయన అభిప్రాయ పడ్డారు. మీడికా అకాడమి ప్రాథమిక విధుల్లో ఇది ఒకటని ఆయన యీ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా, సోషల్ మీడియాను దృష్టిలో వుంచుకుని అవసరమైన సందర్భాల్లో నియంత్రణ చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సరియైన సమాచారాన్ని పొందడంలో యిది ఒక భాగమే కనుక మీడియా అకాడమి పరిధిలో లేకపోయినా యీ విషయపై దృష్టి సారించాల్సి వుంటుందన్నారు. తనను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుసభా ముఖంగా ధన్యవాదాలు తెలిపారఅంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేశ్ కుమార్‌కు సూచించారు. సి.రాఘవాచారి మీడియా అకాడమి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఆలపాటి సురేశ్ కుమార్‌కు ఎపియుడబ్ల్యూజె, ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలు ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ , హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డప్ప, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

## దంపతులు ఒకేచోట పనిచేసేలా వెసులుబాటు

### బదలీలలపై వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యారోగ్య శాఖలో సాధారణ బదిలీ ప్రక్రియలో ఐచ్ఛిక స్థానాల ప్రాధాన్యతలు తెలియచేసే గడువు ముగిసిన క్రమంలో తదుపరి కౌన్సిలింగ్‌తో పాటు బదిలీలు చేపట్టాల్సిన ప్రక్రియకు మంత్రిత్వ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ విషయంపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు అందరు వి భాగాధిపతులతో బుధవారం నాడు రెండు గంటల పాటు చర్చించి రూపొందించిన కార్యాచరణ సూత్రాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. జిల్లా స్థాయి విభాగాధిపతుల వరకు ఈ బదిలీ ప్రక్రియలో పాల్గొనే అధికారులంతా ఒకే స్పష్టమైన అవగాహనతో బదిలీలపై ఆయా స్థాయిల్లో పారదర్శకంగా, సహేతుకమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు ఈ సూచనల్ని రూపొందించారు. ప్రస్తుతం ఒకే చోట పనిచేస్తున్న దంపతుల్లో ఒక్కరైనా అదే చోట ఐదేళ్ళలోపు పనిచేసి ఉంటే వారిని అదే చోట కొనసాగించవచ్చు..బదిలీల నిర్ణయాల్లో మొదట ఐదేళ్ళ పదవీకాలం పూర్తిచేసిన వారికి బదిలీ స్థానాలపై నిర్ణయాన్ని తీసుకోవాలి..ఆ తర్వాత 2 నుండి ఐదేళ్ళలోపు ఒకే చోట పనిచేసిన వారి బదిలీలపై వారి ఐచ్ఛికాల్ని బట్టి కొత్త స్థానాలపై నిర్ణయాలు తీసుకోవాలి..ఐదేళ్ళ సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి వారు సూచించిన స్థానాల్లో పోస్టింగ్ లభించకపోతే వారికి కౌన్సిలింగ్ చేపట్టాలి..2 నుండి ఐదేళ్ళ లోపు ఒకే చోట పనిచేసే వారు కోరుకున్న చోట బదిలీ దొరకకపోతే వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగించాలి..కాంట్రాక్టు నియామకాలతో రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారు ప్రస్తుతానికి యథావిధిగా కొనసాగుతారు. ఆ రెగ్యులర్ స్థానాలు ఖాళీలుగా పరిగణించబడవు. వివిధ విభాగాల్లో వివిధ స్థాయిలో ప్రస్తుత సాధారణ బదిలీల నిమిత్తం ప్రకటించని ఖాళీల గురించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు వాకబు చేశారు. ఇందుకు స్పందిస్తూ విభాగాధిపతులు (హెచ్‌వోడీలు)తెలిపిన వివరాలు మేరకు. వైద్య కళాశాలల్లో జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసి) నిబంధనల మేరకు వైద్య అధ్యాపకులను కొనసాగించేందుకు కొన్ని ఖాళీలను చూపలేదు. పిపిపి వాధానంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలల్లో గతంలో నియమించిన వారిని రీఎంప్లాయిమెంట్ చేయాల్సిన అవసరాల దృష్ట్యా మరికొన్ని ఖాళీలను ప్రకటించలేదు. ఒకే చోట ఐదేళ్ళ సర్వీసు పూర్తి చేసిన దాదాపు అందరికి కొత్త స్థానాల్లో బదిలీ చేసే వీలుంటుందని, అలా కుదరని కొన్ని సందర్భాల్లో తగు కారణాలను పరిశీలించి నిర్ణయాన్ని తీసుకుంటామని కృష్ణబాబు తెలిపారు.

## 28 హోంగార్డు పోస్టులకు 12,569 దరఖాస్తులు

### - ప్రాథమిక పరిశీలన అనంతరం 7,684 మంది ఎంపిక

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ సిఐడీ విభాగంలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా...వాటి కోసం ఏకంగా 12,569 మంది ధరఖాస్తు చేసుకున్నారు. భారీ సంఖ్యలో ధరఖాస్తులు రావడంతో ప్రాథమిక పరిశీలన చేపట్టి తదుపరి పరీక్షలకు 7,684 ధరఖాస్తుదారులను సిఐడీ అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మంగళగిరి లోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో శారీరక కొలతల(ఫిజికల్ మెజర్‌మెంట్స్) పరీక్షలు, ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు. ఎవరెవరు ఏయే తేదీల్లో హాజరుకావాలనే విషయమై షెడ్యూల్‌ను సిఐడీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇంటర్మీడియట్ కనీస విద్యార్హతగా కలిగిన ఈ హోంగార్డు పోస్టులకు బిటెక్, బీసిఎ, బిఎస్సీ కంప్యూటర్స్ పట్టభద్రులు సహా అనేక వృత్తి విద్యా కోర్సులు చేసిన వారూ ధరఖాస్తు చేసుకున్నారు. ఇవి శాశ్వత ఉద్యోగాలు కూడా కావు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో 80శాతం పచ్చదనం పెంచేలా చర్యలు

### -2వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅటవీప్రాంతంలో కొలువైన తిరుమలకొండపై 80శాతం పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందులో భాగంగా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండువేల మొక్కలు నాటేకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుమలలో ఇప్పటికే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నామని, మరింతగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు పటిష్ట ప్రణాళికలు అమలుచేస్తున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు గురువారం ఉదయం తిరుమలలోని ఆక్టోపస్ భవనం వద్ద అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మొక్కలు నాటారు. స్వయంగా నీరుపోశారు. మొక్కలను నాటడం కాదని, వాటి సంరక్షణ ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులు తమవెంట తెచ్చుకుంటున్న ప్లాస్టిక్ నీళ్ళసీసాలు, ప్లాస్టిక్ సంచులు, ఆహారపదార్థాల కవర్లను ఘాట్‌రోడ్లలో విసురుతున్నారని, దీనివల్ల ఘాట్‌రోడ్లపై,పరిసరాల్లో ప్లాస్టిక్ అధికంగా పేరుకుపోతోందన్నారు. భక్తులుకూడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తిరుమలలో ప్రతి చెట్టుకు ప్రాధాన్యత ఉందని, పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఇఇ సుధాకర్, ఎఫ్ఆర్ఒ దొరస్వామి పాల్గొన్నారు.

## తిరుచానూరు పద్మావతి అమ్మ తెప్పోత్సవాలు



**తిరుమల,జూన్ 5ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వారి తెప్పోత్సవాలు ఐదురోజులు జరగనున్నాయి. ఈనెల 7వతేదీ శనివారం సాయంత్రం నుండి 11వతేదీ వరకు అమ్మవారి పుష్కరిణి పద్మసరోవరంలో నిర్వహిస్తారు. పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుంటున్న పద్మావతి అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ట శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దు:ఖాలుతొలగి మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మంనుండి ఆవిర్భవించిన అలిమేలుమంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలదిలో మునిగిపోకుండా రక్షించి సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం. ఐదురోజులు తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణీసత్యభామసమేత శ్రీకృష్ణస్వామి, రెండోరోజు సుందరరాజస్వామి, మూడవరోజు నుండి పద్మావతిఅమ్మవారు తెప్పలపై విహరిస్తారు. ప్రతిరోజూ రాత్రి 7.30గంటల నుండి 8.30గంటల వరకు తెప్పోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా తిరుచానూరులో అమ్మవారు 10న రాత్రి గజవాహనంపై, 11న గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## భద్రతకే తొలి ప్రాధాన్యత - అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని పనితీరు


### - క్యూలైన్లకు చేరుకునేముందే నిశిత తనిఖీలు

### - టిటిడి నూతన సివిఎస్ఒ మురళీకృష్ణ



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయం భద్రతతోబాటు భక్తులకు రక్షణ కల్పించడమే తొలి ప్రాధాన్యత ఉంటుందని టిటిడి నూతన సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ తెలిపారు. భద్రత పరంగా టిటిడిలో నిమగ్నమైన విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంతోబాటు పోలీస్, ఆక్టోపస్, టిటిడి సెక్యూరిటీ, ప్రైవేట్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలతో సమన్వయంగా వ్యవహరించి, అవసరమైన మేరకు పనితీరు సాగిస్తానన్నారు. భక్తులు నిషేధిత వస్తువులు తిరుమలకు తీసుకురాకుండా మరింతగా అవగాహన కల్పించేలా చూస్తానన్నారు. టిటిడి భద్రతలో పోలీసుశాఖ ఒకటని, ఆ శాఖతో సత్సంబంధాలు కలిగి ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ పరస్పరం అవగాహనతో ముందుకెళతానన్నారు. తిరుమలలోని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లోనికి ప్రవేశించే ముందే తనిఖీలు మరింత పటిష్టంగా, నిశితంగా చేయిస్తానన్నారు. భక్తులు కూడా తమవెంట సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత పదార్థాలు తీసుకురాకూడదని ఆయన కోరారు. గతంలో తిరుమల, తిరుపతిలో పోలీసుశాఖలో పనిచేసిన అనుభవం ఉండటంతో ప్రస్తుతం టిటిడి సివిఎస్ఒగా నియమితులు కావడం కొంతవరకు అవగాహనతో ముందుకెళతానన్నారు. టిటిడి సివిఎస్ఒగా నియమితులైన కెవి మురళీకృష్ణ గురువారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సాంప్రదాయం పాటిస్తూ స్వామివారి రంగనాయకుల మండపంలో భక్తివిశ్వాసాలతో బాధ్యతలు తీసుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి అదనపుఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం బహుకరించారు. నూతన సివిఎస్ఒ వెంట విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్(వింగ్), సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు. అనంతరం ఆయన కొంతసేపు క్యూలైన్ల నిర్వహణ గమనించారు.

## శ్రీవారి ఆలయంలో 9నుండి జ్యేష్టాభిషేకాలు



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతి నిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి విగ్రహాలు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు 9వతేదీ సోమవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
నెం. 03/TO/2025-26, తేది: 05.06.2025
పనిపేరు : కాకినాడ జిల్లాలోని పిఠాపురం నుండి నేమం రోడ్డు యొక్క కి.మీ. 7/600లో ప్రస్తుత స్లాబ్ కల్వర్ట్ 2Vx3.50M కు మరమ్మత్తులు. సుమారు అంచనా విలువ : రూ.4.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు స్వీకరణ తేది: 09.06.2025 మ.2.00గం. నుండి 16.06.2025 మ.3.00గం. వరకు. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ : www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 0884-2367626.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B డివిజన్, కాకినాడ.
DIPR.NO. 16632/CL/ADVT/1/1/2022-23 తేది: 05.06.2025

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను కలిగి ఉండడాన్ని సామర్థ్యం అంటారు.

-హెచ్.గిల్బర్స్

# పర్యావరణంతో పరాచికాలా?


విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకు వస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి,చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగి పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం అత్యంత దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు కూడా చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నుంచి మొదలు పెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో చేసే కార్యక్రమం కోసం నిత్యం అన్వేషణ కొనసాగుతున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్ జనాభా 145 కోట్లకు చేరుకోవడానికి ఇంకా ఎక్కువ కాలం పట్టదని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నదని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్ఫైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో వివరించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించలేకపోతున్నారు. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవికాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఇక పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల వాడకం గూర్చి చెప్పక్కరలేదు. వాహన కాలుష్యనియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. వీటితోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు పడకపోడం అకాలంలో భారీ వర్షాలు ఒకేసారి, ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం లాంటివి ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. వ్యవసాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. అంతే కాదు వరదలు, తుఫాన్‌లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతంఈశాన్య రాష్ట్రాలను అధికవర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. సిక్కిం, అసాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి కురిసింది. ఫలితంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ వర్షపు బీభత్సానికి ఇప్పటికే నలభై మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. యేటాదాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో యేటా లక్షలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇటీవల పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పొచ్చు. ఆర్థికంగానో,సాంకేతిక పరంగానో ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. భారీ వరదలతో ఎల్లోనదీ ఉగ్రరూపం దాల్చి నగరాలకు నగరాలనే ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈపరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. మొన్న బెంగళూర్ నగరం, నిన్న ముంబయి విపత్కరల పరిస్థితులు ఎదుర్కొన్నాయి. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు,పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంచేసినా ఇలాంటి ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలను ఇస్తుంది.



కె.స్టానిస్లావిస్కీ

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందే

**విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించిన స్థాయిలో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు శాతం క్రమక్రమంగా తగ్గుతూ పోతున్నాయన్న విషయాన్ని విద్యాశాఖ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల స్థాయివరకు తరగతి గదికి అనువైనటువంటి విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలలే ఎక్కువగా గోచరిస్తుండడం విశేషం. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల శాతమే ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా ఉంటుందనే భిన్న వాదనలు లేకపోలేదు. దీని కారణం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మొదలుకొని కనీస ఆర్థిక పరిస్థితులు ఉన్న కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల అనాసక్తి చూపడం, ప్రభుత్వ బడిలో తమ పిల్లల్ని చదివించడం అంటే కొందరు తమ హోదాకు దర్పణంగా లేదనే భావించేవారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. మరికొందరిలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలపై అవగాహన లేకపోవడం, ప్రభుత్వ పాఠశాల ఆవశ్యకత గుర్తించలేకపోవడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడానికి కారణమైన ఉండొచ్చు అని భావన కొందరిలో లేకపోలేదు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు కలిగి అత్యున్నతమైన అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయులు ఉండడం, విశాలమైన క్రీడా ప్రాంగణం క్రీడా సామాగ్రి, సైన్స్ ప్రయోగశాల పరికరాలు,ప్రయోగశాల గదులు సరిపడా, తరగతి బోధనా గదులతో, మంచినీటి సౌకర్యం, బాల బాలికలకు వేరువేరు సానిటేషన్ వ్యవస్థలతో పాటు మౌలిక వసతులను సాధ్యమైనంత త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గణనీయంగా ఉన్నతీకరించబడుతుండటం శుభ సూచకమే. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యావ్యవస్థకు పటిష్టమైనటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాన్ని నిర్వహిస్తుండడం, ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక బడిబాట లాంటి కార్యాచరణను చేపట్టడం గమనార్హం. ఈ క్రమంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా విషయ బోధన అభ్యసనలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం అనేక కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు తరగతి గదులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో వీటిని విషయ బోధనలో వినియోగించేందుకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని బోధన ఉపాధ్యాయులకు కావలసిన వృత్యాంతర శిక్షణ కార్యక్రమాలను



ఇటీవల ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించింది. అంతేకాకుండా ప్రభుత్వం కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నాణ్యమైన తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాల్లో మెరుగైన విద్యా బోధనతో సహా పాఠ్యాంశాలతో పాటు పౌష్టికాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, డాక్టర్లచే వైద్యపరీక్షలు నైతిక విలువలతో కూడిన మార్గదర్శకత యోగ అభ్యసనం, క్రీడలు సైన్సు సాహిత్య, సంస్కృతి కార్యక్రమాలలో అభిరుచి కలిగించడం, కంప్యూటర్ల వాడకం,అభ్యసనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించడం ఇలాంటి అనేక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నప్పటికీ, కారణాలేవైనా ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల సంఖ్య మాత్రం ఒక్క సెక్షన్‌కే పరిమితమై ఉండడం గాని అంతకంటే తక్కువగానే ఉండడం శోచనీయం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మండలానికి ఒక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలతో పాటు సంక్షేమ హాస్టల్ కూడా విస్తరించడంతో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీటిపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. అలాంటప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా నిలదొక్కుకుంటాయో అనే సందేహాలు కలగకమానవు. ముఖ్యంగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రైవేటు పాఠశాలలు ఎక్కువ అవుతుండడం ప్రాథమిక స్థాయి చదివే పిల్లలు ఎక్కువ శాతం ప్రవేట్ స్కూల్ వైపు ఆసక్తి చూపిస్తుండడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చాలావరకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. తద్వారా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉనికి అంతంత మాత్రంగానే ఉంటుంది. కారణాలేవైనా ప్రభుత్వ విద్యాశాఖ విద్యార్థులు చదువు కొరకు అనేక కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశాల ద్వారా, బడిబాట కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తెలియచేయాలి. ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అన్ని వర్గాల వారితో పాటు ఉపాధ్యాయుల సహకారంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏది ఏమైనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు. •

# ప్రభుత్వానికి భూములిస్తే రైతులకు లాభదాయకమే!

గరిమెళ్ల రామకృష్ణ

అమరావతి రాజధాని చుట్టూ మరింత భూసేకరణపై భిన్న వాదనలు చేస్తున్నారు. రైతుల కోణం నుంచి చూస్తే భూమిని ప్రభుత్వ అవసరాల కోసం ఇవ్వడమే ఉత్తమం! ఒక్క అమరావతి ప్రాంతంలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ భూసేకరణ జరిగినా రైతులు తమకు ఆమోదయోగ్యమైన రీతిలో ప్రభుత్వానికి ఇవ్వడమే రైతులకు మేలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వార్తలు నిత్యం పత్రికల్లో చూస్తున్నాం! వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం. ఈ జూదంలో ఓటమే కానీ గెలుపు లేదు! ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎన్ని మాటలు చెప్పినా రైతుల తలరాతను మార్చే పరిస్థితి లేదు. విత్తనం దగ్గర నుంచి పండించిన పంట అమ్మే వరకు రైతులు కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన దుస్థితి నెలకొంది. పంటల బీమా వంటి పథకాల వలన రైతులకు పెద్దగా ఒరిగింది కూడా లేదు. ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర వస్తుందో ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే ఒక సమగ్ర విభాగం మన వ్యవసాయ శాఖలో లేని పెద్దలోపం! ప్రభుత్వాలు కూడా రైతులకు న్యాయం చేసే పరిస్థితి లేదు. రాజకీయ పక్షాలు కార్పొరేట్ వర్గాలు ఇచ్చే విరాళాలతోనే మనుగడ కొనసాగిస్తున్న నేపథ్యంలో పాలకులు వాళ్లకు వ్యతిరేకంగా కానీ నష్టం కలిగే విధంగా కానీ నిర్ణయాలు చేయలేరు. చట్టాలు చేసినా, మద్దతు ధరలు ప్రకటించినా అమల్లో పూర్తిగా వైఫల్యమే! భూములు కోల్పోయిన రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించమని పాలకులను



కోరవచ్చు. అది కొంతవరకు సాధ్యం అవుతుంది కూడా. భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా రైతులు షరతులు పెట్టవచ్చు. అలా ఉద్యోగాలు అవసరం లేనివారు, అవకాశం లేని కుటుంబాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. వ్యవసాయంపై ఆసక్తి, చేయగల సత్తా కలవారు కొత్తగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందే ప్రాంతాలను అధ్యయనం చేసి, గుర్తించి, చౌకధరల్లో భూములు కొనుగోలు చేసి వ్యవసాయం కొనసాగించవచ్చు. ఈ విధానం, ఒరవడి నిజాం నవాబు పాలన కాలం నుంచి ఉన్నదే! ఇక రాజధాని ప్రాంతంలోని రైతులు రాజధాని నిర్మాణం, అందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అనుమానాలు, ఆందోళన పడవలసిన అవసరం లేదు. జరుగుతున్న పరిణామాలు తమకు మేలు చేస్తాయన్న సానుకూల దృక్పథంతో ముందుకు రావాలి. ఈ సందర్భంగా రైతులు 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు తమ పిల్లలకు వివాహం జరిపించడం కూడా కష్టంగా ఉందన్న దైన్యస్థితి బహిరంగంగా చెప్పుకున్న వైనం మరచిపోకూడదు! ఇదే సందర్భంలో కొంతమంది దుర్బుద్ధి, దురాలోచనతో చెప్పే తప్పుడు మాటలను రైతులు నమ్మిమోసపోకూడదు! హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల మాదిరి అమరావతి కూడా బహుముఖంగా అభివృద్ధి చెందుతుంది. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టిగా కృషి చేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది. పలు అంతర్జాతీయ సంస్థలు ఆయనపై నమ్మకం, విశ్వాసంతో ముందుకు వస్తున్నాయి. ఇందుకు రైతుల సహకారంతోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు.అంతిమంగా అభివృద్ధి ఫలాలు రైతులకు కూడా దక్కుతాయి! •

# ప్రజావాక్కు



## యువతను ఆకర్షిస్తున్న డిజిటల్ విప్లవం

ఆధునిక డిజిటల్ విప్లవంతో ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. సమాచార మార్పిడిలో వేగం పెరిగింది. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం నేటి యువతను, చిన్నారులను ప్రమాదకరమైన మార్గాలవైపు నడిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లలో అశ్లీల కంటెంట్ విపరీతంగా పెరిగిపోతుండటం ఆందోళనకరం. టీనేజర్ వయసులోనే లైంగిక ఆలోచనలు పెరగడం, అమ్మాయిలను వస్తువుల్లా చూడ డంవంటి పరిణామాలు ఆవిష్కృతమవుతున్నాయి. చిన్నా రులు కూడా మొబైల్ ద్వారా ఈ విషపూరిత కంటెంట్‌కు చేరువ అవుతుండటం మరింత భయంకరం. ఇది దేశ భవిష్యత్తుకు ముప్పు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పల్లెల్లో ఊపందుకోనున్న రాజకీయం

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్,ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పల్లెల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు.గ్రామాలలో మహిళాసంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు.

- సింగు లక్ష్మీనారాయణ, జయశంకర్ భూపాలపల్లి

## ఫీజుల పెంపు సమంజసం కాదు

ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ఫీజులు,పుస్తకాలు, యూనిఫాం,బ్యాగులు ఇతరసామగ్రి కొనాలంటే తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాఠశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఫీజుల భారం పెరిగింది.ఏడాది సంపాదనంతా బడికే అని వాపోతున్నారు. కుటుంబంలో ఇద్దరు విద్యార్థులుంటే అంతే. దాదాపు రూ. లక్ష వరకు భారం పడుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ విధించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లిజిల్లా

## ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసిల్ పౌర సరఫరాల మొదలగు ప్రాథమిక పరిపాలన కార్యాలయాలు చాలా వరకు అధ్వాన్న స్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కిటికీలు తలుపులు మరీ దారుణంగా ఉన్నాయి. మూత్రశాలలు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్ల మార్గం నుండి పోవడం గగనంగా మారుతున్నది. కార్యాలయాల ఫర్నిచర్ ఇక్ష్వాకుల కాలంనాటివి ఇంకా ఉపయోగిస్తున్నారు. ఫైల్స్ భద్రపరచడానికి సరైన వ్యవస్థ లేదు. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి.ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారధులైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయం.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## సైనికులను ఆదుకోవాలి

యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు సర్వ లాంఛనాలతో ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం గౌరవప్రదమైన సంస్కారం. యుద్ధాలలో పాల్గొని ప్రాణాలతో బయట పడ్డవారిని పట్టించుకునేదెవరు? వీరికి ఠంచనుగా పెన్షను యిస్తున్నారు. వీరిలో చాలామంది బయటకు వచ్చిన తరువాత సరైన ఉద్యోగాలురాక చిన్నాచితక కొలువులు చేసుకుంటూ సంసారాలను ఇదుక్కొస్తున్నారు. యుద్ధ భూమిలో మరణించిన వారికి మాత్రం భార్యలకు ప్రభుత్వ పెన్షన్‌తోబాటు గుత్తగా అధికమొత్తం ఇవ్వడం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, కొన్ని వందల గజాలస్థలాన్ని ఉచితంగా ఇస్తున్నారు.యుద్ధాల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలతో బయట పడినవారికి రిక్తహస్తాలే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రజా ప్రతినిధులకు విద్యార్హతలు నిర్ణయించాలి

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటుగా విద్య అర్హతలను కూడా నిర్ణయించాలి.పదవతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి విద్య అర్హతలను ప్రజా ప్రతినిధుల గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, హోదాలను బట్టి విద్యా అర్హతలను నిర్ణయించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ట్రంప్ ఆర్థిక దోపిడి విధానాలతో ఆందోళన



డాక్టర్ కత్తి పద్మారావు

డొనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఆయన దుందుడుకు చర్యలకు అమెరికా అంతర్గతంగాను, అమెరికా బయట దేశాలు అతలాకుతలం అవుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచానికి అమెరికా మరింత వేగంగా దూరమైపోతోంది. ఆర్థిక, విదేశాంగవిధానాలూ, సైనిక వ్యూహంలో మార్పులు వస్తున్నాయి. ట్రంప్ నేడు ప్రపంచ దేశాలన్నింటిపై ప్రతీకార సుంకాలు విధిస్తానంటున్నారు. పనామా కాల్వను, గ్రీన్లాండ్ను స్వాధీనం చేసుకుంటామన్నారు.కెనడా, మెక్సికోలు తమ దేశంలో కలసిపోవాలనీ, గాజా నుంచి పాలస్తీనీయులు వెళ్లిపోవాలనీ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ గగ్గోలు రేపారు. ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు ట్రంప్! ఉక్రెయిన్‌కు సాయం చేస్తూపోతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనడం, ఇంతవరకు చేసిన సాయానికి ప్రతిగా ఆ దేశంలోని అరుదైన ఖనిజవనరులను తనకివ్వాలని ఆయన డిమాండ్ చేయడం ప్రపంచాన్ని నివ్వెరపరచింది. అన్నిదేశాల మీద సుంకాలు విధిస్తున్న విధానానికి ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోతున్నాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలువడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై 20శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ప్రకటించారు. ఈ విషయంగా ఆయన పన్నులు ప్రకటించకముందే ప్రపంచ దేశాల ఆర్థిక శాస్త్రవేత్తలంతా అనేక రూపాల్లో ఈ విషయాలను వెల్లడిస్తూనే వచ్చారు. వారు ఈ విధానాల వల్ల అమెరికా కూడా ఒంటరైపోతుందని, అమెరికాలోని ప్రజలు కూడా సంక్షోభానికి గురవుతారని ఒక వారంగా అనేక విశ్లేషణలు ఇలా వెలువడుతూనే వచ్చాయి. ట్రంప్ ఈసారి 1.4 లక్షల కోట్ల డాలర్ల విలువైన సుంకాలను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుండటం ఇండియానే కాదు, మొత్తం ప్రపంచ ఆర్థిక రంగాన్నే తీవ్రంగా ప్రభావితం చేయనుంది! విదేశాల నుంచి అమెరికా చేసుకున్న మొత్తం దిగుమతుల విలువ నిరుడు 6.6శాతం మేర పెరిగి 4.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అదే సమయంలో ఆ దేశ వస్తుసేవల ఎగుమతులేమో 3.2 లక్షల కోట్ల డాలర్లకే పరిమితమయ్యాయి. చైనా,వియత్నాం, మెక్సికో, తైవాన్, జపాన్, కెనడా, దక్షిణ కొరియా, ఇండియా, థాయ్‌లాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్యలోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న డొనాల్డ్ ట్రంప్ దిగు



మతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేలకోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలు చేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. కానీ, ఆక్రమంలో ఆయన అమెరికాను ఏకాకిని చేస్తున్నారు.ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలను ఎదుర్కోవడానికి చైనా, జపాన్, దక్షిణ కొరియా ఏకతాటిపైకి వస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈయూ దేశాలు సైతం గట్టిగా ప్రతిస్పందించడానికి సంసిద్ధమవుతున్నాయి. ఏతావతా అగ్రరాజ్య పరపతిని పణంగా పెట్టి మరీ ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో చూడాలి! దగ్గర దగ్గర ప్రపంచంలో ఉన్న ఏ ఆర్థిక మేధావి కూడా అమెరికాకు అనుకూలంగా ఒక్కవాక్యం కూడా రాయడం లేదు అనేది స్పష్టమైన అంశం. నిజానికి అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న 'పది' ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. అంతేకాక ఇప్పుడు అమెరికా అధ్యక్షునిపై అక్కడ వాణిజ్య సంస్థల భాగస్వామ్యం ఒత్తిడి కూడా బలంగానే ఉంది. ఈవిషయంగా వాషింగ్టన్ ఒక కథనాన్ని కూడా ప్రచురించింది. ఆ కథనం ఇలా ఉంది. అమెరికా ఎగుమతులను పెంచేందుకు, టారిఫ్స్, నాన్ టారిఫ్ల, నియంత్రణ అడ్డంకులను తగ్గించాలని భారత్ను ఒత్తిడి చేయాల్సిందిగా అమెరికా పరిశ్రమ సంఘాలు, కంపెనీలు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. యుఎస్ చాంబర్ ఆఫ్‌కామర్స్ (యుఎస్సిసి), కొలైషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సిఎస్ఐఐ) ప్రముఖ బైక్ కంపెనీ హార్లే డేవిడ్సన్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు ప్రకటనకు ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్ఆర్)కి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్టిఆర్ ఇటీవల సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా ఆరోగ్య సంరక్షణ రంగంలో వాణిజ్యాన్ని పెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధ తయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతిపెద్ద వాణిజ్య సంప్రదింపుల సంస్థ యుఎస్ఎస్సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవ స్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్సిసి ప్రస్తావించింది. సిటిస్కానర్లు, ఇతర అధునాతన శస్త్రచికిత్సకు అవసరమైన పునరుద్ధరించబడిన పునర్వినియోగించే వైద్య పరికరాల దిగుమతిని భారత్ అనుమతించాలని కోరింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జిఎస్టిని తగ్గించాలని యుఎస్సిసి కోరింది. అమెరికా నిజానికి ప్రపంచ దేశాలకు ఎన్నో సాంకేతిక అంశాలను, సాంస్కృతిక విస్తృత అంశాలను నేర్పిందనే వాదన కూడా ఉంది. సాంకేతికంగా ప్రపంచానికి అనేక పరికరాలు అందించగలిగిన స్థాయిలో వుంది. అయితే నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. భారతదేశం ఇలాంటి ఒడిదుడుకులను ఎన్నింటినో ఎదుర్కొంది. ఎంతోమంది ప్రపంచనియంతలను చూసింది. భారతదేశం చేయాల్సిన పని దేశీయ సంపదను పెంచుకోవడం చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్,కెనడా వంటి దేశాలతో సంబంధాలను మరింతగా మెరుగుపరచుకోవడం భారతదేశంలో వున్న మేధావులకు, విద్యావంతులకు, సాంకేతిక పరిజ్ఞానులకు అవకాశాలు మెరుగుపరచుకోవడం. భారత దేశ ఔన్నతిని పునరుజ్జీవన శక్తితో అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ స్ఫూర్తితో మహోజ్వలమైన జాతీయ భావనతో ముందుకు నడవవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ దిశగా ముందుకు నడుద్దాం. •

# 19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు

## ఉత్తర్వులు జారీచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధానకారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించ డంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది. కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగాచేసుకున్నప్పుడు అనేక న్యాయ స్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయ పరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని ట్రంప్ వర్సెస్ హవాయి కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తు చేసింది. అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధంనుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ఇప్పటికే వీసాలు కలిగి ఉన్న వారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికిమినహాయింపులు కల్పించారు. ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారినుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన సాధారణ భద్రతా ప్రమాణాలు అని వివరించారు.

## బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్

**ముర్షిదాబాద్, జూన్ 4:** సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్‌ను బంగ్లాదేశ్ వాసులు కిడ్నాప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ బీఎస్ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశీయులు కిడ్నాప్ చేసి అతడిని బందీగా ఉంచారు. కొన్ని గంటల తర్వాత అతడిని విడుదల చేశారు. నుర్పుర్ జిల్లాలోని కథాలియా అనే గ్రామం దగ్గర ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. సుతిర బీఎస్ఎఫ్ క్యాంప్ సమీపంలోని చాందనిచౌక్ దగ్గర గల అంతర్జాతీయ సరిహద్దు నుంచి కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని ఆ బిఎస్ఎఫ్ జవాన్ అడ్డుకున్నాడు. దాంతో అతడిని ఆ ముష్కరులు కిడ్నాప్ చేసి బందీ చేశారు. వారందరూ బంగ్లాదేశ్‌లోని చపాయ్ నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన వారేనని తెలుస్తోంది. బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్ అయిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని గంటల్లోనే ఆ జవాన్‌ను ముష్కరులు విడిచిపెట్టేశారు. ప్రస్తుతం ఆ జవాన్ క్షేమంగానే ఉన్నాడని సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ బిఎస్ఎఫ్ వెల్లడించింది. అయితే ఈ కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# తల్లితండ్రులను పట్టించుకోని సంతానంపై కఠినచర్యలకు ప్రత్యేక చట్టం

## అసోం ప్రభుత్వం 2017 చట్టం పూర్తి స్థాయిలో అమలు



**గువాహతి, జూన్ 5:** అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన ప్రాణం చట్టం అనేది ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు, దివ్యాంగ సోదరుల సంరక్షణ కోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సంస్థలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , కంపెనీ చట్టం ప్రకారం నిర్వచించిన ప్రభుత్వ కంపెనీలు వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులపై తల్లిదండ్రుల పట్ల బాధ్యతను చట్టబద్ధంగా విధించడం జరిగింది. ఈ చట్టం ఎందుకు అవసరమైంది, సామాజిక మార్పులు, పట్టణీకరణ పెరగడంతో కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయి. పెద్దలు కొడుకులపై ఆధారపడే పరిస్థితుల్లో, కొంతమంది వారి బాధ్యతను తేలికగా తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అనాధుల్లా మారకూడదన్న ఉద్దేశంతో అసోం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది కేవలం కుటుంబ విలువలను పరిరక్షించడమే కాదు, ఉద్యోగులను ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చేస్తుంది. ఈ చట్టం అన్ని స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ అనుబంధం ఉన్న సంస్థల్లో, కంపెనీ చట్టం కింద ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ ఉద్యోగులపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు, వివాహం కాని దివ్యాంగ సోదరులు ఈ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు. ఉద్యోగిపై ఆధారపడే తల్లిదండ్రులు లేదా దివ్యాంగ సోదరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, లేదా మౌలిక అవసరాలు కలిగించకపోతే, వారు అధికారుల వద్ద రాయితీగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం "ఆధారిత తల్లిదండ్రులు" అంటే తమకు ఆదాయ మార్గాలు లేకపోయి, కొడుకు లేదా కుమార్తెపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు. వారు పెన్షన్ పొందకపోవడం, సొంత ఆదాయ మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఉంటే, వారిని ఈ చట్టం రక్షిస్తుంది. ఆధారిత దివ్యాంగ సోదరుడు/సోదరి అంటే వైకల్యం ఉన్న, వివాహం కాని వ్యక్తి. అటువంటి సోదరుడు/సోదరి తన జీవనాన్ని కొనసాగించడానికి తగిన ఆదాయం లేక, ఉద్యోగిపై ఆధారపడే వారిగా పరిగణించబడతారు.

వారిని తగిన విధంగా సంరక్షించడం ఉద్యోగి బాధ్యతగా ఈ చట్టం పేర్కొంటుంది. ఆధారిత తల్లిదండ్రులులేదా దివ్యాంగ సోదరులు ఫారమ్ లో నియమిత అధికారికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఇది రాతపూర్వకంగా ఉండాలి. ఎప్పుడు అయినా ఫిర్యాదు చేయొచ్చు. అధికారి దానిని స్వీకరించి విచారణకు తీసుకుంటారు. వారు ఫిర్యాదులను పరిశీలించి, 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# అమెరికాలో వలసదారుల అరెస్టులు

## ఒక్కరోజులోనే 2200 మంది

**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికాలో వలసదారుల అరెస్టులు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2,200 మందిని అరెస్ట్ చేశారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఒక్క రోజులోనే 3 వేల మందిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని పేర్కొనడంతో ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయని తెలిపింది. అయితే ఒక్క రోజులోనే ఇంత మందిని అరెస్ట్ చేయడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు అల్టర్‌నేటివ్ టు డిటెక్షన్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. యాంకిల్ ద్వారా స్మార్ట్ యాప్స్‌తోపాటు జియో లోకేషన్ పరికరాల ద్వారా వారిని పర్యవేక్షిస్తుంటారు. అలాగే వారు తరచూ ఐసిఇ కేంద్రాలకు రావాల్సి ఉంటుందని ఇప్పటికే వారికి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఎడిటిలో నమోదైన వలసదారులు ఐసిఇ కార్యాలయాలకు రావాలంటూ సందేశాలు పంపుతున్నారు. అలా వచ్చిన వారిని అరెస్ట్ చేసి కార్లలో తరలిస్తున్నారు. గతంలో ఐసిఇ పిలుపు వచ్చినా హాజరు కానీ వారిని దేశం విడిచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో వలసదారులను వెనక్కి పంపిస్తామని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి బెయిల్



**కోల్‌కత్తా, జూన్ 5:** ఆపరేషన్‌సింధూర్‌పై అభ్యంతరకరపోస్టులుపెట్టిన న్యాయవిద్యార్థిని శర్మిష్ట పనోలికి కోల్‌కత్తా హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఆమెపై కోల్‌కత్తాపోలీసులు కేసులు నమోదుచేసిన సంగతి తెలిసిందే. రూ.10 వేల పూచీకత్తుతో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గురుగ్రామ్‌లో అరెస్టు అయిన పనోలి ఈనెల 13వ రకూ జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్‌పై బాలివుడ్ నటుల మౌనం ప్రశ్నిస్తూ ఆమె ఇన్‌స్టాలో విడియోను పోస్టు చేసింది. ఆపోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. అనేకమంది సోషల్‌మీడియా యూజర్లు ఆమెను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుపెట్టారు. దీనితో ఆమె ఆ విడియోను తొలగించి బహిరంగ క్షమాపణలు చెప్పింది. బెంగాల్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో పనోలిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆమె తరపు న్యాయవాది వాదించారు. వజాఖత్ ఖాన్ ఖాద్రి అనే వ్యక్తి గార్డెన్ రీచ్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదుచేసారు. విచిత్రం ఏమిటంటే ఫిర్యాదుచేసిన ఖాద్రికూడా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇపుడు అంశంపై ముమ్మర దర్యాప్తుచేస్తున్నారు. ఒక మతపరమైన ట్రస్టు శ్రీరామ్ స్వాభిమాన్ పరిషద్ సంస్థ గార్డెన్‌రీచ్‌పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదుచేసింది. ముంబయి, అస్సాం, దేశంలోని ఇతర ప్రాంతాల్లోకూడా ఖాద్రిపై కేసులు నమోదయ్యాయి. విద్వేషకర ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల ఉద్రిక్తతలు,హింస పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఫిర్యాదులు నమోదయ్యాయి.

# తొక్కిసలాట ఘటనను రాజకీయంచేస్తున్న బిజెపి

## కన్నీటి పర్యంతం అయిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబీ విజయం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటను ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, ఇది రాజకీయాలుచేసే సమయం కాదని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతు జరిగిన సంఘటనపట్ల క్షమాపణలు చెపుతున్నానని, ఇది ఎంతో ఘోరమని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. బెంగళూరు ప్రతిష్టను ప్రతిపక్షాలు మరింత దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. పోలీసులు అనుమతులివ్వలేదన్న వార్తలపై ఆయనస్పందిస్తూ బిజెపి నేతల విమర్శలపై తానుస్పందించబోనని నేను కర్ణాటక ప్రజలకు జవాబుదారీ అని దేశ ప్రజలకు జవాబుదారీ అని ఆయనఅన్నారు. బిజెపి నాయకులే ఇలాంటి విషప్రచారానికి కుట్రదారులని డికె ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు శవరాజకీయాలుచేసుకోనీయండి, ఎన్ని మృతదేహాలపై వారు శవరాజకీయాలు చేసారన్నదానిపై నేను జాబితారూపొందిస్తానని అన్నారు. ఎంతో బాధగాఉంది. బాధితులు మన రాష్ట్రంవారు, బెంగళూరువారు మన సొంతకుటుంబం వారే. బెంగళూరు, కర్ణాటక ప్రతిష్ట పూర్తిగా పోయిందని మేం బాధ్యత తీసుకుంటున్నాం, ఎవ్వరినీ నిందించడంలేదని ఈ సంఘటన అనూహ్యంగా జరిగిందని, ఇంత భారీస్థాయిలో అభిమానులు వస్తారని ఎవ్వరూ ఊహించలేదని ఆయన అన్నారు.

# పాక్ 'మేడమ్-ఎన్' వలలో భారత్ ఇన్‌ఫ్లూయెన్సర్లు!



**ఇస్లామాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కింద పనిచేసే.. ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. షెహజాదకు నిఘా సంస్థ ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'.

హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డులో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు తెలుస్తాయి. ఈమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని ప్రశ్నించగా.. షెహజాద పాత్ర వెలుగు చూసింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్‌సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, ఆర్మీనుంచి ఆమెకు స్పష్టమైన సూచ నలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. మన దేశంలోని దాదాపు 3,000 మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు గత ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడిఉంది. అక్కడి ఫస్ట్‌సెక్రటరీ (వీసా) సైహైల్‌కమర్,కౌన్సిలర్‌ఉమర్ ప్రేయర్‌తో బలమైన సంబంధాలున్నాయి. ఆమెనుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్‌రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసావచ్చేసేది. జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడటంతో డానిష్‌ను భారత్‌నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే.



# నేరాల హబ్‌గా బీహార్!

## ఎఐసిసి నేత రాహుల్ ధ్వజం

**పాట్నా, జూన్ 5:** ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆద్వర్యంలో బీహార్ నేరాల హబ్‌గా మారిపోయిందని, నిరుద్యోగం మరింతగా వృద్ధిచెందిందని దీనివల్ల ప్రజలంతా ఉపాధిలేక వలసలు పోతున్నారని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. గయలో ఇటీవల జరిగిన సంఘటనను పురస్కరించుకని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అత్యాచార బాధితురాలి తల్లి అస్వస్థతకు గురయితే చికిత్సచేసేందుకువెళ్లిన వైద్యుడిని చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టిన సంఘటనను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలుచేస్తూ పోస్టుపెట్టారు. అంతేకాకుండా చెట్టుకు కట్టేసి డాక్టర్‌ను కొట్టిన విడియోను కూడా ఆయన జతచేసారు. డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారని ఈకేసులో నిందితులే ఈ ఘాతుకానికి పాల్పడినా ప్రభుత్వంనుంచి స్పందనలేదని ఆయన దుయ్యబట్టారు. అత్యాచార బాధితురాలు తల్లికి చికిత్సచేసినందుకే ఈ రేప్‌కేసు నిందితులు దారుణంగా డాక్టర్‌ను కొట్టారని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రం నేరాలకు హబ్‌గా మారిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వలసలు అందుకే పోతున్నారని ఆరోపించారు. ఇవే నితీష్‌కుమార్ బిజెపి ప్రభుత్వం వాస్తవ స్వరూపమని రాహుల్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రతినిధి షమా మహ్మద్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర స్థాయిలో విమర్శలుచేసారు. తొమ్మిదేళ్ల అత్యాచార బాధితురాలికి వైద్యం నిరాకరించడంవల్లనే ఆమె చనిపోయిందని ఆరో పించారు. బీహార్‌ను నేరస్తులే నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. మోడీని తీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా నేరస్తులకు, నేరముఠాలకు, దౌర్జన్యకారులకు లొంగిపోయిందని విమర్శించారు.

# పినాకిమిశ్రాను వివాహమాడిన మహువామొయిత్రా

## ఇద్దరూ ఎంపీలే, రెండురాష్ట్రాల్లో ప్రాతినిధ్యం



**కోల్‌కత్తా, జూన్ 5:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా బిజెడి ఎంపి పినాకి మిశ్రాను వివాహమాడినట్లు తెలిసింది జర్మనీ నగరం బెర్లిన్‌లో గతనెల మూడో తేదీ జరిగిన ఈ వివాహానికి సంబందించిన వారి ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపిగా కృష్ణనగర్ నియోజక వర్గంనుంచి ఎన్నికైన మొయిత్రా పినాకి మిశ్రాను వివాహమాడారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంనుంచి మిశ్రా ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న మొయిత్రా ఒంటినిండా బంగారు నగలతో మిశ్రాతో నడుస్తున్నట్లు కనిపించారు. 1974 అక్టోబరు 12వ తేదీ అస్సాంలో జన్మించిన మొయిత్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత 2010లో టిఎంసిలో చేరారు. కృష్ణనగర్‌నుంచి 2019లో మొదటిసారి ఎన్నికకాగా మళ్లీ 2024లో కూడా ఎన్నికయ్యారు. పార్లమెంటులో నియంత్రృత్వానికి సంబంధించిన ఆరు సూచనలు అన్న అంశంపై ఆమెచేసిన ప్రసంగంతో అందరిదృష్టిలోకి వచ్చారు. ఇక పినాకి మిశ్రా 1959 అక్టోబరు 23న ఒడిశాలోని పూరిలోజన్మించారు. సీనియర్ రాజకీయవేత్త, న్యాయవాదికూడా ఢిల్లీ వర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. మిశ్రా తన రాజకీయ ప్రయాణం ఐఎన్‌సినుంచే ప్రారంభించారు. 1996లో పూరి సీటును ఎన్నికయ్యారు. ఆ తర్వాత నవీన్ పట్నాయక్ బిజుజనతాదళ్‌లో ఎన్నికయి అనేకసార్లు అంటే 2009, 2024, 2019ల్లో కూడా ఎన్నికయ్యారు.

# ఆర్సీబీ విజయోత్సవాల వేళ విధుల్లో 1000 మంది పోలీసులు

## హైకోర్టుకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబి విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే అంతకుముందు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ ఆర్సిబి ఈవెంట్‌కు 5 వేల మంది పోలీసులులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది.ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం. అన్నవి ఆలోచించాలి అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ ఈ స్టేడియం సామర్థ్యం 35 వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30 వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవగా సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# యుఎస్ వీసా కోసం సోషల్ మీడియా ఖాతాల తొలగింపు!

## 'వెట్టింగ్' ప్రభావం..




**వాషింగ్టన్, జూన్ 5:** వలసదారుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తామని అమెరికా ప్రభుత్వం చెప్పింది. ఈ పరిణామాలు అమెరికాలో చదవాలని కలలు కంటోన్న భారతీయ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. దాంతో వివాదానికి దారితీస్తాయని భావిస్తోన్న పోస్టులను వారి డిలీట్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

వీసా ఇంటర్వ్యూల సమయంలో వారి రాజకీయ పరమైన అభిప్రాయాలు తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే ఆందోళన ఇందుకు కారణమవుతోంది. మామూలుగా చేసే కామెంట్, ఎలాంటి హాని తలపెట్టని పోస్టును కూడా పరిగణనలోకి తీసుకొని వీసాను ఎక్కడ తిరస్కరిస్తారోనని వారు భయపడుతున్నారు. అమెరికా అధికారులు అనుమతించని కంటెంట్‌ను లైక్ లేక షేర్ చేయడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, ఇలా ఆకస్మికంగా పోస్టులు, ఖాతాలు తొలగించడం కూడా అనుమానాలు రేకెత్తిస్తుందని వీసా కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు గత ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించి సోషల్ మీడియా వివరాలు అందించాలని ఇమిగ్రేషన్ అధికారులు కోరతారని నిపుణులువెల్లడించారు. దాంతో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుందన్నారు. వారినేపథ్యం వీసా లక్ష్యాలకు సరిపోతుందా లేదా?అని తనిఖీ చేస్తారు. చిన్నపాటి రాజకీయ కార్యకలాపాలు, వివాదాస్పద కామెంట్లను వీసా పరిశీలన సమయంలో అనుమానాస్పదంగానే పరిగణిస్తారని హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ సోషల్ మీడియా వెట్టింగ్..?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్ని 'సోషల్ మీడియావెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

# యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తాం

## - రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి, సమాజంలో ఆత్మవిశ్వాసంతో వారు ముందుకు సాగేలా చేయడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తెలిపారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గా బూరుగుపల్లి శేషారావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ శేషారావు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా, ప్రభుత్వ, పరిశ్రమ మరియు విద్యా రంగాలు సమన్వయంతో పనిచేస్తాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, మహిళల కోసం ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలు, గ్రామీణ యువత కోసం డిజిటల్ ఇంటర్న్ షిప్ మొదలైన కార్యక్రమాలను అమలు చేయనున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాహిత పాలన విధానం, ఈ సంస్థ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. వారి మార్గనిర్దేశత్వంలో పనిచేస్తూ, యువతకు శిక్షణను అందించుట ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సమానత్వాన్ని కల్పించే లక్ష్యంతో మహిళలు, గ్రామీణ యువత మరియు టెక్నాలజీకి దూరంగా ఉన్నవారందరికి ఇంటింటికి నైపుణ్యం తీసుకెళ్లేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ శేషారావును వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ మరియు సీఈవో జీ. గణేష్ కుమార్, కార్యనిర్వాహక సంచాలకులు ,
సలహాదారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వాములు మరియు విద్యా రంగానికి చెందిన ప్రముఖులు అభినందించారు.



ఉద్యోగుల సంఘ సమావేశంలోమంత్రి కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గురువారం విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ మహాసభలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు తాము చేసిన పనికి ఏరోజు జీత మొస్తుందో తెలియని పరిస్థితి నుండి కూటమి ప్రభుత్వంలో ఒకటో తేదీనే జీతాలు అందించే పరిస్థితికి తీసుకు వచ్చామన్నారు. ఉద్యోగస్తులు కోరుకున్నట్లుగా ప్రతి నెలా మొదటి తేదీనే జీతం అందేలా చట్టబద్ధమైన ప్రక్రియకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సమస్యపై స్పష్టమైన కార్యాచరణ ఏర్పాటు చేసి అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ముందుంట ుందన్నారు. ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం సుకుంటామన్నారు. పరిపాలనలో ఉద్యోగుల పాత్ర అమోఘం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించిన ఉద్యోగ సంఘ నాయకత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటే అరెస్ట్ ల భయం ఉండేదని గుర్తుచేశారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నూటికి నూరు శాతం సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సిట్టింగ్ జడ్జితో గానీ లేదా విశ్రాంత జడ్జితో గానీ సమస్యలపై అవగాహన తీసుకురావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం లేవనెత్తిన డిమాండ్ ను ఏకీభవిస్తు న్నానన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వం పరస్పర సహకారంతో పని చేసి పాలనను మరింత ప్రజామోదంగా తీర్చిదిద్దుదామని తెలిపారు.



అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఎం గుప్తా

# పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిది

### రైల్వేలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

**గుంతకల్లు రైల్వే,జూన్ 5,ప్రభాతవార్త** వాయుకాలుష్యాన్ని నివారించే, పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక డివిజనల్ రైల్వే ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం రైల్వే పర్యావరణ-గృహసంరక్ష విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఆడంబరంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిఆర్ఎం గుప్తా రైల్వే సిబ్బందిచే ప్రతిజ ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం జీవరాశి మనుగడకే పెను ప్రమాదమని, ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్ వస్తువుల తయారీ,దిగుమతి, నిల్వ,సరఫరా, వినియోగాన్ని నిషేదిద్దామని ప్లాస్టిక్ వాడకం ద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. భావితరాలకు పచ్చని భూమి,స్వచ్ఛమైన గాలి,కలుషితం లేని మంచినీరు అందించడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో చెట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సిఎంఎస్ డాక్టర్ ఎన్వి గోపాల్‌రెడ్డి, సీనియర్ డిఇఎన్‌హెచ్ఎం పిఎస్ మణికుమార్, రైల్వే ఆసుపత్రి అదనపు సిఎంఎస్ డాక్టర్ మురళీమోహన్, వైద్యులు మధుకుమార్, అరుణ్‌కుమార్,హసీనా,రైల్వే అధికారులు మనోజ్,శ్రావణ్ కుమార్, మంగాచార్యులు,చంద్రశేఖర్,పి సింగ్,సి వీరయ్య,మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారానికి పరిమితమైన పర్యావరణ దినోత్సవం.. కాలుష్య కోరల్లో రాజమహేంద్రవరం

**రాజమహేంద్రవరం సిటీ జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణ దినోత్సవం ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతుంది. దీనిని కాపాడాల్సిన అధికారులు, నాయకులు ఫోటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా పల్లెలు, పట్టణాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. పర్యావరణం ముఖ్యంగా వాయువు నీటి కాలుష్యము వలన పాడైపోతుంది. కానీ నేటి పాలకులు, అధికారులు గాలి నీరు యదేచ్ఛగా కలుషితం చేసి ప్రజల ప్రాణాలు గాలికి వదిలేసి కోట్లు సంపాదించుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో కార్పొరేట్ ఫ్యాక్టరీలు, ఆసుపత్రిలు వలన ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుండి వచ్చే వ్యర్థాలు, కలుషిత నీరు, విషవాయువులు ఆ గ్రామాల పరిధిలో వదులుతున్నారు. దీని వలన వచ్చే దుర్గంధం వలన ప్రజలు అనారోగ్యం చెందుతున్నారు. ఇదేవిధంగా ఏళ్ళ తరబడి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రిలో ఉపయోగించిన వ్యర్థాలు రాజానగరం గ్రామం రావులచెరువు గట్టు ప్రక్కన ఆసుపత్రి ట్రాక్టర్లు, వ్యాన్ లో తీసుకుని వేస్తున్నారు.

రోగులు, వైద్యులు ఉపయోగించి రక్తం అంటున్న మాస్కులు, దుస్తులు, ఇంజెక్షన్లు, గాజు గుడ్డలు నేరుగా వేస్తున్నారు. ఇవి గాలికి ఎగిరి ఇళ్ళు లో కి వస్తున్నాయి. వర్షాకాలంలో నీరు వ్యర్థాలతో కలిసి పోయి గ్రామానికి మంచినీరు అందిస్తున్న రావులచెరువు లో వస్తున్నాయి. భారీ వర్షాలకు ఇళ్ళలోకి వ్యర్థాలు కొట్టుకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత

## - వి.కోట మండలం మోట్లపల్లిలో ఘటన !



.చెరువులో నీటమునిగి మృతి చెందిన విద్యార్థులు

**వి.కోట, జూన్ 5 ప్రభాతవార్త** సరదాగా ఈత కొట్టేందుకు గాను చెరువుకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు నీట మునిగి మృత్యువాత పడిన సంఘటన గురువారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం మోట్లపల్లిలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు నిఖిల్ (13), రెడ్డెప్ప కుమారుడు కుశాల్ (11), ఆదెప్ప కుమారుడు జగన్ (9)లు గురువారం తమ తల్లిదండ్రులు కూలీ పనుల నిమిత్తం వి.కోట పట్టణానికి వెళ్లగా వీరు మరో బాలుడు పూర్ణేష్‌తో కలసి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ఈత నిమిత్తం వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరింది. ఈ నేపథ్యంలో నలుగురు విద్యార్థులు చెరువులో దిగారు. పూర్ణేష్‌కు ఈత రావడంతో అతను ఈత కొడుతూ గట్టుపై వచ్చాడు. అయితే మిగతా ముగ్గురు నిఖిల్, కుశాల్, జగన్‌లకు ఈత రాకపోవడంతో పూర్ణేష్ వారిని తీగలతో లాగేందుకు యత్నించాడు. అయితే ఈత రాక ముగ్గురు బాలురు నీట మునిగారు. వెంటనే విషయాన్ని గ్రామస్తులకు తెలపగా గ్రామస్తులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. బురదలో కూరుకున్న వారిని పైకి తీశారు. ఓ బాలుడు శ్వాసతీసుకుంటుండగా అతన్ని ఆస్పత్రికి తరలించే యత్నంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పంచనామా నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఆర్డిటి విషయంలో ఢిల్లీ వీధుల్లో పోరాడుతా..

## - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు




**అనంతపురం, జూన్ 5 ప్రభాత వార్త బ్యూరో** ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి సేవలు వెల కట్టలేనివి. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఎ అనుమతులను కేంద్రం పునరుద్దరించే విధంగా అవసరమైతే ఢిల్లీకి వెళ్లి పోరాడుతామని, ఎమ్మెల్యేలు, ఎంపిలను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు కూడా సిద్ధమని టిడిపి నేత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. మంత్రి పయ్యావుల కేశవ్‌తో కూడా చర్చించి ఢిల్లీలో కేంద్రం పెద్దలపై ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఎ అనుమతులను వచ్చే విధంగా సర్వశక్తులు ఒడ్డుతానని ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌లు గట్టి ప్రయత్నం చేస్తున్నారని, అయితే కళ్యాణదుర్గంలో వైసిపి మాజీ ఎంపి తలారి రంగయ్య పాదయాత్ర పేరుతో రాజకీయ ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దమ్ముంటే ఢిల్లీకి వెళ్లి ఆర్డిటి విషయంలో పాదయాత్ర చేయాలని వైసిపి నేత మాజీ ఎంపి తలారి రంగయ్యకు సవాల్ విసిరారు. స్థానిక రహదారులు, భవనాలు అతిథి గృహంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురంజిల్లాలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కి విదేశీ నిధులు రాకుండా ఎఫ్‌సిఆర్ఎ అనుమతులను 2021లోనే రద్దు చేసిందన్నారు. అప్పుడు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. తలారి రంగయ్య ఎంపిగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పట్లోనే ఎఫ్‌సిఆర్ఎ అనుమతులను పునరుద్దరించే విధంగా తలారి రంగయ్య ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అప్పట్లో వైసిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎందుకు ఎఫ్‌సిఆర్ఎ అనుమతులను పునరుద్దరించలేదని ఎమ్మెల్యే సురేంద్ర బాబు ప్రశ్నించారు. అప్పట్లో కూడా వైసిపి వారికి కేంద్రం పెద్దలకు సంబంధాలు ఉన్నాయి కదా, అప్పట్లో ఎందుకు ఈ పనులు చేయలేకపోయారని ఆయన నిలదీశారు.

# పొలిటికల్ లీడర్స్‌లో జెంటిల్‌మెన్ నెట్టెం రఘురామ్

## -కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతల స్వీకరణలో నెట్టెంను ముక్తకంఠంతో శ్లాఘించిన కూటమి నేతలు

**జగ్గయ్యపేట, జూన్ 5, ప్రభాతవార్త :** నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితప్రస్థానంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, జగ్గయ్యపేట తొలి మంత్రిగా పనిచేసి హుందాకు మరోపేరుగా రాజకీయాల్లో జెంటిల్‌మెన్‌గా అన్ని పార్టీల వారి అభిమానాన్ని చూరగొన్న మాజీమంత్రి, ఎన్‌టిఆర్‌జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ గురువారం ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. విజయవాడలో జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ, అభినందన సభలో కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని రఘురామ్‌పట్ల తమకు గల ఆత్మీయ అనుబంధాలను నెమరువేసుకున్నారు. ఎన్‌టిఆర్ స్వయం నిర్ణయంతో పార్టీ టిక్కెట్టు ఇవ్వటం ద్వారా 1985 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన రఘురామ్ నాటి నుండి నేటి వరకు రాజకీయాల్లో విలువలు, హుందాతనానికి రోల్‌మోడల్‌గా నిలిచిన వైనాన్ని అభినందన సభలో నేతలు గుర్తుచేస్తూ సమకాలీన రాజకీయ నాయకులకు ఆదరా ్శన్ని రఘురామ్ అందిస్తున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు కేబినెట్‌లో మద్యనిషేధ, ఆప్కారీ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన రఘురామ్ తదనంతరం సుధీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా కేవలం కింగ్ మేకర్‌గానే వ్యవహరించారని పలువురు అభిప్రాయపడ్డారు. జగ్గయ్యపేట ఎంఎల్ఏగా శ్రీరాం రాజగోపాల్ మూడుసార్లు విజయం సాధించటంలో కూడా రఘురామ్ నిర్వర్తించిన పాత్ర మరువలేనిదని ప్రశంశించారు. హోదాకు తగిన పదవి కాకపోయినా సిఎం చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌ల నిర్ణయాన్ని రఘురామ్‌ను అభిమానించే కేడర్ వ్యతిరేకించినా పార్టీ ఆదేశాన్ని శిరోధార్యంగా స్వీకరించిన రఘురామ్ ద్వారా ఆ పదవికే వన్నె వస్తుందని పలువురు నిస ్సంకోచంగా సభలో వ్యక్తంచేశారు.

# ఎటువంటి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమై ఉండాలి : సిఎస్



కలెక్టర్‌ను, ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న దృశ్యం

**న చి వా ల య ం, జూ న్ 5,ప్రభాతవార్త :** రాష్ట్రంలో నైరుతీ రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు,వరదలు ఎటువంటి విపత్తులనైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సర్వసన్నద్ధమై ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆయా శాఖాధికారులను ఆదే శించా రు. మా న్ న ూ న్ సన్నద్ధతపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వివిధప్రభుత ్వ శాఖలతోపాటు ఇండియన్ ఆరీ ్మ,నేవీ,ఎయిర్‌ఫోరు ్స,క ోస్టుగారు ్డ,ఎన్డిఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ తుఫానులు,భారీ వర్షాలు,వరదలు వంటివి సంభవించినప్పుడు ఆసి ్త,ప్రాణ,నష్టాలను కనిష్ట స్ా ్థయికి తగ్గించే ప్రయత్నంతో పాటు సకాలంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పే విధంగా ఆయా శాఖల వారీ ప్రణాళికలతో సన్నద్ధమై ఉండాలని స్పష్ ్టంచేశారు.మున్సిపల్ పరిపాలన శాఖ పట్టణ ప్రాంతాల్లోని డ్రైన్లు,కాల్వల్లో పూడిక తీత పనులు సకాలంలో పూరి ్త చేయాలన్నారు.ఇంధన శాఖ తగిన సంఖ్యలో స్టాండ్‌బై జనరేటర్లు,ట్రీకట్టర్లు,విద్యుత్ స్థంభాలు సిద్దంగా ఉంచుకోవాలన్నారు.నీటి ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రభల కుండా తగిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు తీసుకోవాలని చెప్పారు.పౌరసరఫరాల శాఖ తగిన మేరకు వివిధ నిత్యావసర సరుకులను ఆయా ఎంఎల్‌సి పాయింట్లలో స్టాకులు అందుబాటులో ఉంచాలని చెప్పారు.ఆరీ ్మ,నేవీ,ఎయిర్‌ఫోరు ్స ,కోస్టుగారు ్డ,ఎన్డిఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వివిధ విపత్తులు సంభవించినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎనలేని సేవలు అందిస్తున్నాయని కొనియాడుతూ రాబోయే రోజుల్లో కూడా అదే

# దుర్గమ్మ ఆలయంలో వనం మనం

## - కెబిఎన్ విద్యార్థుల సేవాకార్యక్రమాలు



మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, జూన్ 6, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో గురువారం వనం మనం కార్యక్రమం ఇఓ వికె శీనా నాయక్ ప్రారంభించి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేవస్థానం ఘాట్‌రోడ్డులో వివిధ రకాల మొక్కలు నాటిన అనంతరం ఇఓ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై పలు రకాల ఔషద మొక్కలు, దేవతా వృక్షాలు, నక్షత్ర, రాశులకు చెందిన మొక్కలు విస్తృతంగా నాటే ప్రక్రియ మొదలైందన్నారు. ఆలయ ప్రాంగణం శోభాయమానంగా, ఆహ్లాదకరంగా కనిపించే రంగురంగుల పూల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానంలో ప్లాస్టిక్ రహితంగా వుంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుర్గమ్మవారిని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మ ఆలయ ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు పలికారు.మల్లేశ్వర స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో గురువారం నవగ్రహ మండప పున: ప్రతిష్ట కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేదపండితులు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఇఓ వికె శీనా నాయక్ రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వివరించారు. గురువారం ఇఓ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు.4కోట్ల 11 లక్షల 96వేల 190లు లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. అలాగే 394గ్రాముల బంగారం, 8కెజిల 010 గ్రాముల వెండి కూడా భక్తులు శ్రీ అమ్మవారికి కానుకలుగా సమర్పించారని ఇఓ తెలిపారు. కార్యక్రమంలో భవానీ సేవాదారులు, దేవదాయ శాఖాధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. పేరిట దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కనకదుర్గానగర్, మహామండపం ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. మహామండపం పక్కన వున్న దేవతా వృక్షాల వద్ద శుభ్రం చేసి మొక్కలకు నీరు పెట్టారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దసరా, భవానీ దీక్షల్లో సేవలందించే ఎన్‌సిఇ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై సేవలందించడం శ్రీ అమ్మవారి అనుగ్రహం వారికి పరిపూర్ణంగా అందుతుందని ఇఓ పేర్కొన్నారు.

# విద్య,మౌలికవసతుల కార్పొరేషన్‌చైర్మన్‌గా రాజశేఖర్ బాధ్యతలు

రాష్ట్ర విద్య, మౌలిక వసతుల కార్పోరేషన్ చైర్మన్‌గా కుప్పం రాజశేఖర్ గురువారం విజయవాడ వడ్డేశ్వరంలోని కార్పోరేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ జవహర్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎండి షరీఫ్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ లో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కన్వీనర్ ఆచార్య స్వామి

# ప్రశాంతంగా ఎడ్ సెట్ పరీక్ష- 21న ఫలితాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూన్5, ప్రభాతవార్త:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన ఎడ్ సెట్2025 పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసిందని సెట్ కన్వీనర్ ఆచార్య ఎవివిఎస్.స్వామి తెలిపారు. మొత్తం 87 ఆన్‌లైన్ కేంద్రాలలో ఈ పరీక్షకు 14 609 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన కీ విడుదల చేస్తామని వెల్లడిం చారు. ఫలితాలను 21వ తేదీన విడుదల చేస్తామని ప్రకటించారు.

# టిడిపి నేత సుధాకర్ నాయుడు హత్యకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుల కుట్ర!

**అనంతపురం, జూన్ 5 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు టిడిపి నేత లిక్కర్ డాన్‌గా గుర్తింపు ఉన్న సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలియవచ్చింది. సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు రెక్కి కూడా నిర్వహించినట్లు పోలీసులదర్యాప్తులో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి నేత సుధాకర్‌నాయుడుని టిడిపి అధిష్టాన వర్గం అమరావతికి పిలిపించి బుధవారం రోజు ఇద్దరికి కోటింగ్ ఇచ్చింది. టిడిపి రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ రవీంద్ర ప్రత్యేకంగా ఇద్దరిని కూర్చోబెట్టుకుని ఇద్దరు విబేదాలు వీడనాడి పార్టీ కోసం కలిసి పని చేయాలని హెచ్చరికలు చేసి సర్ది చెప్పి పంపినట్లు తెలియవచ్చింది. ఈ సంఘటన భహిర్గతం కావడంతో ఆలస్యంగా జరిగిన గొడవలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. వివరాలలోకి వెళ్తే.. రాష్ట్రస్థాయి ఇంటెలిజెన్స్ అధికారుల బృందానికి విశ్వసనీయ సమాచారం అందింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు అనంతపురం టిడిపి నేత సుధాకర్‌నాయుడుని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని పక్కా సమాచారం అందింది. ఆ సమాచారాన్ని ఇంటెలిజెన్స్ ముఖ్యులు అనంతపురం జిల్లా ఎస్పీ డి.జగదీష్‌కు చేరవేయడంతో ఎస్పీ నేతృత్వంలోని అధికారుల బృందం అలర్ట్ అయింది. జిల్లా ఎస్పీ తాజా దర్యాప్తులో కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు భూదందాలకు, దౌర్జన్యాలకు దిగుతున్నారని, ఫిర్యాదుల్లో వచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు, సమీప బంధువులు కొందరు మద్యం సేవించి సుధాకర్‌నాయుడుని హత్య చేసే విషయాన్ని చర్చించుకున్నట్లు ఆ విషయం ఇటు పోలీసులకు, అటు సుధాకర్‌నాయుడుకు సమాచారం లీకైనట్లు తెలియవచ్చింది. అయితే అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికార పార్టీలో ఉండటంతో భూ తగాదాల విషయంలో ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకునే విషయంలో పోలీసు అధికారులు నాన్చుతూ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి ఇంటెలిజెన్సీ అధికారులు తాజాగా ఇచ్చిన సమాచారం ప్రకారం ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు, టిడిపినేత సుదాకర్‌నాయుడును హత్యకు కుట్ర పన్నుతున్నారని సమాచారాన్ని చేరవేయడంతో జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా టిడిపి నేత సుధాకర్‌నాయుడుని, ఆయన సతీమణిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్లు జరిగిన సంఘటనలను ఆరాతీసినట్లు తెలియవచ్చింది. ఇందులో భాగంగా తన దర్యాప్తులో వెల్లడైన విషయాలను రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులకు చేరవేయడంతో టిడిపి అధిష్టాన వర్గం స్పందించి, టిడిపి రాయలసీమ ఇన్‌చార్జ్‌రవీంద్రద్వారా వారిద్దరిని పిలిపించి చర్చించినట్లు తెలియవచ్చింది. ఈ విషయంలో ఇటు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కానీ, అటు టిడిపి నేత సుధాకర్‌నాయుడుకానీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేదు. గురువారం మీడియాలో, సోషల్‌మీడియాలో వార్తలు గుప్పుమన్నాయ

# వేరుసెనగ విత్తనం నాణ్యతగా ఉంటేనే తీసుకోండి

## - కలెక్టర్‌తో కలిసి వేరుసెనగ విత్తన పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



: కలెక్టర్, ఎమ్మెల్యే సునీతకు సన్మానం

**అనంతపురం, జూన్ 5 ప్రభాతవార్త బ్యూరో** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుసెనగ విత్తనం నాణ్యతను ఒకటికి రెండు సార్లు పరిశీలించి తీసుకోవాలని.. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే వెంటనే వెనక్కు ఇవ్వాలని రైతులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం, పంపనూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు విత్తన వేరుశెనగ పంపిణీని ఆమె జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. ఇటీవల చెన్నేకొత్తపల్లిలో వేరుసెనగ విత్తనం గోదాంని పరిశీలించినప్పుడు.. ఒకే బస్తాలో ఐదారు రకాలు కలిసి ఉందని ఆలోడ్ వెంటనే వెనక్కు పంపినట్టు చెప్పారు. రైతులు కూడా నాణ్యత చూసుకుని తీసుకోవాలని ఈ విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. జిల్లాకు ఇప్పటి వరకు 50వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విత్తనం త్వరగా తెప్పించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే వేరుసెనగ సాగు చేసే రైతులు మాత్రమే విత్తనం తీసుకోవాలని..

దానిని బయట మార్కెట్లో విక్రయించాలని చూడవద్దన్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు భరిస్తూ సబ్సిడీ పై విత్తనం అందిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో దీనిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మరోవైపు పలు అంశాల పై జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే సునీత వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి రిజర్వాయర్ కోసం 700 ఎకరాల భూసేకరణ చేయాలని గతంలో ప్రయత్నం చేశారన్నారు. కానీ అక్కడ రిజర్వాయర్ నిర్మించలేదన్నారు. ఆ రైతులకు బ్యాంకుల్లో లోన్ల విషయంలో బ్యాంకర్లు పెండింగ్‌లో ఉంచారన్నారు.

# అమృతపథకంలో అవినీతి జరిగిందని నిందలు వేయడం సరికాదు

## ఎమ్మెల్యే దగుమాటిపై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కావలి, జూన్05 ప్రభాతవార్త** ప్రస్తుత కావలి ఎమ్మెల్యే, ఆనాటి కాంట్రాక్టర్ దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌కు సంబంధించి 350 కోట్ల రూపాయల పెద్ద కాంట్రాక్ట్ ఇప్పించా, ఈ కాంట్రాక్ట్‌కు సంబంధించి ఎంత కమీషన్ నాకు ఇచ్చావో నీ బిడ్డలపై ప్రమాణం చేసి బహిరంగంగా చెప్పాలని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల ఎమ్మెల్యే దగుమాటి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ మండిపడ్డారు. గురువారం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృతపథకంలో అవినీతి జరిగిందని, ఈ కాంట్రాక్ట్‌లో కమీషన్లు ముట్టాయని నిందలువేయడం సరికాదని దమ్ము, ధైర్యం ఉంటే విచారణ చేయించి నిరూపించాలని ప్రతాప్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ పథకానికి సంబంధించి నిధులు తెచ్చింది బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్రలు అని



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 06 - జూన్ - 2025

7


# ఆదిత్యలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**గండేపల్లి , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్యయూనివర్సిటీ లో ఎన్.ఎన్.ఎన్ యూనిట్ ఆధ్వర్యం లో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపురస్కరించుకుని ప్రాంగణంలో మొక్కలు నాటి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన యూనివర్సిటీ హొప్రో.వైస్.ఛాన్స్ లర్లు . డా.ఎస్.రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్ లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పచ్చని ప్రకృతిని కాపాడుకునే బాధ్యత మనందరిది అని మనం పుట్టింది మొదలు మట్టిలో కలిసే వరకు అనునిత్యం మనం ప్రకృతితో మమేకమయి ఉంటామని మనకు తిండికి,బట్టకు,నివాసానికి, ఎన్నో అవసరాలకు ప్రకృతి నుండి తీసుకుంటున్నామని అటువంటి పర్యావరణాన్ని మన స్వార్థంతో నాశనం చేయడం తగదని హితవు పలికారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి పెంచే విధంగా కృషి చేసి ప్రకృతి పరిరక్షణ కొరకు పాటుపడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. విలాస్ అనిల్ చవాన్,డీన్ స్టూడెంట్స్ అఫైర్స్.డా.డి. కిషోర్,డా. ఎం.వి.రాజేష్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్. బి.రాంబాబు, ఐ.వి.వీరాంజ నేయులు,ఎల్. పరిణయశ్రీ,జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ఇంజనీరింగ్,ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్ , జూన్ 05 ( ప్రభాతవార్త )**

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ భవిష్యత్తులో భావితరాలకు చక్కని వాతావరణం ,గాలి, నీరు కలుషితం కాకుండా అందించేందుకు ప్రతి ఒక్కరు చేయాలని కోరారు . ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు,మండల ప్రజా పరిషత్ అధికారి పసుపులేటి సతీష్, ఏపీవో గణేష్ , ఈవోపీఆర్డి సీతారామాంజనేయులు, జనసేన పార్టీ నాయకులు శ్రీరంగు శ్రీనివాస్,పాంగ్రంకి రాజు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'పద్మాజీ గ్రాండ్ ' ప్రారంభోత్సవం..ముఖ్యఅతిథిగా కార్మిక శాఖ మంత్రి సుభాష్



**అంబాజీపేట , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

అంబాజీపేటలో అధునాతన సౌకర్యాలతో 'పద్మాజీ గ్రాండ్' నిర్మించడం అభినందనీయమని రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. అబాజీపేట-పి.గన్నవరం మెయిన్ రోడ్లో నూతనంగా నిర్మించిన పద్మాజీ గ్రాండ్-లగ్జరీ రూమ్స్, మినీ ఫంక్షన్ హాల్ను మంత్రి సుభాష్ తో పాటు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యంలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వివాహ వేడుకలు,పుట్టినరోజు వేడుకలు, రాజకీయ పార్టీల అఫీషియల్ మీటింగులు, కార్పొరేట్ కంపెనీల మీటింగులు నిర్వహించుకునేందుకు అంబాజీపేటలో సరైన వసతులు లేక పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. రాజకీయ పార్టీలు,కార్పొరేట్ కంపెనీలు, ప్రజల అవసరాలను గుర్తించిన అంబాజీపేట మాచవరం గ్రామానికి చెందిన పద్మాజీ టవర్స్ అధినేత మైపాల తాతాజీ పద్మాజీ గ్రాండ్ ను నిర్మించారన్నారు. కోనసీమ ప్రాంతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడడంతో నూతన జిల్లాలో ఎన్నో విద్యా, వైద్య సంస్థలు,కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నాయన్నారు. వాటి అవసరాలను గుర్తించి తన వ్యాపారాలను వివిధ రకాలుగా విస్తరించుకుంటున్న మైపాల తాతాజీ-పద్మావతి దంపతులను వీరుతో పాటు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధు లు,నాయకులు, మండల ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి, సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి,మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ, బండారు శ్రీనివాస్, నామన రాంబాబు,నల్లా పవన్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు,అడబాల సత్యనారాయణ, కల్వకొలను తాతాజీ, మెట్ల రమణబాబు, గంధం బాలరాజు, చిక్కాల గణేష్, కొర్లపాటి గోపి,ఏడిద శ్రీను,గణపతి వీరరాఘవులు,రవణం రాము, దొమ్మేటి సాయికృష్ణ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆహ్వానితులను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు.

# నేటి నుండి రుక్మిణి సత్యభామ శ్రీ గోపాల స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు



**ఆత్రేయపురం , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, బదిలీల స్వామి గా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి వారి ఆలయంలో క్షేత్ర పాలకులైన శ్రీ గోపాల స్వామి వార్ల వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 6తేది ఏకాదశి నుండి 12. పాడ్యమి వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు. డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, ర్యాలి ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ అనంతరం శ్రీ స్వామీ వారి కళ్యాణం, అంగరంగ వైభవంగా జరుగుతాయాన్నారు. 8వ తేది సాయంత్రం సదస్యం.. 11తేది న పూర్ణాహుతి అనంతరం చక్రస్నానం, 12.తేది సాయంత్రం శ్రీ పుష్పోత్సవం ముగుస్తాయిన్నారు. కావున భక్తులు, దాతలు, గ్రామస్తులు శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాలలో పాల్గొని, తిలకించి శ్రీ స్వామీ వారి ని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# మొక్కలు నాటడం, దైవకార్యంగానే భావించాలి : ఈవో జగన్మోహన్ శ్రీనివాస్



**పిఠాపురం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, దైవ కార్యంగానే భావించాలని, పదవ శక్తిపీఠం పిఠాపురం శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం (పాదగయ) ఈవో, సహాయ కమిషనర్ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని,దేవస్థానం పరిసరాల్లో ఈవో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ,వన సంరక్షణ భగవంతుడు మెచ్చిన పని అని అన్నారు. ప్రతి మొక్కలోని జీవాన్ని భగవంతుని రూపంలో చూడాలన్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవస్థానం పరిసరాల్లో మొక్కలు నాటడంతో పాటుగా,వాటి పరిరక్షణ చేపడుతున్నామని తెలిపారు. అనంతరం దేవస్థానం సిబ్బంది పర్యావరవణ పరిరక్షణ ప్రతిజ్ఞ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ వీరభద్రరావు, సిబ్బంది సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# మాచవరం విద్యార్థికి జె.ఈ.ఈ అడ్వాన్స్ లో 45 వ ర్యాంకు..అభినందించిన ఎమ్మెల్యే గిడ్డి



**అంబాజీపేట , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జె.ఈ.ఈ అడ్వాన్సడ్ ఫలితాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన గంగ్రోతు అఖిల్ కు ఈ.డబ్ల్యు. ఎస్( ఎకనామికల్లీ బాక్ వర్డ్ సెక్షన్)కోటాలో 45 వ ర్యాంక్,అల్ ఇండియా 665 ర్యాంక్ లభించింది .మధ్య తరగతి కుటుంబానికి చెందిన అఖిల్ చిన్నతనం నుండి ఎంతో కష్టపడి చదువుకున్నాడని తల్లి వసంతలక్ష్మి తెలిపారు. తండ్రి రామకృష్ణ ప్రయివేటు ఉద్యోగిగా పనిచేస్తూ మృతి చెందటంతో తల్లి,తండ్రి తానై అఖిల్ ను ఎంతో కష్ట పడి,టైలరింగ్ చేస్తూ, చదివించానని వసంతలక్ష్మి తెలిపింది. రాజమహేంద్రవరం లోని తిరుమలలో ఇంటర్మీడియట్ చదివిన అఖిల్ తనకు లభించిన ర్యాంక్ ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న ఐ .ఐ. టి లలో ఎక్కడ అవకాశం వచ్చినా కంప్యూటర్ సైన్స్ కోర్సు చదువు తానని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అఖిల్ ను గురువారం దుశ్శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు,పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు,తల్లి వసంత లక్ష్మి,బంధువులు పాల్గొన్నారు.

# వాసవీ మాతకు లక్ష మల్లెలార్చన



**అన్నవరం, జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

అన్నవరం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి లక్ష మల్లెలతో పూజ, హోమం నిర్వహించారు. ఆలయార్చకులు ఈ సందర్భంగా, వాసవీ మాతకు వేకువ జాము నుండీ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిం చారు. ఈ పూజా కార్యక్రమాలలో అశేష భక్తులు, శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొనారు.

## ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన ట్రస్ట్ కు విరాళం



**ఆత్రేయపురం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

బదిలీల స్వామిగా ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ %డ% గోపాల స్వామి వారి నిత్య అన్నదాన పథకానికి ర్యాలి గ్రామానికి చెందిన పేర్చెర్ల శాన్విత రాజు రూ.50,116./-లు పేర్చెర్ల నాగ వెంకట అనిందిత్ వర్మ రూ.10,116/-లు. పేర్చెర్ల భాను రిధి వారు రూ.5,000./-లు ఏలూరు చెందిన చెరుకునీడి ఉదయ్ కిషన్ హేమలత దంపతులు శ్రీ స్వామి వారి అన్నదాన పథకానికి వారి కుమార్తెలు చిరంజీవి చోళ లతీక్ష, చిరంజీవి రిత్యశ్రీ ల పేరున రూ.5,116.వేలు విరాళంగా అందించారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ కార్యనిర్వాహణాధికారి, భాగవతుల వెంకటరమణ మూర్తి శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

# ప్రగతిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**గండేపల్లి , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్.సి.సి. గ్రూప్ హెడ్ క్వార్టర్స్ 9 వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆప్ సెట్టింగ్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ పి. ప్రవీణ్ బాబు, ఎస్.సి.సి. కేడెట్స్ ని ఉద్దేశించి మాట్లాడుతూ "పుట్టింగ్ ఏన్ ఎండ్ టూ ప్లాస్టిక్ సాల్యూషన్" గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.సి. కాడెట్స్ ర్యాలీ, స్వచ్ఛ భారత్ అభియాన్, మొక్కలు నాటడం డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ తమ కళాశాల నిర్వహించే ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో పర్యావరణం పరిరక్షణ మీద అవగాహన కలుగుతుందన్నారు. కళాశాల ఎన్.సి.సి. కేర్ టేకర్ డాక్టర్ బి.ఆదినారాయణ మాట్లాడుతూ పర్యావరణం గురించి పౌరులకు అవగాహన కల్పించ వలసిన సామాజిక బాధ్యత ఎన్.సి.సి. కాడ్యెట్స్ కి ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎం.వి. హరనాధ్ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరక్టర్ డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై.జయబాబు,9వ ఆంధ్ర బెటాలియన్ పర్మనెంట్ ఇన్స్ట్రక్టర్స్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఎన్.సి.సి. కాడెట్స్ పాల్గొన్నారు.

# కన్నతల్లి లాంటి పుడమితల్లిని కాపాడుకుందాం.. ప్రకృతిని ప్రేమిద్దాం : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



**కోనసీమ బ్యూరో , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**

మానవుని మనుగడకు చెట్లే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ ను నియంత్రించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రపురం మండలంలోని ఆదివారపుపేట గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ప్రపంచ పర్యావరణ దినోత్సావాన్ని పురస్కరించుకుని వన సంరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఒక్కరోజే రికార్డు స్థాయిలో కోటి మొక్కలు నాటనున్నాట్టు తెలిపారు. వనమహోత్సవంలో ప్రతిఒక్కరం భాగస్వాములమై మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం అని పిలుపు నిచ్చారు. మరల్ని భరిస్తున్న దరిత్రికి మొక్కలను నాటడమే మనమిచ్చే బహుమతి అని అన్నారు. చెట్లను కాపాడి వాటిని పరిరక్షిస్తామంటూ అధికారులతో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఫారెస్ట్ అధికారి ఎం వి వి ప్రసాద్ లు మాట్లాడుతూ మొక్కల పెంపకం, వన సంరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని ప్రతినిత్యం చేయాల్సిన కార్యక్రమం అన్నారు. అడవులను పరిరక్షించుకుంటే అదే మన ప్రాణానికి జీవనాధారం ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ లు జి ఈశ్వరరావు, డి ఎస్ ఎన్ మూర్తి, ఎఫ్ ఎస్ ఓ నాగ సత్యనారాయణ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు యోగేంద్ర, దుర్గాప్రసాద్, ఎంపీడీవో పద్మజ్యోతి, ద్రాక్షారామం సర్పంచి కొత్తపల్లి అరుణ, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు ఆధారం వృక్షాలే : ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

కాలుష్య కోరల నుంచి వాతావరణాన్ని రక్షించుకోవడం కోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటి బాధ్యతగా పెంచాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గోపాలపురం నియోజకవర్గంలో గురువారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏఎంసీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటారు. కాలానుగుణంగా వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పెరుగుతున్న జనాభకు అనుగుణంగా వాహనాలు కూడా అధికమైపోయాయని, వాటి నుంచి విడుదలై కార్బన్ మోనాక్సైడ్ పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. మానవ మనుగడకే ముప్పువాటిల్లే అటువంటి చెడు వాయువుల ప్రభావం తగ్గించాలంటే చెట్లు ఎంతో దోహదపడతాయన్నారు. వాతావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటి బాధ్యతగా పెంచితేనే రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందిచగలుగుతాం అన్నారు. లేకుండా వారి భవిష్యత్ తరాలు బతుకులు ప్రశ్నర్థాకంగా మారిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల పార్టీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాస్, తెదేపా నాయకులు జ్యేష్ఠ శ్రీధర్, మద్దిపాటి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, కొర్లపాటి రాము, పడమటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల్ని పరిరక్షించడం మన జీవన మనుగడకు అత్యంత అవసరం : బత్తుల



**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజానగరం మండలంలోని రాజానగరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోమొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు స్టేట్ కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి పాల్గొని, సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా అందరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని పరిరక్షించడం అంత కన్నా ముఖ్యమని తెలిపారు. చెట్లు అనేవి మనందరికి ప్రాణవాయువును ఇచ్చేవని వాటిని నరకడం వలన వాతావరణానికి హాని ఏర్పడుతుందని చెప్పారు. చెట్ల ప్రాధాన్యత అందరికి తెలిపి,ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స

## - చేప ముల్లు గుండె వద్ద ఇరుక్కున్న మహిళ ప్రాణాన్ని కాపాడిన వైద్యులు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**
కాకినాడ నగరంలో ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడారు. సుమారు నాలుగు గంటలపాటు వైద్యులంతా శ్రమించి విజయవంతంగా పూర్తి చేశారు. అన్న వాహిక నుండి చొచ్చుకుని గుండె పెద్ద నరంలోనికి చొచ్చుకున్న చేప ముల్లును తీశారు. ఈ విధంగా బహుశా జాతి స్థాయిలో ఈ తరహా కేసు రెండు మూడు కంటే ఎక్కువ ఉండవని ఆ వైద్యులు తమ అభిప్రాయాలను గురువారం అపోలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సంవత్సరం చికిత్స సంబంధించి వైద్యులు వై శివరామకృష్ణ, పి నాగేశ్వరరావు, జి వంశీ చైతన్యలు వివరించారు. బిక్కవోలుకు చెందిన 54 ఏళ్ల జంపా మంగయ్యమ్మకి అన్నవాహిక ద్వారా చేప ముల్లు గుండె వద్దకు చేరిందన్నారు. ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి చేప ముల్లు గుండె దగ్గర చొచ్చుకుని ఉండడం గమనించామన్నారు. ఇది చాలా తరహాగా శస్త్ర చికిత్స చేసి తొలగాల్సిన ప్రక్రియ అంటూ ఆమె బంధువులకు వివరించామన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుండా, చాతీ ఎముకలకు నష్టం కలిగించకుండా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని ఈమెకు గుండె వద్ద ఇరుక్కుని ఉన్న చేప ముల్లును తొడల దగ్గర నుంచి గొట్టం ద్వారా ట్రేవర్ ప్రొసీడర్ అనే విధానంలో చికిత్స నిర్వహించి తొలగించామని చెప్పారు. ప్రస్తుతం ఆమె కోరుకుంటున్నారని త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు శివరామకృష్ణ, నాగేశ్వరరావు, వంశీ చైతన్యలు తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకున్న మంగయ్యమ్మ కుమారుడు దీనికి సంబంధించిన కారణాలను వివరించారు. సుమారు పదిరోజుల క్రితం సెల్ ఫోన్లో మాట్లాడుతూ చేప కూరతో భోజనం చేసిందన్నారు. అప్పుడు గొంతులో చేప ముల్లు ఇరుక్కుంది అంటూ కడుపుబ్బర (గ్యాస్టిక్) సమస్యలు ఉన్నాయనుకొని స్థానిక వైద్యులను కలిసి చెప్పగా వారు మందులు రాశారన్నారు. అయినా ఎంతకీ తగ్గకపోవడంతో ఆ వైద్యులు కాకినాడ అపోలో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించాలని చెప్పడంతో తీసుకొచ్చామన్నారు. అపోలో ఆసుపత్రి వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తామని చెప్పగా తాము అంగీకరినట్లు మంగయ్యమ్మ కుమారుడు చెప్పారు. కష్ట సాధ్యమైన శస్త్ర చికిత్సను నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులను అపోలో ఆసుపత్రి సిఓఓ ఆర్ఆర్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.

# ప్రచారానికి పరిమితమైన పర్యావరణ దినోత్సవం..కాలుష్య కోరల్లో రాజానగరం



**రాజమహేంద్రవరం సిటీ , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
పర్యావరణ దినోత్సవం ప్రచారానికి మాత్రమే పరిమితం అవుతుంది. దీనిని కాపాడాల్సిన అధికారులు, నాయకులు ఫోటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా పల్లెలు, పట్టణాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. పర్యావరణం ముఖ్యంగా వాయువు నీటి కాలుష్యము వలన పాడైపోతుంది. కానీ నేటి పాలకులు, అధికారులు గాలి నీరు యదేచ్ఛగా కలుషితం చేసి ప్రజల ప్రాణాలు గాలికి వదిలేసి కోట్లు సంపాదించుకుంటున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో కార్పొరేట్ ఫ్యాక్టరీలు, ఆసుపత్రిలు వలన ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుండి వచ్చే వ్యర్థాలు, కలుషిత నీరు, విషవాయువులు ఆ గ్రామాల పరిధిలో వదులుతున్నారు. దీని వలన వచ్చే దుర్గంధం వలన ప్రజలు ఆనారోగ్యం చెందుతున్నారు. ఇదేవిధంగా ఏళ్ళ తరబడి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రిలో ఉపయోగించిన వ్యర్థాలు రాజానగరం గ్రామం రావులచెరువు గట్టు ప్రక్కన ఆసుపత్రి ట్రాక్టర్లు, వ్యాన్ లో తీసుకుని వేస్తున్నారు. రోగులు, వైద్యులు ఉపయోగించి రక్తం అంటున్న మాస్కులు, దుస్తులు, ఇంజెక్షన్లు, గాజు గుడ్డలు నేరుగా వేస్తున్నారు. ఇవి గాలికి ఎగిరి ఇళ్ళు లో కి వస్తున్నాయి. వర్షాకాలంలో నీరు వ్యర్థాలతో కలిసి పోయి గ్రామానికి మంచినీరు అందిస్తున్న రావులచెరువు లో వస్తున్నాయి. భారీ వర్షాలకు ఇళ్ళలోకి వ్యర్థాలు కొట్టుకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలుష్య ప్రభావం గ్రామంలో వృద్ధులు, చిన్న పిల్లలపై ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు. జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రిలో వ్యర్థాలపై ఆందోళనలు ధర్నాలు చేసిన అప్పటి ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు రాసిన వినతి పత్రాలు బుట్టదాఖలైనాయి. కంచే చేను మేసింది అనే చందంగా అధికారులు, నాయకుల ప్రజల ప్రాణాలు కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తున్నారు. దీనిపై ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు ఉద్యమించి నాయకులు, అధికారుల చర్యలను ఎండగట్టాలని. లేనిచో నియోజకవర్గం ప్రధాన కేంద్రం రాజానగరం కాలుష్యం కాటు తప్పదు.



## వాడపల్లి దేవస్థానం వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ,1,00,116/-లు విరాళం



**ఆత్రేయపురం , జూన్ 05 ( ప్రభాతవార్త )**
ఏడు వారల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి విజయవాడ, తాడిగడప చెందిన చంద్ర దిలీప్ కుమార్ , జ్యోతి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116 విరాళంగా అందించారు. వీరికి ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. వేలాదిమంది భక్తులతో స్వామివారి వసంత మండపంలో అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలను అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్ర సాదాలు స్వీకరించారు

# జనరంజక పాలనకు ఏడాది పూర్తి..ఎమ్మెల్యే నానాజీ క్యాంపు కార్యాలయంలో సంబరాలు

## : ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

**కాకినాడ రూరల్ , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
రాష్ట్రంలో అరాచక పాలన అంతమై ప్రధాని నరేంద్ర మోడీ సహకారం తో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి జన రంజక పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా కాకినాడ గ్రామీణ శాసన సభ్యులు పంతం నానాజీ క్యాంపు కార్యాలయంలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యకర్తలు, కూటమి నాయకులు కలిసి ఆడపడుచులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఆరాచక వైసిపి పాలన ముగింపు కు



ఏడాది పూర్తయిందని, కూటమి పాలన లో ప్రజలు సంతోషంగా ఉన్నారని , సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గోదారిగుంట నానాజీ స్వగృహం వద్ద ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, బిజెపి నాయకులు చిలుకూరి రామ్ కుమార్ కూటమి నాయకులతో కలిసి దీపావళి పండుగ వేడుకగా దీపాలు వెలిగించి టపాసులు కాల్చి కూటమి నాయకులు , కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. గంగనపల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు సిరంగు శ్రీనివాస్, పాండ్రంకి రాజు, పంచాయతీ కార్యదర్శి కర్రీ శ్రీనివాస్ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ఈ కార్యక్రమంలో బిజెపి పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీల, టిడిపి నాయకులు వాసిరెడ్డి ఏసుదాస్, నురుకుర్తి వెంకటేశ్వరరావు, సీతయ్య దొర, జనసైనికులు,జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొక్కల్ని పెంచడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి : ఎంపీడీవో ఎం.వి.ఆర్ కుమార్ బాబు

**ప్రతిపాడు , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**
మొక్కల్ని పెంచడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ప్రత్తిపాడు మండల అభివృద్ధి అధికారి ఎం వి ఆర్ కుమార్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కుమార్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథం, గ్రామ సర్పంచ్ అమరాది వెంకట్రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణం ముడిపడి ఉందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం




సామాజిక బాధ్యతగా చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతోపాటు పరిసరాలను పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నియంత్రణ, నేరాల అదుపుకు, పటిష్ట చర్యలు..కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్



**రావులపాలెం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలో నేరాల అదుపుకు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ తెలిపారు. గురువారం ఆయన రావులపాలెం, కొత్తపేటల్లో భద్రతా చర్యలను పర్యవేక్షించారు. రావులపాలెంలో ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశమై ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే పలు సూచనలు చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే రావులపాలెంలో మహిళలకు శక్తి యాప్ ఉపయోగాలను వివరించి వారి మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేయించారు.

రావులపాలెం, కొత్తపేట పెట్రోల్ బంకుల వద్ద సీసీ కెమెరాల పనితీరు, అక్కడ తీసుకుంటున్న భద్రతా చర్యలు గురించి స్వయంగా డీఎస్పీ పరిశీలించారు. రావులపాలెం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ చుట్టూ ఇటీవల ఏర్పాటు చేసిన 32 పైగా సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ అచ్యుతాంబ, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రావులపాలెం టౌన్ సీఐ ఎం. శేఖర్ బాబు, కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర, సిబ్బంది ఉన్నారు

## ప్రధానోపాధ్యాయుల తో మండల విద్యా శాఖ సమావేశం

**కె.గంగవరం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
కె గంగవరం మండలం లో విద్యాశాఖ భవనంలో విద్యాశాఖ అధికారి నాగరాజు, ఆంజనేయులు ఆధ్వర్యం లో ప్రధానోపా ధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జూన్ 9 వ తేదీ న ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణం లో నిర్వహించబడే యోగ కార్యక్రమం నకు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పి డి లు , ఎన్ సి సి విభాగం విద్యార్థులు అందరు ఉదయం 6 గంటలకు హాజరు అవ్వాలి అన్నారు. వేసవి సెలవులు ముగుస్తున్నందున పాఠశాల గదులను పరిసరాలను పరిశుభ్ర%శీ% చేసి, మధ్యాహ్న భోజన కార్యక్రమం నకు పాఠశాల తెరచిన నాటి నుండి అమలు చేయుటకు రైస్ ఎగ్స్ చిక్కి సమకూర్చుకొని, పేరెంట్స్ కమిటీ ల సహకారం తో పాఠశాల ను అభివృద్ధి చేసుకోవాలి అని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా సుందర పల్లి హైస్కూల్ కి వేణుగోపాల్, దంగేరు హైస్కూల్ కి శ్రీనివాస్, పామర్రు హైస్కూల్ కి ఈశ్వరుడు, కూళ్ల హైస్కూల్ కి శ్రీమన్నారాయణ, అద్దంపల్లి హైస్కూల్ కి వెంకటరమణ, కోటిపల్లి హైస్కూల్ కుమార్, భట్లపాలిక హైస్కూల్ కి సత్యకుమారి, వివిధ మోడల్ పాఠశాలకు పి ఎస్ ప్రధానోపాధ్యాయులుగా విధులకు హాజరయ్యారు.



# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

## అంబాజీపేటలో ఘనంగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

**అంబాజీపేట , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలను పెంచుదాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి లు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీఓ జి. భీమారావు అధ్యక్షతన గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులను లేదా కాటన్ బ్యాగ్లను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాది ఏపీఓ అడపా శ్రీ వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. ముక్కామల,అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే డ్వాక్రా కార్యాలయం వద్ద మొక్కలు నాటారు.

# గోకివాడలో మొక్కలు నాటిన జనసేన నాయకులు

**పిఠాపురం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని,పిఠాపురం మండలం గోకివాడ గ్రామ సచివాలయం వద్ద స్థానిక జనసేన నాయకులు, జనసైనికులు,మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాయల పవన్, నామా రాంబాబు, సుందర శ్రీనివాస్,గరగ శేషబాబు, నామా వీరబాబు, నామా అశోక్, గరగ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



# 'క్వాలిటీ సర్టిఫికెట్'ను పరిచయం చేసిన ఆశీర్వాద్ ఆటా

## - ఆశీర్వాద ఆటా నూతన ప్రచారకర్తగా ప్రముఖ నటి స్నేహ

**రాజమహేంద్రవరం , జూన్ 05, ( ప్రభాతవార్త ) :**
భారతదేశపు ప్రముఖ గోధుమ పిండి బ్రాండ్ గా పేరుగాంచిన ఆశీర్వాద్ ఆటా దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ లలో 'క్వాలిటీ సర్టిఫికెట్' ప్రారంభంతో 'నాణ్యత హామీ 'ని పునర్నిర్వచిస్తోందని ఐటీసీ ఫుడ్స్ స్టేపుల్స్, అడ్జసెన్సీస్ అధికారి అనుజ్ కుమార్ రుస్తగి చెప్పారు. 'నాణ్యత హామీ? పేరుతో గురువారం నూతన టీవీసీను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశీర్వాద్ తమ దీర్ఘకాల సంబంధంతో ప్రసిద్ధి చెందిన నటీమణి స్నేహాను తమ బ్రాండ్ అంబాసిడర్ గా పునః పరిచయం చేసిందన్నారు.

దక్షిణ భారతదేశం అంతటా చాలా కుటుంబాల్లో సర్వ సాధారణంగా ఉపయోగించే పదార్థం ఆటా కాబట్టి, తమ కుటుంబం కోసం ఉత్తమమైన ఉత్పత్తిని ప్రజలు ఎంపిక చేయడాన్ని నిర్ధారించడానికి సేకరణ నుండి ప్యాకేజింగ్ వరకు వివిధ నాణ్యతా ప్రమాణాలను నెరవేర్చే సరైన ఉత్పత్తిని ఎంచుకోవడం తప్పనిసరి అన్నారు. ఆశీర్వాద్ ఎల్లప్పుడూ తమ వినియోగదారులకు రాజీలేని నాణ్యతను అందిస్తుందని, కానీ వినియోగదారులకు చాలా ఎంపికలు ఉన్న కారణంగా, ప్రతి ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్యాక్ ఇప్పుడు క్వాలిటీ సర్టిఫికెట్ తో అందజేస్తున్నామన్నారు. ఇది తన నాణ్యతా ప్రమాణాల గురించి రాతపూర్వకమైన హామీని, నాణ్యతను నిర్ధారించడానికి రోజూ నిర్వహించే పరీక్షల వివరాలను అందిస్తుందని చెప్పారు. ఆశీర్వాద్ తో, శ్రేష్టతకు హామీ చేకూరడమే కాకుండా భరోసా కూడా ఇవ్వబడుతుందని, గింజ నుండి ఆటా వరకు శ్రేష్టత యొక్క ప్రయాణాన్ని ప్రధానాంశంగా చూపించే పలు అంశాలను సర్టిఫికెట్ తెలియచేస్తుందన్నారు. గోధుమపిండి స్వచ్ఛత 100 శాతం గోధుమపిండి 0 శాతం మైదా కలిగి ఉండి, పోషకాహార విలువలు, ఫైబర్ మరియు ప్రోటీన్ తో ఆశీర్వాద్ వారి 'క్వాలిటీ సర్టిఫికెట్' తెలియచేస్తుందని, ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీఆటా యొక్క ప్రతి ప్యాక్ ఉత్తమమైన పద్ధతులు రూపొందించబడుతుందని చెప్పారు.

# ఘనంగా సత్యసాయి రథోత్సవం

## - రావులపాలెం చేరుకున్న సత్య సాయి ప్రేమ ప్రవాహిణి (రథం)

**రావులపాలెం , జూన్ 05 ( ప్రభాతవార్త ) :**
భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మానవాళి అభ్యున్నతి కొరకు ప్రపంచ శాంతిని కోరుతూ సత్య సాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రథోత్సవంలో భాగంగా శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని (రథం) గురువారం మధ్యాహ్నం రావులపాలెంలోని శ్రీ సత్య సాయి అష్టదళ సేవా పుష్పం (సేవా కేంద్రం) వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల సభ్యులు కలసలతో ఎదురేగి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహించి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల. కొండబాబు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో పుట్టపర్తి దివ్యక్షేత్రం నుండి దేశవ్యాప్తంగా ఈ రథోత్సవం వైభవంగా జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు రావులపాలెం చేరుకుందని తెలిపారు. భగవాన్ బాబా సకల జనుల సేవయే జనార్ధనుని సేవ అని, పరుల సేవయే పరమాత్ముని సేవ అని ప్రపంచవ్యాప్తంగా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని త్రాగునీరు లేక దాహార్తితో అలమటించిపోతున్న అనంతపురం, మెదక్, మహబూబ్ నగర్, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, మరియు చెన్నై వంటి మహానగరాలకు కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి తాగునీరు అందించి కోట్ల మంది దాహార్తిని



తీర్చారని. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు పుట్టపర్తి,బెంగళూరులో వందల కోట్ల రూపాయలు వెచ్చించి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించి ఉచిత వైద్య సేవలు అందించారని, నేటి యువత సన్మార్గంలో నడిపించేందుకు విశ్వవిద్యాలయాలను నెలకొల్పి ఎందరికో ఉచిత విద్యను అందించారని ఆయన అన్నారు. అంతేకాకుండా సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో సమగ్ర గ్రామీణ అభివృద్ధి,తాగునీరు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# జయ జయహే అక్షర దేవళ్ల !



తెలంగాణ అధికారిక గీతానికి అద్భుతమైన నాట్యంతో అందరి మనసులు దోచుకుంటోంది అక్షర దేవళ్ల. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊది, ప్రతీ ఒక్కరి గుండెల్లో చైతన్యాన్ని నింపిన ఈ అందెశ్రీ పాటకు తెలంగాణ సాకారమైన పదేళ్ల తర్వాత అధికారిక హోదా దక్కింది. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీత స్వరకల్పనలో కొత్తదనం అందుకున్న జయ జయహే తెలంగాణ పాటకు సంప్రదాయ నృత్యంతో మరింత అందాన్ని అక్షర దేవళ్ల తీసుకొచ్చింది. ఆమె నర్తించిన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తెలంగాణ ప్రకృతి అందాల మధ్యన అద్భుతమైన హావభావాలతో నర్తించి జయ జయహే తెలంగాణ పాటకు అక్షర ప్రాణం పోసింది. తన తల్లి, గురు భావన పెదప్రోలు దగ్గర నృత్యశిక్షణ తీసుకున్న అక్షర దేవళ్ల మూడేళ్ల నుంచే ప్రదర్శనలు ఇస్తోంది. భామా కలపం నృత్య నాటకాన్ని ఇటీవలే ఏకధాటిగా గంటన్నర పాటు ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకొంది. అలాగే సమతా కుంభ్ రెండో వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇవ్వడంతో పాటు, వెయ్యి మంది చిన్నారులు ప్రదర్శించిన "సహస్ర గోదా వైభవం" పాటకు నృత్య రీతులను సమకూర్చినందుకు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్లోబల్ స్టార్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులు అందాయి. ఆమె నృత్య ప్రతిభకు ముగ్ధులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, తన ఆశ్రమానికి డ్యాన్స్ అండ్ కల్చరల్ అంబాసిడర్‌గా నియమించారు. ఆశ్రమంలో ఎలాంటి కార్యక్రమం జరిగినా అక్షర నృత్య ప్రదర్శనను తప్పనిసరి చేశారు. దీంతోపాటు మలేషియాలో గత ఏడాది జరిగిన బాటు కేవ్స్ ఫెస్టివల్‌లోనూ భారత దేశం తరపున నృత్య ప్రదర్శన ఇచ్చింది కూచిపూడి నృత్యంతోనే కాకుండా నటనతోనూ మెప్పిస్తూ ఆల్‌రౌండర్ అనిపించుకొంటోంది అక్షర. తెలుగు చిత్ర పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ ఇప్పటికే దాదాపు 12 సినిమాల్లో నటించింది. ఆమె కీలక పాత్రలు పోషించిన ప్రభాస్ రాజాసాబ్, హీరో నితిన్ తమ్ముడు, దుల్కర్ సల్మాన్ ఆకాశంలో ఒక తార, డైరెక్టర్ కేకే తీసిన కేజేక్యూ, శోభిత దూళిపాళ్ల చీకట్లో సినిమాలు కాబోతున్నాయి. పుమా, అపర్ణ, మాంచెస్టర్స్ గ్లోబల్, దాదూస్, క్యారెట్ జ్యూయలరీస్ ప్రకటనల్లోనూ నటించింది. అటు నటన, ఇటు నృత్య ప్రదర్శనలతో బిజీగా ఉన్నా చదువులోనూ టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతోంది. అన్నింటా ఆల్‌రౌండర్‌గా దూసుకెళ్తున్న అక్షర దేవళ్లకు ఆల్ ది బెస్ట్.

# విద్యను సమాజ సేవకు జతచేస్తే..



ఇండోనేషియాలోని కొన్ని గ్రామాల ప్రజలకి కలుషిత నీరే శరణ్యం. దాంతో చిన్నా పెద్దా తేడా లేకుండా రోగాల బారిన పడటం చూసి చలించి మిస్ ఇండోనేషియా మోనికా కేజియా సెమింగ్. ఆ పరిస్థితులను మార్చాలనుకుంది. అదే తనని 'బ్యూటీ విత్ ఎ పర్పస్' టైటిల్‌ను గెలుచుకునేలా చేసింది. విద్యను సమాజ సేవకు జతచేస్తే... అది మరింత ప్రభావవంతమైన సాధనం అవుతుంది... అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని నమ్మే అమ్మాయి మోనిక. ఇండోనేషియా లోని సుమత్రా నగరంలో పుట్టిపెరిగింది ఈమె. కెమికల్ ఇంజినీరింగ్ చేసింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తోంది. చిన్నప్పట్నుంచీ సంగీతం, బొమ్మలు గీయడం, సామాజిక సేవ అంటే ఇష్టం. పాఠశాల రోజుల నుంచే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. అందులో భాగంగానే 2022లో కాంపంగ్ సిక్ అందుబాటులోకి వెళ్లింది. నీళ్ళ, గాలి కలుషితం అవుతున్నాయి. మానవ మనుగడకు ముప్పుగా మారుతున్నాయి... లాంటి అంశాల్ని పుస్తకాల్లో చాలానే చదివాను. కానీ ప్రత్యక్షంగా చూసింది మాత్రం కాంపుంగ్ లోనే. చుట్టూ నదులూ, చెరువులతో అపార జలసంపద ఉన్న ప్రాంతం ఇది. కానీ, తాగడానికి గుక్కెడు మంచినీళ్ల లేవు. అక్కడి నదులూ, చెరువులన్నీ వ్యర్థాలతో కలుషితమయ్యాయి. దీనికి తోడు ఆ నీటినే నిత్యకృత్యాలు తీర్చుకోవడానికీ తాగడానికీ ఉపయోగిస్తున్నారు. అక్కడివాళ్లు పర్యవసానంగా అనారోగ్యాల బారిన పడుతున్నారు. చర్మ సంబంధిత సమస్యలు, కడుపు నొప్పి లాంటి కారణాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితులను మార్చాలనుకున్నా అనే మోనిక 2023లో 'పైప్‌లైన్ ఫర్ లైఫ్‌లైన్' అనే ప్రాజెక్టును ప్రారంభించింది. సిసెక్ మూడు ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నది నుంచి మంచినీళ్లు తెచ్చే ప్రయత్నం చేసింది. అందుకు ప్రత్యేక పైప్‌లైన్ వేసి, గ్రామంలో నిర్మించిన మంచినీటి ట్యాంకుకు పంపింది. అక్కణ్నుంచి ప్రజలు స్వచ్ఛమైన నీటిని పట్టుకుంటున్నారు.

**ఒక్క గ్రామంతో ఆగిపోకూడదని..**

ఇండోనేషియాలో క్యాంపుంగ్ లాంటి ప్రాంతాలు చాలానే ఉన్నాయి. మంచినీరు అందించాలంటే తన గళం దేశవ్యాప్తంగా వినిపించనుంది.



అందాల పోటీని అందుకు మార్గంగా ఎంపికచేసుకుంది. పోటీల్లో పాల్గొని 2024లో మిస్ ఇండోనేషియా కిరీటాన్ని దక్కించుకుంది. మిస్ వరల్డ్72కి అర్హత సాధించి, ప్రపంచ వేదికపై తన లక్ష్యాన్ని చెప్పి, న్యాయనిర్ణేతలను మెప్పించింది. బ్యూటీ విత్ ఎ పర్పస్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తెలివి ఉన్నా నలుగురికి ఉపయోగపడనప్పుడు దానికి విలువ లేనట్లే. సామాజిక స్పృహ లేకుంటే అందానికి అర్థం లేదని చెప్పే మోనిక సేవా కార్యక్రమాలు ఇకపైనా కొనసాగించాలని కోరుకుంటూ....

ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా మరి!

# జీవ గడియారం ఎక్కువ



ఏ ఇంట్లోనైనా మహిళలే త్వరగా లేచి పనులు చక్కబెడుతుంటారు. ఎందుకంటే, స్త్రీలు మగవారి కంటే తొందరగా నిద్ర నుంచి మేల్కొంటారట. వాళ్ల జీవ గడియారం ఎక్కువగా తూర్పు టైమ్ జోన్ ప్రకారం ఉంటుంది. అందుకే వాళ్లు త్వరగా నిద్ర లేచి, త్వరగా నిద్రపోతారట. పైగా ఆడవాళ్లకు మగవారి కంటే 20 నిమిషాల ఎక్కువ నిద్ర అవసరమవుతుందట.

వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. లేదా నిమ్మరసం పెరుగు శనగపిండి కలిపి శరీరానికి మర్దన చేసి స్నానం చేయండి.

# వీటితో అలర్జీనా?

**ఆడవాళ్లకు, నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా.. వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొన్ని చర్మతత్వాలకు సరిపడవు. ముఖ్యంగా ఆర్టిఫిషి ఆడవాళ్లకు నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది.** అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొంతమంది చర్మతత్వాలకు సరిపడవు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ నగల విషయంలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంటుంది. ఫలితంగా చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట.. వంటి సమస్యలొస్తాయి. మరి, వీటి మంచి విముక్తి పొందడమెలాగో తెలుసుకుందాం..

◆ ఆర్టిఫిషియల్ నగల తయారీలో నికెల్ లోహాన్ని



వాడుతుంటారు. చాలామందిలో అలర్జీ రావడానికి ఇదే ముఖ్య కారణమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సున్నితమైన చర్మతత్వం ఉన్న వారిలో దీని కారణంగా దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాంటి వారికే ఈ విబలు మేలు వస్తుంది.

◆ నగల అలర్జీ ఉన్న వారు వాటిని ధరించే ముందు మాయిశ్చరైజర్, పౌడర్, క్యాలమైన్ లోషన్స్, వంటివి రాసుకోవాలి. ఇవి చర్మానికి కవచంలా పనిచేసి ఆయా లోహాల ప్రభావం చర్మంపై పడకుండా చేస్తుంది.

◆ అవుటిఫిట్ ఏదైనా.. కొంతమంది మెడ దగ్గరగా ఉండే చోకర్.. వంటి బిగుతుగా ఉంటే జ్యుయలరీని ఎంచుకుంటారు. దీనివల్ల గాలి ఆడక కూడా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చాలా వరకు వదులుగా ఉండే నెక్‌పీస్‌లు, లాంగ్ చెయిన్స్,. ఎంపిక ఎంచుకోవాలి.

◆ ధరించే ముందు ట్రాన్స్‌పరెంట్ నెయిల్ పాలిష్‌ను నగలపై ఓ కోటింగ్ వేసి.. ఆపై వేసుకోవడం మంచిది. ఇది నగల్లోని లోహాల ప్రభావం చర్మంపై పడకుండా కాపాడుతుంది.

◆ ఆర్టిఫిషియల్ నగలే కదా అని వీటి విషయంలో చాలామంది శ్రద్ధ తీసుకోరు. తడిసినా, చెమట పట్టినా.. అలాగే వాటిని బాక్సుల్లో భద్రపరుస్తుంటారు. ఆ తడిదనం వల్ల నగల నాణ్యత, దెబ్బతిం టుంది. ఇది కూడా చర్మ అలర్జీలకు కారణమవుతుంది. కాబట్టి నగల్ని భద్రపరిచే ముందు పూర్తిగా ఆరనివ్వడం మేలు. అలాగే తేమ అధికంగా ఉండే ప్రదేశాల్లో వీటిని భద్రపరచ కూడదు.

చెలి చిట్కా

# నమ్మాలంటే.. నవ్వాలి !

ఒక చిన్న నవ్వు.. చుట్టూ ఉన్న వాతావరణాన్నే మార్చేస్తుంది కదా! ఇది మానసిక ప్రయోజనాలనే కాదు, సామాజిక బంధాలు బలపడటంలోనూ కీలకపాత్ర పోషిస్తుందట. ఇతరులకు మనపై నమ్మకం ఏర్పడేలా చేసేదీ ఓ చిన్న స్మైలేనని జర్నల్ సైకలాజికల్ సైన్స్ పరిశోధనలు చెబుతున్నాయి. ఎదుటివారిని చూసి చిన్న నవ్వు నవ్వినప్పుడు.. నేను స్నేహపూర్వకంగా ఉంటాను. నాతో ప్రమాదం లేదు. నాతో ఎప్పుడైనా



మాట్లాడొచ్చు లాంటి పాజిటివ్ సంకేతాలు వాళ్లకు వెళతాయట. ఈ ఫీలింగ్ తెలియని వారికే కాదు, బాగా తెలిసిన వారికీ మనపై మరింత ప్రేమ, నమ్మకం ఏర్పడానికీ ఇది దోహదపడుతుందట. దీనికోసం పరిశోధకులు ఓ ప్రయోగం చేశారు. అందులోని వ్యక్తులను రెండు గ్రూపులుగా విభజించి తెలియని వ్యక్తితో ఇంటర్వ్యూ చేయించారు. దాన్ని వీడియో రికార్డు చేశారు. అందులో ఓ గ్రూపు వాళ్లకు నవ్వుతూ మాట్లాడమనీ, మరో గ్రూపు వాళ్లకు ఎలాంటి భావోద్వేగాలూ లేకుండా ఉండమనీ చెప్పారు. నవ్వుని వారితో పోలిస్తే నవ్వుతూ మాట్లాడిన వారు ఎక్కువ నమ్మదగిన వారిగా ఉన్నట్లు గుర్తించారట. కాబట్టి, ఇతరుల నమ్మకాన్ని చూరగొనాలంటే పెదవులపై చిరునవ్వు మాత్రం చెరగనీయొద్దు.

# చర్మ సమస్యలకు చెక్ !

మహిళలు ముఖ సౌందర్యాన్ని తగ్గించే సమస్యల్లో ముడతలు, పిగ్మెంటేషన్ ప్రధానమైనవి. ముడతలతో వయసు పైబడిన వారిలా కనిపిస్తే.. పిగ్మెంటేషన్ మచ్చలతో ముఖమంతా అంద విహీనంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బాదం పప్పును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఈ సమస్యలను అధిగమించవచ్చని చెబుతున్నారు నిపుణులు.



.క్యాలరీలు తక్కువగా ఉండే బాదం పప్పును చాలామంది బరువు తగ్గించుకోవడానికి స్నాక్స్‌గా వినియోగిస్తారు. ఇందులోని విటమిన్-'ఇ'తో పాటు మోనో అన్‌శ్యాచు రేటెడ్ కొవ్వుల కారణంగా వీటిని నిత్య తీసుకునే మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువని అధ్యయనాల్లో తేలింది. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న బాదం పప్పుతో మహిళల్లో ముఖం పైన ముడతలు, పిగ్మెంటేషన్ మచ్చలు కూడా మాయమవుతాయని చెబుతున్నారు నిపుణులు.

**ఈ.. అదే కారణం...** బాదంలో విటమిన్6ఇ, అన్‌శ్యాచు రేటెడ్ కొవ్వులతో పాటు పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి మెనోపాజ్ దశలో మహిళల ముఖంపైన ఏర్పడే ముడతలు, పిగ్మెంటేషన్ సమస్యల తీవ్రతను తగ్గించేస్తాయి అంటున్నారు చర్మసౌందర్య నిపుణులు.

**అందుకే ఇవి డైట్‌లో ఉండాల్సిందే !** ప్రతిరోజూ బాదం పప్పులు తినడం వల్ల మహిళల ముఖంపై ముడతలు తగ్గడమే కాకుండా చర్మంపు రంగులో కూడా మార్పులొస్తాయి. బాదం పప్పుల్లో విటమిన్'ఇ' అధికంగా ఉంటుంది. వీటితో పాటు అత్యవసర ఫ్యాటీ ఆమ్లాలు, పాలీఫినాల్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. మహిలలు తమ



చర్మం ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు ఈ పోషకాలు ఎంతగానో సహకరిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని మహిళలు, ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు తమ రోజువారీ డైట్‌లో బాదం పప్పులను చేర్చుకోవడం ఎంతో ముఖ్యం అని వారు సూచిస్తున్నారు.

# ఆరోగ్యానికి పండ్ల పిండ్లు

**నెలవారీ పచారీ సరకులు రాసేటప్పుడు సాధారణంగా మన జాబితాలో బియ్యప్పిండి, గోధుమపిండి, సెనగపిండి.. ఇవి ఉంటాయి కదా!**

ఇక నుంచి వీటితోపాటు.. అనాసపిండి, స్ట్రాబెర్రీపిండి, పనసపిండి వంటి పండ్ల పిండ్లు కూడా తోడుకావొచ్చు. పండ్లతో పిండి ఏంటా అని ఆలోచిస్తున్నారా? ఇది నిజమే. బేకింగ్ చేయాలన్నా, కొన్ని రకాల పిండి వంటలు చేయాలన్నా.. మనకి మైదా ఠక్కున గుర్తొస్తుంది. కానీ ఈ మైదాలో పీచు ఉండదు. పైగా కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. దాంతో ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని తేలిపోయింది. దాని



మోతాదుని తగ్గించుకొనేందుకు, ప్రత్యామ్నాయంగా మార్కెట్లో మనకి పండ్లతో తయారుచేసిన పనసపిండి, అరటిపిండి వంటి పండ్ల, పొడులు దొరుకుతున్నాయి. వీటిని గోధుమపిండివంటి వాటితో కలిపి వాడటం వల్ల అదనపు పోషకాలూ అందుతాయి.

రుచీ పెరుగుతుంది.



**పనసపిండి: ..** దీనిని చపాతీ పిండిలోకి, కూరల్లోకి, సూపుల్లోకి వేసుకోవచ్చు. పీచుతో పాటు ప్రొటీన్‌ని సమృద్ధిగా అందిస్తుంది రుచి కూడా పెరుగుతుంది.

**నేరేడు పిండి :** సీజన్‌లో తప్ప మళ్లీ కనిపించని ఈ పండు పిండి రూపంలో రావడం మన అదృష్టమే. ఆంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పింని స్మూథీల్లో వాడుకోవచ్చు. దీనికుండే చక్కని రంగు కావాలనుకుంటే స్వీట్లలో కూడా వాడుకోవచ్చు.



**ఖర్జూరం :** వంటల్లో పంచదార వాడకుండా ప్రత్యామ్నాయంగా ఈ పిండిని వాడుకోవచ్చు. స్వీట్ల తయారీలో, బేకింగ్‌లో వడతారు.

**అనాసపిండి :** కేకులు, పుడ్డింగులు, మిఠాయిల తయారీలో ఈ పిండిని వాడుకోవచ్చు. అద్భుతమైన రుచి.. మనసు దోచే పరిమళం రెండూ వంటకాలకి తోడవుతాయి.



**దానిమ్మ:** కూరలకి పుల్లటి రుచి కావాలనుకున్నప్పుడు, చాట్‌మసాలాకి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. బేకింగ్, సూపులకు మంచి రుచి ఇవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఆరెంజ్, స్టాబెర్రీ మామిడి** పొడులను కూడా బేకింగ్‌లో రుచి కోసం వాడుతుంటారు.





# భావనా ప్రభావం

మనసులో జనించే ఆలోచనను 'భావన' అంటాము. మనుషుల మనసులలో అనేక భావనలు నిరంతరం చెలరేగుతూనే ఉంటాయి. వాటిలో కొన్ని మంచి భావనలైతే, మరికొన్ని చెడు భావనలు ; కొన్ని సత్యమైనవి, మరికొన్ని ఊహా జనితమైనవి ; కొన్ని సాధింపగలిగేవి, మరికొన్ని అసాధ్యమైనవి ; కొన్ని మనలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించేవి, మరికొన్ని ఆత్మ న్యూనతకు దారి తీసేవి ... ఇలా రకరకాల భావనలు పరిభ్రమించే సుడిగుండం మనిషి మనస్సు అని చెప్పవచ్చు. ఆ మనస్సే బంధ మోక్షాలకు కారణమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. యోగవాశిష్ఠం కూడా "యత్ చిత్తం తన్మయో భవతి పూరు షః " అన్నది. మనసెలా భావించి నిర్దేశిస్తే అలాగే మనిషి ప్రవర్తిస్తాడు. ఆవిధం గానే తనను తాను రూపు దిద్దుకొంటాడు. మనము మన మనసు ఏ భావనలతో నిండి ఉంటుందో తెలుసుకోవడం ముఖ్యం. అది భయంతోనా, అసూయతోనా, కోపంతోనా, ధైర్యంతోనా, ఆకర్షణలతోనా, వైరాగ్యంతోనా, ప్రేమ లేక ద్వేషంతోనా అని తెలుసుకొన్నాక మనలను మనం సరిదిద్దుకోవడం సులభతరమవుతుంది. కరుశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రీగారు ఇలా చెప్పారు.

"ప్రార్థనముల పుణ్య తీర్థంబులందున/ గురులయందు, వైద్య వరులయందు, భావమెట్టి దట్టి ఫలతంబు ప్రాప్తించు/ లలత గుణజాల తెలుగుబాట! ప్రార్థనలు చేసినా, పుణ్య పదులలో స్నానాలు చేసినా గురువుల బోధనలు గ్రహిస్తున్నా, వైద్యుల చికిత్సలను పొందుతున్నా. ఆయా అంశాలలో మనకు నమ్మకం. విశ్వాసం ఉంటేనే అవి మనకు అనుకూలమైన ఫలితాలనిస్తాయి లేకుంటే అవి మనకు ఉపయోగపడవు. సానుకుల దృక్పథం ఉంటేనే కార్యసిద్ధి కలుగుతుంది. యద్భావం తద్భవతి అనే పెద్దల మాట కానీ 'యామతి స్సా గతిర్భవేత్' (మతి ఎలా ఉంటే గతి అలా అవుతుంది) అనే అష్టావక్రగీతా వాక్యం కానీ ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి.

ఆధ్యాత్మికం



కారులో దూర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కొంతసేపు సరదాగా గడిపినా.. ఆ తర్వాత అలసిపోయి పిల్లలు నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటారు. కనుకు వేసేలోపే మెడనొప్పి అంటూ పెద్దవాళ్ల బడి వెతుక్కుంటారు. ఇలా ఎంతో దూరం ప్రయాణించలేరు. సరదాగా సాగాల్సిన టూర్ అనారోగ్యాలతో పూర్తవుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఈ దిండ్లు ఉండాల్సిందే. సీట్‌బెల్ట్‌లా.. కారు సీటు బెల్ట్‌కు ఈ దిండును



# చిన్నారులకు సపోర్ట్‌గా..

తొడిగే వీలుంటుంది. లేదా స్ట్రాప్‌తో అటాచ్ చేయచ్చు. పిల్లలు కూర్చున్న వెంటనే దిండు తొడిగిన బెల్ట్ వేస్తే చాలు. కదలకుండా ఉంచడమే కాదు. మెత్తగానూ అనిపించే ఈ దిండు తల్లి వద్ద ఉన్న అనుభూతిని అందిస్తుంది. ఎటువంటి అసౌకర్యం లేకుండా చిన్నారులు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. వీటిలో కొన్ని చిన్నారులకు భుజం నుంచి పొట్ట చుట్టూతా వచ్చేలా పొడవుగా ఉండే రకాలున్నాయి. రకరకాల జంతువుల బొమ్మల ఆకారాల్లోనూ, ఆకర్షణీయమైన రంగుల్లోనూ ఇవి లభ్యమవుతున్నాయి. అలాగే మరికొన్ని మెడ వరకు మాత్రమే వచ్చేలా అర్ధచంద్రాకారంలో తలకు మాత్రం సపోర్ట్ ఇస్తాయి.


# 'లక్ష్మీ నరసింహా' రీరిలీజ్ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ లక్ష్మీ నరసింహా మరోసారి థియేటర్స్‌లో అలరించడానికి సిద్ధమైయింది. జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత బెల్లం కొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైన ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో జూన్ 8న థియేటర్స్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ వెర్షన్‌లో కొత్త పాట యాడ్ చేశారు. మందేసినోడు అంటూ సాగే పాటని భీమ్స్ సిసిరోలియో అన్‌స్టాపబుల్ వైబ్‌తో కంపోజ్ చేశారు. స్వరాగ్ కీర్తన్ హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్‌కి ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ మాస్‌ని కట్టిపడేసే లిరిక్స్ అందించారు. రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో ఈ సాంగ్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బెల్లం కొండ సురేష్ మాట్లాడుతూ, అందరికీనమస్కారం. ఈ సినిమా రీరిలీజ్‌ని లైఫ్‌లో మర్చిపోలేను. 21 ఏళ్ల తర్వాత లక్ష్మీ నరసింహా సినిమాని రీరిలీజ్ చేస్తున్నానంటే నందమూరి అభిమానులకు ఏదో ఒక స్పెషల్, సర్ప్రైజ్ ఇవ్వాలి. ఎలాంటి సర్ ప్రైజ్ అని ఆలోచన వచ్చినప్పుడు.. ఈ సినిమా కోసం రెండు సాంగ్స్ చేశాం. ఒక సాంగ్‌ని షూట్ చేసాంగాని సినిమాలో లేదు. ఆ సాంగ్‌ని ఎలాగైనా రీరిలీజ్‌లో యాడ్ చేయాలి అని ఆలోచన వచ్చింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో నెగిటివ్ దొరికింది. కానీ సౌండ్ దొరకలేదు సౌండ్ లేదు. ఓన్లీ పిక్చర్ ఉంది. పిక్చర్ ప్రింట్ చేసి ఫస్ట్ చంద్రబోస్‌కి, తర్వాత డైరెక్టర్‌కి, భీమ్స్‌కి పంపించాను. వాయిస్, లిరిక్ రాసి రికార్డు చేయాలని చెప్పాను. బోస్ ఇది ఎలా పాజిబుల్ అన్నారు. చేస్తేనే పాజిబుల్ అవుతుందని చెప్పాను. ఒకసారి ప్రయత్నించమని చెప్పాను. అయితే ఈ ప్రయత్నాన్ని అద్భుతంగా చేశారు. ఈ పాటని డిస్ట్రిబ్యూటర్స్‌కి వినిపిస్తే పాట అద్భుతంగా ఉంది. కొత్త సినిమాల్లో పెట్టండి బ్లాక్ బస్టర్ అవుతుంది అని చెప్పారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ జయంత్ సి.పరాన్జీ మాట్లాడుతూ, అందరికినమస్కారం. సురేష్‌కి థాంక్యూ. ఇలాంటి కొత్త ఐడియాలన్నీ సురేష్‌కి వస్తాయి. ఆడియో లేని ఈ సాంగ్‌కి ఏదైనా చేద్దామని ఆయన అన్నప్పుడు నేను ఇంపాజిబుల్ అని చెప్పాను. ఆయన, చంద్రబోస్, భీమ్స్ కలిసి ఈ అద్భుతం చేశారు. ఒక ఇంపాజిబుల్ టాస్‌ని పాజిబుల్ చేసి చూపించారు. ఇళయరాజా ఇలాంటి ఒక ప్రయోగం చేశారని ఎప్పుడో విన్నాను. అయితే అది ఒక మాంటేజ్ సాంగ్.



ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమోళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10,

## 'రానా నాయుడు సీజన్ 2': నాగనాయుడు పాత్ర సూపర్బ్



2012 న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్‌గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## 13న 'అందాల రాక్షసి' రీరిలీజ్

ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్‌చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమోళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10, 2012న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్ గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 'చౌకీదార్' నుంచి సాంగ్

డైలాగ్ కింగ్ సాయి కుమార్ ప్రస్తుతం ఏ చిత్రంలో నటిస్తే ఆ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఆయన నటించిన సినిమాలన్నీ కూడా బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఇక ఆయన నటించిన కమిటీ కుర్రోళ్లు, లక్కీ భాస్కర్, సరిపోదా శనివారం, మెర్సీ కిల్లింగ్ వంటి చిత్రాలకు గద్దర్ అవార్డులు కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి సాయి కుమార్ ప్రస్తుతం తెలుగు, కన్నడ భాషల్లో చౌకీదార్ అనే సినిమాను చేస్తున్నారు.

ఈ చిత్రంలో పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. చౌకీదార్ మూవీని వీఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద డా.కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ బండియప్ప తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈచిత్రానికి సంబంధించిన ఓ ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నాన్న గొప్పదనం చాటి చెప్పేలా గుండెను పిండేసేలా ఓ చక్కటి బాణీని అందిం చారు. నాన్నా అంటూ సాగే ఈ పాటను సంతోష్ వెంకీ రచించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. సచిన్‌బస్రూర్ అందించిన బాణీ అయితే ప్రతీ ఒక్కరినీ కదిలించేలా ఉంది. తండ్రి త్యాగాల్ని, మోసే బాధ్యతల్ని, చూపించే ప్రేమను చాటేలా పాటను రచించారు. ఇక లిరికల్ వీడియో చూస్తుంటే సాయి కుమార్ తండ్రిగా మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నారు. పృథ్వీ అంబర్, సాయి కుమార్ మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ ఉండేట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.





శ్రీనిధి శెట్టి నయా లుక్

అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కట్టప్ప జడ్జిమెంట్. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని

## 13న 'కట్టప్ప జడ్జిమెంట్' విడుదల

అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధు సూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధీరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హరీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.



## 90స్‌లో నగ్మా యూత్ కలల రాకుమారి

90స్‌లో యూత్ కలల రాకుమారి. 1994లో విడుదలైన తమిళ చిత్రం కాదలన్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో కట్టిపడేసింది. తెలుగు, తమిలం, మలయాళం, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇంతకీ హీరోయిన్ నగ్మా గుర్తుందా..?



ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 1994లో విడుదలైన కాదలన్ అనే తమిళ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించింది. సూపర్ స్టా రజినీకాంత్ జోడిగా బాషా చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించింది. సినీరంగంలో నగ్మా చెల్లెల్లు సైతం హీరోయిన్లుగా రాణించారు. నగ్మా చెల్లెల్లు మరెవరో కాదు.. జ్యోతిక, రోషిణి. దశాబ్దాలపాటు సినీరంగంలో వరుస సినిమాలతో అలరించిన నగ్మా.. 2008 నుంచి సినిమాలకు దూరంగా ఉండిపోయారు. చాలా కాలం తర్వాత నగ్మా ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఇటీవలే సూర్య, జ్యోతిక దంపతుల కుమార్తె దియా ఇంటర్ పూర్తి చేసింది. తాజాగా ఆమె గ్రాడ్యుయేషన్ వేడుకలకు సంబంధించిన ఫోటోస్ షేర్ చేస్తూ తల్లిదండ్రులుగా తాము గర్వపడుతున్నామంటూ రాసుకొచ్చింది జ్యోతిక. అయితే ఈ కార్యక్రమంలో నటి నగ్మా కూడా పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది నగ్మా. అందులో ఆమె గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

## ఎస్ఎల్‌వి సినిమాస్ గ్రాండ్ లాంచ్

ఎలక్ట్రిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎఫర్ట్‌లెస్ యాక్టింగ్, అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో అలరించే మాస్ మహారాజా రవితేజ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి ఆర్‌టి76 ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. క్యాలిటీ, హై ఎంటర్ టైన్మెంట్ వాల్యూస్‌తో సినిమాలని అందించడంలో పాపులరైన ప్రతిష్టాత్మక ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం ఈరోజు ముహూర్తపు వేడుకతో ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ వెరీ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్ సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్ క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అతను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది. అతను పట్టుకున్న పుస్తకంలో సీ ఇట్ అండ్ సే ఇట్ స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ధమాకా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ల డీవోపీగా పని చేస్తున్నారు. అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఆర్‌టి76 రెగ్యులర్ షూటింగ్ జూన్ 16 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ఈ చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో రిలీజ్ కానుంది.

తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్:ఎస్ఎల్‌వి సినిమాస్ డీవోపీ: ప్రసాద్ మూరెళ్ల సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్ ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.



## మైసూర్ శాండల్‌కు ప్రచారకర్తగా తమన్నా భాటియా

బుద్ధి చిన్నది అయితే అన్నీ వివాదాలుగానే ఉంటాయి. కర్ణాటకలో జరుగుతున్న మైసూర్ శాండల్ సబ్బు ప్రచారకర్త నియామకం విషయంలో అదే జరుగుతోంది. మైసూర్ శాండల్ సబ్బును తయారు చేసే కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జంట్స్ కంపెనీ తమ ఉత్పత్తుల ప్రచార కర్తగా తమన్నా భాటియాను నియమించుకుంది. రెండేళ్లకు ఆరు కోట్ల రూపాయుల చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే మన సబ్బుకుతమన్నా ఎందుకని కన్నడ నటీమణులు లేరా అని అక్కడి కన్నడ ఉద్యమ సంఘాలు తమ పని ప్రారంభించాయి. మైసూర్ సబ్బును మైసూర్‌లోనో.. కర్ణాటకలోనే అమ్మడం లేదని.. దేశవ్యాప్తంగా అమ్ముతున్నామని.. దేశవ్యాప్త మార్కెట్ కోసం అందర్నీ పరిశీలించిన తర్వాతనే తమన్నాను ఎంపిక చేసుకున్నామని ఆ సంస్థ చెబుతోంది. దీపికా పదుకొనే, రష్మికను కూడా పరిశీలించామని.. కానీ అన్ని అంశాలను చూసిన తరవాత తమన్నానే ఎంపిక చేసుకున్నామన్నారు. తమన్నాకు నేషనల్ వైడ్ పాపులారిటీ ఉంది. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోయర్లున్నారు. కేఎస్డీఎల్ అనేది ప్రభుత్వ సంస్థ. అందుకే ఇది మరింత వివాదాస్పదం చేస్తున్నారు. మరో మూడేళ్లలో మైసూర్ శాండల్ సోప్ మార్కెట్‌ను ఐదు వేల కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అది నార్త్‌లో మార్కెట్ పెంచు కుంటేనే సాధ్యమవుతుందని అనుకుంటున్నారు. కానీ అక్కడ కన్నడ సంఘాలు మాత్రం.. మా సబ్బు.. మా నటి అని వితండవాదం చేస్తున్నారు.



## నభా నటేష్ ఎమోషనల్ పోస్ట్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫోటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేసింది హీరోయిన్ నభా నటేష్. ఆమె ఇన్‌స్టా గ్రామ్ ద్వారా చేసిన ఈ పోస్ట్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్ట్‌తో నేచర్ గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో నభా స్పందిస్తూ ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను...ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతి ని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్‌కి రుణ పడి ఉంటాను. అని పేర్కొంది. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ మూవీస్‌లో నటిస్తోంది నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో ప్రెస్టీజియస్ మూవీ నాగబంధంలో నటిస్తోంది.



# పర్యావరణాన్ని రక్షిద్దాం.. భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుదాం




## అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణాన్ని పరి రక్షించుకుని, భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిపై ఉందని అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం పిసిబి కార్యాలయంలో జరిగిన ఎన్విరాన్‌మెంట్ డే ఉత్సవాల్లో మంత్రి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యావత్ ప్రపంచానికే సవాలుగా మారిన ప్లాస్టిక్ మహమ్మారి ని ర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సంయుక్త కృషి చేయాల న్నారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్‌రహిత కాలుష్యాన్ని ప్రపంచవ్యాప్తంగా అంతం చేయడం, అనే థీమ్‌తో ఈ పర్యావరణ దినోత్సవాన్ని జరుపు కుంటున్నా మన్నారు. మన రాష్ట్రం, దేశమే కాకుండా యావత్ ప్రపంచమంతా ప్లాస్టిక్ సమస్యను పెద్దఎత్తున ఎదుర్కొంటున్న దన్నారు. దీనిలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలన వైపు మనమంతా దృష్టి సారించాలన్నారు. 1960, 1970ల నుంచి సముద్రాల్లో ప్లాస్టిక్ పెద్దఎత్తున పేరుకు పోతున్నట్లు శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. భారతదేశం ప్రతి యేటా 12.65 కోట్ల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోందని, నిపుణులు చెబుతున్నారన్నారు. ప్రతినిమిషం ప్రపంచవ్యాప్తంగా 20 లక్షల సింగిల్‌యూస్ ప్లాస్టిక్ సంచులు పంపిణీ అవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ బాటిళ్లు కొనుగోలు అవుతున్నాయని, 2026 నాటికి ఈ సంఖ్య 50 కోట్లకు పైగా ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారన్నారు. ఇదే ధోరణి కొనసాగితే, 2050 నాటికి ఈ సంఖ్య 1200 కోట్ల టన్నులకు చేరవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నదని గుర్తు చేశారు. గత ఏడాది 20.2 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంటే 19.04 కోట్ల మొక్కలను నాటామని, అంటే 95శాతం టార్గెట్ రీచ్ అవడం చాలా గొప్ప విషయమన్నారు. ఇందుకు ఫారెస్టు డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు, సిబ్బందిని తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు చెప్పారు. ఈ సంవత్సరం కూడా వనమహోత్సవాన్ని భారీస్థాయిలో చేపట్టాలని నిర్ణయిం చామని తెలిపారు. పర్యావరణ మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకోటూరిజం, పార్కుల్లో కీలక మార్పులు చేపడుతున్నమన్నారు. .పాలసీ రూపకర్తలుగా, నిర్వా హకులుగా, పౌరులుగా మనం ప్లాస్టిక్ నిర్మూలించేందుకు పని చేయాలన్నారు. సింగిల్ యూస్‌ప్లాస్టిక్‌లను తొలగించి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్స హించాలన్నారు. బాధ్యతాయుతమైన రీసైక్లింగ్, పునర్వి నియోగం కోసం మౌలిక సదుపాయాలను నిర్మించాలని అన్నారు. అందుకోసం తమ ప్రజా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉందన్నారు. వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా రోజు కొన్ని మంచి నిర్ణయాలతో ప్లాస్టిక్ నివారణలో ముందంజ లో ఉంటామన్నారు. 2018లో భారతదేశం 2022 నాటికి సింగిల్‌యూస్ ప్లాస్టిక్‌లను తొలగించాలని ప్రతిజ్ఞ చేసిందన్నారు.వెల్లడించారు. ఈ చర్యే దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ సంచులు, కట్లరీలపై నిషేధానికి ప్రేరణగా నిలిచిందన్నారు. తెలంగాణ ఈ నిర్ణయం, విధానాన్ని మరింత ఉత్సాహంతో కొనసాగి స్తోందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు2025లో జెనీవాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి యావత్ ప్రపంచమంతా కీలక చర్చలు జరపనున్న దన్నారు. 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్యం ఇస్తున్న రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ప్లాస్టికును మరింత వేగంగా నిలువరించేందుకు వ్యూహాలు రచించనున్నదన్నారు. తెలంగాణ ప్రతి పౌరుడినీ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలనీ, రీసైక్లింగ్‌కు సహకరించా లని ఆ శాఖ మంత్రిగా కోరుతున్నా అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి చేసే ఈ అవగాహన కార్యక్రమంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడాన్ని ప్రారంభిస్తున్నం దుకు తనకు గర్వంగా ఉందన్నారు. మన రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ క్రుషి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అనివార్యత ఉందన్నారు. ఈ సందర్భంగా, ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు, సామాజిక సంస్థలు అందరూ కలిసి ఆదర్శవంతంగా పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి గూగులోత్, పిసిబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణ రెడ్డి, విజయలక్ష్మీ జయదేవ్, పిసిబి ఉద్యోగులు,సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీడ్ బాల్స్ పంపిణీ చేస్తున్న జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా

## రెండు లక్షల సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తాం

### జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పచ్చదనం పెంపొం దించడానికి జైళ్ల శాఖ తరపున తమవంతు కర్తవ్యంగా రాబోయే రోజుల్లో రెండు లక్షల సీడ్ బాల్స్‌ను పంపిణీ చేయనున్నట్లు జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పెట్రోలు బంకు వద్ద జరిగిన కార్యక్రమానికి డిజి సౌమ్య మిశ్ర ముఖ్య అతిథిగా హాజరై సీడ్ బాల్స్ పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా డిజి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జైళ్లలోని ఖైదీలతో రెండు లక్షల సీడ్ బాల్స్ తయారు చేయించి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 30 పెట్రోలు బంకులకు వచ్చే వాహనదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడుతామని డిజి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు వై.రాజేష్, ఎన్.మురళి బాబు, డిఐజిలు డాక్టర్ డి.శ్రీని వాస్, ఎం.సంపత్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్ గౌడ్, ఐఓసిఎల్ డివిజనల్ మేనేజర్ ముతువేల్, సేల్స్ మేనేజర్ మహేంద్ర మీన తదితరులు పాల్గొన్నారు.



ఆర్కైవ్స్‌కు తాళాలు వేసి సోదాలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

## స్టేట్ ఆర్కైవ్స్‌లో విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 5, ప్రభాతవార్త :** తార్నాక లోని తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ (తెలంగాణ రాష్ట్ర రాజ్యాభిలేక పరిశోధనాలయం)లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఆర్కైవ్స్ లో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశాలు జారి చేసిన నేపథ్యంలో విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టింది. మధ్యాహ్నాం చేరుకున్న అధికారులు గేట్లు మూసివేసి లోపలి నుంచి తాళాలు వేసి తనిఖీలు చేపట్టారు. రాకపోకలు నిలిపివేసి ఆధారాల కోసం అన్వేసిస్తున్నారు. పలు దస్తావేజులను వారు పరిశీలిస్తున్నారు.రాజ్యాభిలేఖ పరిశోధనా లయంలో కొన్నేళ్లుగా అరాచకాలకు ఆలవాలంగా మారిందని ఇక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందితో కొందరు భూకబ్జాదారులతో కుమ్మక్కయి విలువైన పత్రాలను దారి మళ్లిస్తున్నారనే ఆరోపనలు ఉన్నాయి. వాటి స్థానాంలో నఖిలీ పత్రాలు చేర్చి, అవే నిజమైనవంటూ రాజముద్ర వేసి మరీ ఇస్తున్నారని తెలిసింది. విలువైన భూములు కబ్జాదారుల పరమయ్యేందుకు న్యాయ వివాదాలకు కారణమవుతున్నాయని చెబుతు న్నారు. ఈ సోదాలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. అందులో పాత్రధా రులైన అవినీతి ఉద్యోగుల వివరాలు తెలియాల్సి ఉంది.

# మహిళా సంఘాలకు తపాలా శాఖ ద్వారా రుణాల చెల్లింపులు

### పలు సమస్యలకు పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇది శుభవార్త. ఇకపై వారు తమ ఆర్థిక లావా దేవీలను ముఖ్యంగా రుణాల తిరిగి చెల్లింపులను, సమీపంలోని తపాలా కార్యాలయాల ద్వారా నిర్వ హించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు తక్కువగా ఉండటం, ప్రయాణ భారం, ఆలస్య మయ్యే చెల్లింపులతో ఎదురయ్యే ఇబ్బందులను ఇది తగ్గిస్తుంది. రంగారెడ్డి జిల్లాలో విజయ వంతమైన పైలట్ ప్రాజెక్ట్‌ను జులై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. తెలంగాణ లోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు గుడ్‌న్యూస్. ఇక నుంచి ఆర్థికపరమైన సేవలు సులభతరం కానుంది. సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలను తపాలా శాఖ సేవలను ఉపయోగించుకొని నిర్వహించుకోవచ్చు. రుణాల తిరిగి చెల్లింపులు సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, వాటి ద్వారానే తిరిగి చెల్లిస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల సంఖ్య తక్కువగా ఉండటం సభ్యులకు పెద్ద సమస్యగా మారింది. చెల్లింపులు చేయడానికి బ్యాంకులున్న ప్రాంతాలకు వెళ్లడం, సుదూర ప్రయాణాలు చేయడం, అక్కడ ఎదురయ్యే రద్దీ, నిరీక్షణ వంటివి సభ్యులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అంతేకాకుండా ఈ జాప్యం వల్ల కొన్నిసార్లు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి, ఇది వడ్డీ భారాన్ని పెంచుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉన్న తపాలా కార్యాల యాల సేవలను వినియోగించుకోవాలని అధికా రులు భావించారు. ఇందుకోసం స్త్రీనిధి సమాఖ్య అధికారులు ఇటీవల తపాలా శాఖ అధికారులతో చర్చలు జరిపారు. మహిళా సంఘాల సభ్యుల చెల్లింపులను స్వీకరించేందుకు వారు అంగీక రించారు. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని 10 గ్రామాల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. స్త్రీనిధి యాప్ ద్వారా రుణాలను మహిళా సంఘాల సభ్యుల ఖాతాలతో అనుసంధానించి, చెల్లింపులను సులభతరం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయ వంతం కావడంతో, ఈ విధానం సౌలభ్యంగా ఉందని అక్కడి మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ విధానాన్ని జులై నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలని నిర్ణయించారు. ఈ సేవలను వినియోగించుకున్నందుకు తపాలా శాఖకు తెలం గాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఛార్జీలను చెల్లిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక లావాదేవీలు మరింత సులభతరం అవుతాయి. బ్యాంకులకు వెళ్లాల్సిన ప్రయాణ భారం చాలావరకు తగ్గు తుంది. సమయం కూడా ఆదా అవుతుంది.

## సంతోష్‌నగర్ కార్పొరేటర్ గుండెపోటుతో మృతి

**హైదరాబాద్(సైదాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ముజాఫర్ హుస్సేన్(48) గుండెపోటుతో మృతి చెందారు. జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరై కుర్మగూడలోని తన నివాసానికి చేరుకున్న ఆయన రాత్రి 9 గంటల ప్రాంతంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఒవైసి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ముజాఫర్ హుస్సేన్ మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. సంతోష్‌నగర్ డివిజన్ నుంచి రెండోసారి కార్పొరేటర్‌గా ఆయన ఎంఐఎం పార్టీ నుంచి గెలుపొందారు. ముజాఫర్ హుస్సేన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంఐఎం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కుర్మగూడలోని ఆయన నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.


ముజాఫర్ హుస్సేన్(ఫైల్)

## బిసి గురుకుల జూనియర్ కాలేజీల రెండోదశ ఫలితాలు విడుదల

### అర్హులైన వారు నేటి నుంచి 9 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకుల జూనియర్ కాలేజీలకు సంబంధించి రెండో దశ ఫలితాలను విడుదల చేశారు. బిసి గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ ఫలితాలను ప్రకటిం చినట్టు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. గత సంవత్సరాల వరకు ప్రవేశ పరీక్ష (ఎంట్రన్స్ టెస్ట్) ఆధారంగా సీట్లు కేటాయించబడగా.. ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా, 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతోందన్నారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని నేటి(జూన్ 6-శుక్రవారం) నుంచి ఈ నెల 9 వరకు సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు విద్యార్థులకు సూచించారు.

# బాలికల రక్షణకు స్నేహ కమిటీల ఏర్పాటు

### మేధోమథనం ముగింపు సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహా కమిటీలను ఏర్పాటు చేస్తామని పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మేధోమథన ముగింపు సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ..మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు ఈ సదస్సు ప్రాణం పోసిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామన్నారు. బాలబాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేసి అంగన్వాడీ టీచర్లతో అమ్మాయిలకుగుడ్ టచ్,బ్యాడ్‌టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళా బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామన్నారు.ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువు అవుతుందన్నారు.అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీములను ఏర్పాటు చేస్తామన్నారు.అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని, అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళా భద్రత కోసం ప్రతిష్ట విధానాలను రూపొందిస్తామన్నారు.చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.చీమలు,కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయని,దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు.పుట్టిన బిడ్డలను పారేయకుండా ఏర్పాటు చేసిన ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను మేమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ ఏర్పాటై పదేళ్లైనా ఇప్పటికీ బాల్యవివాహ నిరోధకచట్టాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం బాధాకరమన్నారు.త్వరలో రూల్స్ అడాప్ట్ చేసుకుంటామని, బాల్యవివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారని,ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింప జేశార న్నారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలని, అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామన్నారు.జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తిం చాలన్నారు. అంగన్‌వాడీ గదుల్లోని దేశ భవిష్యత్తు ఉందని, కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్‌వాడీ సిబ్బందని కొనియాడారు. కరీంనగర్లో ప్రతి శుక్ర వారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమా వేశాలు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని అధికారులకు సూచిం చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను హాజరు శాతాన్ని పెంచాలన్నారు.

## డిఇఇసెట్-2025లో 78.18 శాతం అర్హత

### 9 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:**రెండేళ్ల కోర్సు అయిన డిప్లమా ఇన్ ఎలి మెంటరీ ఎడ్యుకేషన్(డిఈడి), డిప్లమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన డిఈఈసెట్-2025 పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. పరీక్షకు హాజరైన వారిలో 78.18 శాతం మంది అర్హత సాధించారని డిఈఈసెట్-2025 కన్వీనర్ జి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన వారికి ఈ నెల 9 నుంచి 13 వరకు సర్టిపికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత ఈ నెల 14 నుంచి 17 వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. మే 25న డిఈఈ సెట్ పరీక్షను రాష్ట్రంలోని 87 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. డిఈఈ సెట్‌కి 46,615 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 33,821 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకి హాజరైన వారిలో 26,442 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 78.18 శాతం మంది అర్హత సాధించారు. తెలుగు మీడియంకి 19,900 దరఖాస్తులు రాగా. వారిలో 15,476 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 11,266 మంది(72.79 శాతం) మంది అర్హత సాధించారు. ఇంగ్లీష్ మీడియంకి 22,051 దరఖాస్తు చేసుకోగా వారిలో 16,963మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 14,646 మంది(86.34 శాతం) అర్హత సాధించారు. ఉర్దూ మీడియంలో 1664 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1382 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 530 మంది(38.35 శాతం) అర్హత సాధించారు. తెలుగు మీడియంలో తక్కళ్లపల్లి హారికకి అత్యధికంగా 77 మార్కులు సాధించింది. ఇంగ్లీష్ మీడియంలో పసునూరి అభినవ్ రెడ్డి 87 మార్కులు సాధించగా.. ఉర్దూ మీడియంలో ఫరాజ్ అహ్మద్ అత్యధికంగా 67 మార్కులు సాధించినట్టు డిఈఈ సెట్-2025 కన్వీనర్ జి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎసిబి వలలో బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త :** తూముకుంట మున్సిపాలిటీ పరిధి శామీర్పేటలో బిల్ కలెక్టర్ గా పని చేస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్ 20 వెయ్యిలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. రెండు ఇండ్ల కొనుగోలు చేసి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి వద్ద 20 వెయ్యిలు డిమాండ్ చేశారని ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. యేడాదిన్నర కాలం గా మ్యుటేషన్ కోసం తిరు గగా, శామీర్పేట్ వార్డు ఆఫీసులో పని చేసే బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్ పని చేయించేందుకు 20 వెయ్యిలు డిమాండ్ చేసినట్లు తమకు ఫిర్యాదు అందినట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ రోజు లంచం డబ్బులు తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్నట్లు ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలియజేశారు. ఈ కేసుతో ఇంకా ఎవరెవరికి సంబందాలు ఉన్నాయనే కోణంలో ఇంకా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఎసిబికి పట్టుబడిన బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్

## ఆపరేషన్ కగార్‌పై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు స్పందించాలి

### పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమానవీయంగా మావోయి స్టులను హతమార్చడం దారుణమని పిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కోరుతూ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి మధు యాష్కీగౌడ్ హాజరై ప్రసంగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హింసకు హింస సమాధానం కాదని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులతో పాటు అమాయక గిరిజనులను కూడా కాల్చి చంపుతున్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో చర్చ జరపాలని తమలాంటి వారు కోరితే అర్బన్ నక్సలైట్స్ అంటూ మాట్లాడు తున్నారని పేర్కొన్నారు. దేశంలో అత్యంత సంపన్న పార్టీ బిజెపి అని, 8వేల కోట్లకుపైగా నిధులను ఆదాని, అంబానీ లాంటి పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థల నుంచి ఈ మారణ హోమాన్ని ఆపేందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము స్పందిం చాలన్నారు. సుప్రీంకోర్టు అయినా సుమోటోగా స్వీకరించి ఆపరేషన్‌ను నిలిపి వేయించాలని కోరారు.

## పర్యావరణ రక్షణ జీవితంలో భాగం చేసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరవరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఢిల్లీలోని అధికారిక నివాసంలో మొక్కలు నాటారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యా ర్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వారికి శాలువా కప్పి అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యక తను గురించి వారికి వివరించారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, టి.చిరంజీవులు, బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కులక్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు

## ఈ యేడాదిలోనే కులగణన చేపట్టాలి

### రెండో వారంలో మేధావులతో సమావేశం: జాజుల

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** కే oద్ర ప్రభుత్వం 2025లో కులగణన ప్రారంభించి 2026లో పూర్తి చేయాలని, ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బిసి మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాం డ్ చేశారు. సమగ్ర కులగణన కోసం ఈ నెల రెండో వారంలో హైదరాబాద్ నగరంలో మేధావులతో భారీగా సమావేశాన్ని నిర్వహిస్తామని, జూలై మొదటి వారంలో ఢిల్లీలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. గురువారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా బిసిలు చేస్తున్న పోరాటానికి తలవొగ్గిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కుల గణన చేపడతామని ప్రకటించిందే కాని 2027లో మొదలు పెడతామని ప్రకటిం చడాన్ని ఎవరూ అంగీకరించరని చెప్పారు. సమావేశంలో బిసి నేతలు బాలగోని బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, శేఖర్ సగర, ఎం.చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

### అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా రాజోలిమండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కంపెనీ నిర్మా ణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు, ఇంటి స్థలాలు ఉండడం వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతందని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. నెలల తరబడి ఆందోళ నలు చేస్తున్నారని జాన్‌వెస్లీ తెలిపారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయతీ అను మతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జేసీబీలు, టిప్పర్లు, కంటైనర్లతో పాటు, బయటినుండి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని.. దానిని వ్యతిరేకించిన రైతులపై, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జీచేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

స్థానికంగా రైతుల, ప్రజల ఆమోదం లేకుండా, వారి అనుమతి లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయబోమని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తక్షణమే రిమాండ్ చేసిన రైతులను విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను శాంతియుతంగా జరపాలన్నారు. యేళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా తమ భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ రెవెన్యూ సదస్సులో తమ సమస్య చెప్పడానికి వచ్చిన వృద్ధరైతు అల్లెపు వెంకటిని మెడపట్టి గెంటేసిన పోలీస్ అధికారిని సస్పెండ్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరిపి, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పార్లమెంట్ స్టాడింగ్ కమిటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక నేతలు

## 'విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 5,541 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ వేలాది మంది కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, కార్మిక శాఖ టెక్స్‌టైల్, స్టీల్ డవలప్‌మెంట్ చైర్మన్ సభ్యుల బృందానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ నగరానికి విచ్చేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, సభ్యుల బృందానికి పోరాట కమిటి చైర్మన్ ఆది నారా యణ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో యాజమాన్యం 5541 మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయం తొల గించిందని, మూడున్నర దశాబ్దాలుగా వారు పనిచేశారని, అర్థాంతరంగా తొలగించడం దారుమన్నారు. వారిని విధుల్లోకి తీసుకుని పర్మినెంట్ చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌యాదవ్ (సిఐటియు), రెబ్బా (ఐఎన్‌టియుసి), రామారావు (హెచ్‌ఎంఎస్) తదితరులు ఉన్నారు.



# టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ కెప్టెన్‌గా పాట్ కమిన్స్

## భారత్ నుంచి యశస్వి, బుమ్రాలకు చోటు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌తో డబ్ల్యూటీసీ మూడో సైకిల్ ముగుస్తుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు టెస్టు ఛాంపియన్ షిప్ కోసంపోటీపడనున్నాయి. ఈనేపథ్యంలో క్రికెట్ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 20 23 -25 టీమ్ ఆఫ్‌ది టోర్నమెంట్‌ను ప్రకటించింది. మూడో సైకిల్‌లో రాణించినఆటగాళ్లతో కూడిన ఎలెవన్‌ను ప్రకటించింది. ఈ జట్టును ప్రక టించేందుకు కేవలం ఆటగాళ్ల గణాంకాల పైన మాత్రమే ఆధారపడలేదు. వివిధ పరిస్థితుల్లో ఆటగాళ్ల చూపిన ప్రదర్శన ఆధారంగా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ జట్టులో భారత్ కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. ఇందులో ఒకరు యువఆటగాడు యశస్వి జైస్వాల్ కాగా, రెండోఆటగాడు బుమ్రాకావడం విశేషం. డబ్ల్యూటీసీ మూడోసైకిల్‌లో జైస్వాల్ 19 టెస్టులు ఆడి 1798 పరుగులు చేశాడు. ఇందులో 4శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. మరోవైపు బుమ్రా 15 టెస్టులు ఆడి 77వికెట్లు తీశాడు. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లు పడ గొట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన పాట్‌కమిన్స్ కెప్టెన్‌గా ఎంపిక అయ్యాడు. ఆసీస్‌కే చెందిన ఉస్మాన్ ఖవాజా, అలెక్స్ కేరీలు కూడాజట్టులో చోటుదక్కించుకున్నారు. న్యూజి లాండ్ నుంచి కేన్ విలిమయ్సన్, మాట్ హెన్రీలు చోటు దక్కించుకోగా ఇంగ్లాండ్ నుంచి జోరూట్, హ్యారీ బ్రూక్‌లు అవకాశం దక్కించుకున్నారు. శ్రీలంక నుంచి కమిందు మెండిస్,పాకిస్థాన్ నుంచి నోమన్ అలీలు జట్టులో చోటు దక్కించుకున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2023-25 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ జట్టులో పాట్ కమిన్స్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఉస్మాన్ ఖవాజా, కేన్ విలియమ్సన్, జో రూట్, హ్యారీ బ్రూక్, కమిందు మెండిస్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, మాట్ హెన్రీ, నోమన్ అలీ, కగిసో రబాడను 12వ ఆటగాడిగా తీసుకుంది.



ఆర్చరీ మహిళల ప్రపంచ కప్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ టీమ్

## రికర్వ్ ఈవెంట్‌లో మిశ్రమ ఫలితాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 లో మధుర ధమన్ గోంకర్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది, కాంపౌండ్ మహిళల అర్హత రౌండ్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది, గురువారం జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించడంతో భారత్ మూడవ సీడింగ్‌ను సాధించడానికి మరియు క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశించడానికి సహాయపడింది. మూడేళ్ల తర్వాత గత నెలలో అంతర్జాతీయ సర్క్యూట్‌లోకి అద్భుతంగా పునరాగమనం చేసిన మధుర, షాంఘై స్టేజ్ 2లో అభిషేక్ వర్మతో కలిసి వ్యక్తిగత స్వర్ణం, మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం మరియు మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో మూడు పతకాలను గెలుచుకుంది. అంటాల్యలో, ఆమె దక్షి ణ కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్ (603) కంటే కేవలం మూడు పాయింట్లు వెనుకబడి ఉంది. ఆమె టాప్‌ఫోర్ ఫినిషింగ్‌తో, మధుర వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ యొక్క రెండవ రౌండ్‌లో కూడా బై పొందింది. పోటీలో ఉన్న ఇతర భారతీయ మహిళలలో, చికిత్స తనిపర్తి 11వ స్థానంలో నిలిచి తర్వాతి స్థానంలో నిలిచింది, అయితే బహుళ ప్రపంచ కప్ బంగారు పతక విజేత జ్యోతి సురేఖ వెన్నం స్వల్ప ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల కాంపౌండ్ విభాగంలో, భారత్ జట్టు ఈవెంట్‌లో ఐదవ స్థానాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత అర్హతలో రిషబ్ యాదవ్ భారత త్రయంలో అత్యుత్తమంగా 13వ స్థానంలో నిలిచాడు, అనుభవజ్ఞుడైన అభిషేక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ డియోటలే వరుసగా 29వ మరియు 34వ స్థానాల్లో నిలిచారు. కాగా భారత్‌కు రికర్వ్ ఈవెంట్‌లు మిశ్రమ ఫలితాలను వచ్చాయి. పురుషుల అర్హత రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర 13వ స్థానంలో, అతాను దాస్ 15వ స్థానంలో, గత ప్రపంచ కప్ దశలో కాంస్యం గెలిచిన పార్థ్ సలుంఖే 26వ స్థానంలో నిలిచారు, జట్టు ఐదవ ర్యాంకింగ్‌తో ముగిసింది. అయితే భారత మహిళల రికర్వ్ ఆర్చర్లు ఇబ్బంది పడ్డారు. మాజీ ప్రపంచ నంబర్ 1 దీపికా కుమారి 35వ స్థానంలో నిలవగా, అంకితా భకత్ (33వ) అత్యుత్తమ స్థానంలో నిలిచింది. సిమ్రంజీత్ కౌర్ 54వ స్థానంలో నిలిచారు, మహిళల జట్టు 12వ స్థానంలో నిలిచింది.

చరిత్ర సృష్టించిన

# జకోవిచ్

## వరల్డ్ మూడో ర్యాంకర్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ 2025 టోర్నీలో సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు. పురుషుల క్వార్టర్ ఫైనల్లో 38 ఏళ్ల వయసున్న నొవాక్ జకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్



అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ని ఓడించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు పూర్తి చేసుకున్నాడు. రఫెల్ నాదల్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా జకోవిచ్ నిలిచాడు. అంతేకాకుండా జకోవిచ్‌కు ఇది 51వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్. ఇది ఒక కొత్త రికార్డు. మూడు గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన జ్వెరెవ్ 6 4తో సొంతం చేసుకున్నాడు. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత జకోవిచ్ తన ఆటను మెరుగుపర్చుకున్నాడు. అద్భుతమైన డ్రాప్ షాట్స్, బలమైన డిఫెన్స్‌తో జ్వెరెవ్‌ను ఇబ్బంది పెట్టాడు. జకోవిచ్ తన అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌పై పట్టు సాధించాడు. కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లను మార్చుకోవడంలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏఎస్‌లతో పాటు 42 విన్నర్లు కొట్టాడు. 29 తప్పిదాలు చేసిన అతడు 35 డ్రాప్ షాట్స్ ఆడి 121 పాయింట్స్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 4 ఏస్‌లు, 38 విన్నర్స్ కొట్టాడు. 44 అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్ 12 డ్రాప్ షాట్స్ మాత్రమే ఆడి 101 పాయింట్స్ సాధించాడు.



ఇండోనేసియా ఓపెన్‌లో..

# సింధు, ట్రీసా-గాయత్రీ ఔట్

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్-2025 టోర్నమెంట్ నుండి భారత క్రీడాకారిణి పివి సింధు వైదొలగింది. గురువారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో థాయిలాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో ఓడిపోవడంతో సింధు ఇండోనేషియా ఓపెన్ 2025 నుండి నిష్క్రమించక తప్పలేదు. ఈ టోర్నీమెంట్‌లో సింధు ఉత్సాహంగా ఆరంభించి, 10-16తో వెనుకబడినప్పటి నుండి కోలుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, చోచువాంగ్ రెండవ గేమ్‌లో ధీటుగా స్పందించి, 21-10తో ఆధిక్యాన్ని ముగించే ముందు 10 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

నిర్ణయాత్మక జట్టు చాలా వరకు హోరాహోరీగా సాగింది, కానీ చివరి దశలో చోచువాంగ్ ఆడి మ్యాచ్‌ను 21-18తో ముగించింది. ఇక మహిళల డబుల్స్ ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 16వ రౌండ్ దశలో జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా మరియు మయు మట్సుమోటో చేతిలో 13-21, 22-24 తేడాతో ఓడిపోయారు.

వాలీబాల్ నేషన్స్ లీగ్‌లో

ఛాంపియన్‌గా

# ఇరాన్



## 3-0తో భారత్ క్లీన్ స్వీప్

**న్యూఢిల్లీ:** పురుషుల నేషన్స్ లీగ్-2025 టోర్నీ ఫైనల్లో ఇరాన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన ఫైనల్‌లో టాప్ సీడ్ ఇరాన్‌వరుస గేమ్‌లతో విజయం సాధించి భారత్‌ను క్వీన్ స్వీప్ చేసింది. దీంతో భారత్ 0-3 తేడాతో ఓటమి పాలైంది. ఉజ్బెకిస్తాన్‌లోని ఫెర్గానాలో జరిగిన సిఎవిఎ నేషన్స్ లీగ్ ఫైనల్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు ప్రచారం ముగిసింది. చాలా ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ఇరానియన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ప్రపంచ 15వ ర్యాంక్‌లో ఉన్న టాప్ సీడ్ ఇరానియన్ జట్టు, రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ ఈవెంట్‌లో ఆడుతున్న అనుభవం లేని భారత జట్టుపై 25 -17, 25-20, 25-19 సునాయాసంగా విజయం సాధించింది. కాగా గ్రూప్ దశలో భారత్ ఇరాన్‌పై విజయం సాధించింది. కానీ ఈసారి ఆసియాలో రెండవ అత్యుత్తమ జట్టుకు పెద్దగా సవాలు విసరలేకపోయింది, నెట్‌లో వారి అనేక డిఫెన్సివ్ బ్లాక్‌లను పూర్తి చేయడంలో విఫలమైంది. అన్‌సీడెడ్ జట్టు అయినప్పటికీ, భారతదేశం తన తొలి ప్రచారాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. రెండవ దశలో పాకిస్తాన్ మరియు కజకిస్తాన్‌పై గట్టి విజయాలు సాధించడంతో సహా వరుసగా నాలుగు విజయాలతో ఫైనల్‌కు చేరుకుంది. సీనియర్ పోటీలు ముగియడంతో, అందరి దృష్టి ఇప్పుడు సిఎవిఎ అండర్ 16 బాలుర వాలీబాల్ ఛాంపియన్ షిప్ మరియు యు19 పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ వైపు మళ్లుతుంది. ఈ రెండూ జూన్ 10న తాష్కెంట్‌లో ప్రారంభమవుతాయి. అండర్ 16 ఈవెంట్‌లో ఆరు జట్లు పాల్గొంటాయి. కజకిస్తాన్, పాకిస్తాన్, ఇరాన్, కిర్గిజ్స్తాన్, అండర్ 19 పోటీలో భారత్, ఇరాన్, కిర్గిజ్స్తాన్ పాల్గొంటాయి.

# బ్రిటానియా ఫ్యాక్టరీ మూసివేత, కారణాలు

**ముంబై, జూన్ 5:** బ్రిటానియా ఇండస్ట్రీస్. ఇది దాదాపు 132 సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రతి ఇంట్లో తెలిసిన పేరు. బిస్కెట్ల వంటి అత్యంత ప్రాథమిక ఆహార పదార్థాల ఉత్పత్తిలో భారత దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడమే కాకుండా, దేశం లోని మొట్టమొదటి ఎఫ్ఎంసిజి కంపెనీలలో ఇది ఒకటి. కానీ



నేడు భారతదేశం నుండి పెద్ద మొత్తంలో బిస్కెట్లు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు బ్రిటానియాఇండస్ట్రీస్ దాని పురాతన కర్మాగారాలలో ఒక దాన్ని మూసివేయబోతోంది. దీనికి దేశ స్వాతంత్ర్యంతో సంబంధం కూడా ఉంది. ముంబై హైకోర్టు నిర్ణయాన్ని కొట్టి వేస్తూ సుప్రీం కోర్టు, మూడు దశాబ్దాలకు పైగా బిస్కెట్లు తయారు చేసిన బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిఐఎల్) కంపెనీని మూసి వేయడానికి అనుమతి ఇచ్చింది. ఫిబ్రవరి 17, 2023 నాటి హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హరి నగర్ షుగర్ మిల్స్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎంఎల్) దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ మరియు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఈ తీర్పు ఇచ్చారు. హెచ్ఎస్ఎంఎల్ గతంలో తన ఉద్యోగులకు రూ.10 కోట్లు గుడ్‌విల్‌గా ఇవ్వడానికి ముందుకొచ్చింది. కానీ కోర్టు ఈమొత్తాన్ని రూ.15కోట్లకు పెంచింది. ఎనిమిది వారాల్లోపు చెల్లించాలని కూడా కోరింది. ఈ కంపెనీని మూసి వేయడం వల్ల కొంతమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందని, మరికొందరు ఎటువంటి తప్పు లేకుండా నిరుద్యోగులుగా మారే అవకాశంఉందని పరిగణనలోకి తీసుకుని హెచ్ఎస్ఎంఎల్ తీసుకున్న ఈ చర్యను మేము అభినందిస్తున్నాము. అలాంటి ప్రకటనలు రికార్డులో నమోదు చేసినట్లు కోర్టు పేర్కొంది. హెచ్ఎస్ఎంఎల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, గుడ్‌విల్ మొత్తాన్ని పెంచడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను కోర్టుకే వదిలేశారు. అప్పీలుదారుల ఆఫర్‌ను రూ.5 కోట్లు పెంచడం న్యాయమైనదని తాము భావిస్తున్నామని తెలిపింది. అందువల్ల, మా ఆర్డర్‌లో ఆ మొత్తం రూ.10 కోట్లకు బదులుగా రూ.15 కోట్లు అవుతుంది. మొత్తాన్ని విడుదల చేయడానికి ఎనిమిది వారాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదని సూచించింది.

# ఎఐతో ఉద్యోగాలు పోవడం కంటే అదే డేంజర్: డీప్ మైండ్ సిఇఒ

**వాషింగ్టన్, జూన్ 5:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సర్వం ఎఐ మయమవుతుందన్న వాదనలు వినిపిస్తున్న వేళ ఈ సాంకేతికతపై గూగుల్ డీప్‌మైండ్ సిఇఒ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. కృత్రిమ మేధ దుర్వినియోగంపై డెమిస్ ఆందోళన వ్యక్తం చేశారు. మనుషల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేస్తుందనే విషయం తనకు ఆందోళన కలిగించడం లేదని ఆ సాంకేతికత చెడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తేనే అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిమాణాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు. అయితే ఈ శక్తివంతమైన సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనుల్ని సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు. ఎఐ వల్ల ఎంట్రీ లెవల్ వైట్-కాలర్ ఉద్యోగాలు తగ్గుముఖం పడతాయని డెమిస్ అన్నారు. సాధారణ పనుల్ని ఎఐ చేయడంతో మానవులు మరింత ముఖ్యమైన పనులపై దృష్టిపెట్టగలరని తెలిపారు. అప్పుడు మరింత నైపుణ్యంతో కూడిన ఉద్యోగావకాశాలు వస్తాన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎఐ శక్తి, వినియోగం పెరిగేకొద్దీ దాని దుర్వినియోగాన్ని ఆపేందుకు ప్రపంచవ్యాప్తంగా సహకారం అవసరమన్నారు.



# ఆర్‌బిఐ రేట్ల కోత అంచనాలతో సూచీల్లో లాభాలు

**ముంబై, జూన్ 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. ఐటీ, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోలుదారులుగా నిలవడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 800 పాయింట్లు మేర రాణించింది. సెన్సెక్స్ ఉదయం 81,196.08 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ ఇంట్రాడేలో 81,911.13



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 443 పాయింట్ల లాభంతో 81,442 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,899 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 130 పాయింట్ల లాభంతో 24,750 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.10 డాలర్ల వద్ద ట్రేడగగా, బంగారం ఔన్సు 3,413 డాలర్ల వద్ద కొనసాగింది.

# పన్నుల చెల్లింపుల్లో అదానీ రికార్డు

**ముంబై, జూన్ 5:** దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ రికార్డు సృష్టించింది. లిస్టెడ్ సంస్థల పోర్ట్‌ఫోలియో ద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 74,945 కోట్ల రూపాయల పన్నులను చెల్లించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం 2023 24తో పోల్చుకుంటే 29 శాతం అధికం. ఆ ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ మొత్తం 58,104 కోట్ల రూపాయల మేర పన్నులు చెల్లించగా, ఇప్పుడీ మొత్తం 74,945 కోట్ల రూపాయలకు చేరింది. ఈ మొత్తం దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పర్చడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో అదానీ గ్రూప్ ఏ స్థాయిలో భాగస్వామ్యం వహిస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 74,945 కోట్ల రూపాయల్లో ప్రత్యక్ష పన్నుల వాటా 28,720 కోట్ల రూపాయలు. పరోక్ష పన్నుల వాటా 45,407 కోట్ల రూపాయలు. ఇతరత్ర పన్నుల మొత్తం 818 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. పన్నుల చెల్లింపులో రికార్డు సృష్టించిన అదానీ కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించడానికి అవసరం అయ్యే ఖర్చుతో దాదాపుగా ఇది సమానం. ఆధునిక ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి కూడా ఈ మొత్తం దాదాపు సరిపోతుంది. అలాగే కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో జీవనాడిగా నిలుస్తుందని అదాని గ్రూప్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అదానీ గ్రూప్ పబ్లిక్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ సిమెంట్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఈ పన్నుల చెల్లింపుల్లో కీలకంగా మారాయి. పన్నుల రూపేణా వేల కోట్ల రూపాయల మేర నిధులను ప్రభుత్వ ఖజానాకు సమకూర్చాయి. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్, అదానీ పవర్ లిమిటెడ్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్‌తో పాటు ఎన్డీటీవీ, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్ కూడా పన్నులు చెల్లించిన లిస్టెడ్ సంస్థల జాబితాలో ఉన్నాయి. ఈ గ్రూప్.. తన ఏడు సంస్థల వెబ్‌సైట్లలో బేసిస్ ఆఫ్ ప్రిపరేషన్ అండ్ అప్రోచ్ టు ట్యాక్స్ అనే పేరుతో ఓ డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచింది. పన్నుల చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరిచింది. ప్రపంచవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియో కంపెనీలు కొనసాగించే వ్యాపార, వాణిజ్య లావాదేవీల ద్వారా వచ్చే పన్నులు, సుంకాలు, ఇతర ఛార్జీలను ప్రత్యక్ష పన్నుల జాబితాలో చేర్చిందీ సంస్థ. ఇతర స్టేక్ హోల్డర్ల నుంచి సేకరించిన పోర్ట్‌ఫోలియో కంపెనీలకు సంబంధించిన మొత్తం చెల్లింపులను ఇండైరెక్ట్ ట్యాక్సుల్లో కలిపింది. అదానీ గ్రూప్ పన్ను పార



దర్శకతను సంస్థ కార్యకలాల్లో కీలకంగా పరిగణిస్తోంది. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తోన్నామని పేర్కొంది. సకాలంలో పన్నుల చెల్లింపు తమ సంస్థ పారదర్శకత, దేశ సమగ్రాభివృద్ధిలో చిత్తశుద్ధికి అద్దం పడుతోందని వెల్లడించింది.

# వాణిజ్యం

## మార్కెట్లో టాటా వర్సెస్ హ్యుందాయ్

**ముంబై, జూన్ 5:** టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్ బ్యాక్ 2025 ఆల్ట్రోజ్ రిఫ్రెష్ చేసింది. ఈ ప్రీమియం కారు రూ.6.89లక్షల నుంచి రూ.11.49 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభధరలతో అందుబాటులో ఉంది. ఈ అప్డేట్ ఆల్ట్రోజ్‌ను ఈ విభాగంలోని కీలక పోటీదారులైన హ్యుందాయ్ ఐ20, మారుతి బాలెనో మరియు టయోటా గ్లాంజాతో పోటీ పడేలా చేసింది. ధర, సెగ్మెంట్ ప్లేస్మెంట్ పోల్చదగినవి అయినప్పటికీ ఫేస్లిఫ్ట్ ఆల్టోజ్ ఆకర్షణను విస్తృతం చేయడంలో సహాయపడ టానికి మరిన్ని ఫీచర్లు, విస్తృత శ్రేణి పవర్ ట్రెయిన్ ఎంపికలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఆల్ట్రోజ్ కారుకు హ్యుందాయ్ ఐ20తో కార్ల మధ్య ప్రధాన తేడాలను చూద్దాం. 2025 ఆల్ట్రోజ్ లుక్‌లో మాత్రం పెద్దగా మార్పు లేదు. ఫ్లష్‌టైప్ డోర్ హ్యాండిల్స్ అవుటర్ లుక్‌కు ఆధునిక, అధునాతన రూపాన్ని ఇస్తున్నాయి. ఈ కారు వెనుక కనెక్ట్ చేసిన ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్‌ను ఆధునిక టచ్‌ను అందిస్తాయి. ఈ కారు ఫ్రంట్ ఎండ్ లైటింగ్లో కూడా అప్ గ్రేడ్‌తో వస్తుంది. ఆటో



మేటిక్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌లు, ఎల్ఈడీ ఫాగ్ లాంప్‌లు కార్నరింగ్ ఫంక్షన్‌తో ఆకట్టుకుంటుంది ఈ రెండు అప్‌గ్రేడ్‌లు ఫ్రంట్ ఎండ్ స్టైలింగ్‌ను మెరుగుపరుస్తాయి. ఆటోఫోల్డింగ్ అవుట్ సైడ్ మిర్రర్లు, 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ కూడా వాహనానికి సంబంధించిన కర్బ్ సైడ్ ఆకర్షణకు సహాయపడతాయి. అందువల్ల ఆల్టోజ్ సెగ్మెంట్‌లోని మరింత విలాసవంతమైన హ్యాచ్‌బ్యాక్‌లతో పోటీపడడానికి ఉన్నత స్థాయి అనుభూతిని ఇస్తుంది. 2025 టాటా ఆల్టోజ్, హ్యుందాయ్ 20 ఫీచర్లలో దగ్గరగా సరిపోతాయి. అయితే కొన్ని కీలక అంశాలలో విభిన్నంగా ఉంటాయి. అవుటర్ వ్యూలో రెండూ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డీఆర్ఎల్‌లు, అల్లాయ్‌వీల్స్, ఆటో ఫోల్డింగ్ ఓఆర్‌వీఎంలతో వస్తాయి. ఆల్టోజ్ కార్నరింగ్, కనెక్టెడ్ టెయిల్ లైట్లు, ఫ్లష్‌టైప్‌డోర్ హ్యాండిల్స్ ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్లతో ఆకట్టుకుంటుంది. అయితే ఐ20లో పుడిల్ ల్యాంప్‌లతో ఆకట్టుకుంటున్నాయి. ఇంటీరియర్ విషయానికి వస్తే ఆల్టోజ్‌లో బ్లాక్‌బీజ్ థీమ్, ఫ్యాబ్రిక్ అప్హోల్స్టరీ, మల్టీ కలర్ యాంబియంట్ లైటింగ్, టచ్‌బేస్డ్ ఏసీ ప్యానెల్‌తో కూల్డ్ గ్లోబ్బాక్స్‌లతో ఆకట్టుకుంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.